గోన గన్నారెడ్డి
రూ॥ 230/-
పేజీలు: 266




ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★


ఫ్యాక్టరీ మేనేజిమెంట్ ఎదుట
## కార్మికులు గొంతెత్తలేరు
సిగాచి ఫ్యాక్టరీ పేలుళ్ల ఘటనపై హైకోర్టు వ్యాఖ్య
07


సంపుటి 28, సంచిక: 170 | బుధవారం | 10-12-2025 | హైదరాబాద్    Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar    పేజీలు: 12 | వెల రూ. 5.00



04



## రూ.5.75 లక్షల కోట్లు
### పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిన కంపెనీలు
తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో ప్రభుత్వంతో ఒప్పందాలు

ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025లో రాష్ట్రానికి పెట్టుబడులు వెల్లువెత్తాయి. ఈ గ్లోబల్ సమ్మిట్‌లో రూ.5.75 లక్షల కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు వివిధ కంపెనీలు ప్రభుత్వంతో ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు వివిధ కంపెనీలు ఆసక్తి చూపుతూ మొదటి రోజు రూ.2.43 లక్షల కోట్లు, రెండోవ రోజు రూ.3.32 లక్షల కోట్లకు ఎంఒయులు కుదుర్చుకున్నారు.

# అట్టడుగు వర్గాల పేదల అభివృద్ధికే

"రాబోయే రెండు దశాబ్దాల్లో రాష్ట్రాన్ని సమగ్రంగా, సమ్మిళితంగా, సుస్థిరంగా అభివృద్ధి చేసే దిశగా భవిష్యత్తుకు బాటలు వేసే దార్శనిక పత్రం తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ రూపుదిద్దుకుంది."

**తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ రూపొందించాం**

- ప్రతి పేదకూ సంక్షేమం అందించాలన్నదే మా తపన
- పేదరిక నిర్మూలన, నాణ్యమైన విద్య, ఉపాధి కల్పన సంకల్పంతో సాగుతున్నాం
- విద్య, నీటిపారుదల రంగం, కమ్యూనికేషన్ నినాదంతో ముందుకెళ్తున్నాం
- స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమాన అవకాశాల కోసం తెలంగాణ ఎదురుచూస్తోంది
- భారత్ ఫ్యూచర్ సిటీలో 2047 విజన్ డాక్యుమెంట్ విడుదలలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

అట్టడుగు వర్గాల పేదల అభివృద్ధి కోసమే 'తెలంగాణ రైజింగ్–2047 విజన్ డాక్యుమెంట్' అని ముఖ్యమంత్రిఎ.రేవంత్ రెడ్డి వెల్లడించారు. పేదల కష్టాలు తెలిసినవాడిగా ప్రతీ పేదవాడికి సంక్షేమం అందించాలన్నదే తన తపన అని, పేదరిక నిర్మూలన, నాణ్యమైన విద్య, యువతకు ఉపాధి అందించాలనే సంకల్పంతో తాము ముందుకు వెళ్తున్నామని తెలిపారు. భారత్ ఫ్యూచర్ సిటీలోని 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025' కార్యక్రమంలో మంగళవారం 'తెలంగాణ రైజింగ్–2047 విజన్ డాక్యుమెంట్'ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మహీంద్రా గ్రూప్ చైర్మన్, ఆనంద్ మహీంద్రా, ఆర్‌బిఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు, కాలిఫోర్నియా ఎకనమిక్ ప్రొఫెసర్ కార్తిక్ మురళీధరన్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, సినీ నటుడు చిరంజీవి, మంత్రులు, దేశ, విదేశాల ప్రముఖులు,

తరువాయి 2లో

### 3 ట్రిలియన్ వృద్ధి లక్ష్యం.. మూడంచెల తంత్రం
'తెలంగాణ రైజింగ్ 2047' డాక్యుమెంట్ ఆవిష్కరణ
02




## బలమైన సంకల్పం తీసుకున్నాం...

- తెలంగాణ తల్లి ఆశీర్వాద స్ఫూర్తితో సంక్షేమం, అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తాం
- ఆరు దశాబ్దాల ప్రజల ఆకాంక్షలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చింది
- భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి అన్ని జిల్లా కలెక్టరేట్లలో తెలంగాణ తల్లి విగ్రహాలు ఆవిష్కరించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రజల ఆలోచనలను, దళితులు, గిరిజనులు, ఆదివాసీలు, మైనార్టీల ఆకాంక్షలను నెరవేర్చేందుకు ప్రతినిత్యం స్ఫూర్తిని పొందాలని, 'తెలంగాణ తల్లి ఆశీర్వాద స్ఫూర్తి'తో సంక్షేమం, అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లే విధంగా బలమైన సంకల్పం తీసుకున్నామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. 2004 లో కరీంనగర్ గడ్డపై నుంచి తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తామని సోనియా గాంధీ ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారని, నాలుగు కోట్ల ప్రజల

తరువాయి 2లో

## రాష్ట్రానికి రండి..



- త్రీ ట్రిలియన్ డాలర్ ఎకానమీ లక్ష్య సాధనకు ప్రైవేట్ ప్రభుత్వ భాగస్వామ్యాలు అనివార్యం
- పెట్టుబడులు పెట్టండి.. కలిసి పని చేద్దాం
- పారిశ్రామిక, వాణిజ్య వర్గాలకు డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క పిలుపు

ప్రజాపక్షం/హైదరాబాద్

త్రీ ట్రిలియన్ డాలర్ ఎకానమీ లక్ష్య సాధనకు ప్రైవేట్ ప్రభుత్వ భాగస్వామ్యాలు అనివార్యమని, రండి రాష్ట్రంలో పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టండి కలిసి పనిచేద్దామంటూ తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ వేదికగా పారిశ్రామిక,వాణిజ్య వర్గాలకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు పిలుపునిచ్చారు. మంగళవారం గ్లోబల్ సమ్మిట్ వేదికలో నిర్వహించిన హెర్నెస్సింగ్ ప్రైవేట్ క్యాపిటల్ టువార్డ్స్ పబ్లిక్ గుడ్ అనే అంశంపై జరిగిన చర్చా గోష్టిలో ఉపముఖ్యమంత్రి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒఆర్ఆర్, ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్, మెట్రో రైలు వంటి భారీ ప్రాజెక్టులు ప్రైవేట్ ప్రభుత్వ భాగస్వామ్యం ద్వారానే సాధ్యం అయ్యాయని తెలిపారు. తెలంగాణ రైజింగ్ సమ్మిట్‌లో తెలంగాణ రైజింగ్ విజన్ 2047 లక్ష్యంగా పెట్టుకున్న 3 ట్రిలియన్ అమెరికా డాలర్ ఆర్థిక వ్యవస్థ రోడ్‌మ్యాప్‌ను ఆవిష్కరిస్తున్న ఈ సందర్భంలో

తరువాయి 12లో

## 13 లక్షల మందికి ఉద్యోగాలొస్తాయ్



- ప్రపంచస్థాయి నగరంగా భారత్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధి
- 13,500 ఎకరాల్లో జీరో కార్బన్ సిటీగా రూపాంతరం
- ఆరు అర్బన్ జిల్లాలుగా ఏర్పాటు
- ఐటి పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడి

ప్రజాపక్షం/హైదరాబాద్

దేశీయ, అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించే ప్రపంచ స్థాయి నగరంగా భారత్ ఫ్యూచర్ సిటీని అభివృద్ధితో పాటు 13 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయని ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. అద్భుతమైన మౌలిక వసతులతో ఏర్పాటయ్యే ఈ నగరాన్ని 13,500 ఎకరాలలో జీరో కార్బన్ సిటీగా రూపొందించనున్నట్టు తెలిపారు. 'భారత్ ఫ్యూచర్ సిటీ, యాజ్ ఏ మ్యాగ్నెట్ ఫర్ 3 ట్రిలియన్ డాలర్స్ తెలంగాణా' అనే అంశంపై ప్రభుత్వ ప్రణాళికలను మంగవారం నాడు ఆయన గ్లోబల్ సమ్మిట్ లో వివరించారు. భవిష్యత్ నగరాన్ని ఆరు అర్బన్ జిల్లాలుగా అభివృద్ధి చేయనున్నట్టు ఆయన తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, హెల్త్ సిటీ, ఎంటర్‌టెయిన్ మెంట్, క్రీడలు,

తరువాయి 12లో

## సర్.. కొనసాగాల్సిందే






- ప్రక్రియ జరిగేలా చూడాలని రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు ఆదేశం
- బిఎల్‌ఒలను బెదిరిస్తారా అని అసహనం
- ఇది అరాచకత్వానికి దారితీస్తుందని వ్యాఖ్య
- అలాంటి కేసులు తమ దృష్టికి తీసుకురావాలని ఇసికి ఆదేశం

**న్యూఢిల్లీ :** ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్) 2.0లో భాగంగా పనిచేస్తున్న బూత్ లెవల్ ఆఫీసర్లు(బిఎల్ఒ), ఇతర అధికారులు, బెంగాల్ సహా ఇతర రాష్ట్రాల్లో బెదిరింపులకు గురవుతుండడాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా పరిగణించింది. ఇలాంటి కేసులను తమ దృష్టికి తీసుకురావాలని ఎన్నికల కమిషన్ (ఇసి)ని కోరింది. లేకుంటే 'ఇది అరాచకానికి దారితీస్తుంది' అని వ్యాఖ్యానించింది. సర్ కొనసాగించాల్సిందేనని, ఈ ప్రక్రియ జరిగేలా చూడాలని ఆయా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలని ఆదేశించింది. వాస్తవానికి ఇసి చేపట్టిన ఎస్ఐఆర్ 2.0కు వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు ఏమాత్రం సహకరించడం లేదు. దీనిని తీవ్రంగా పరిగణించాలని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జోయ్‌మాల్య బాగ్చిలతో

తరువాయి 12లో

## బిజెపిది అతిపెద్ద
# దేశ వ్యతిరేక చర్య



"1948 జనవరి 30న మూడు బుల్లెట్లు మహాత్మా గాంధీ ఛాతీలోకి దూసుకుపోయాయి. నాథూరామ్ గాడ్సే మన జాతిపితను హత్య చేశారు. ఇప్పుడు మన స్నేహితులు (బిజెపి వారు) ఆయనను హత్తుకోరు, అలాగని దూరంగా నెట్టరు. ఎందుకంటే ఆయన ఒక ఇబ్బందికరమైన వాస్తవం. కానీ ఆ కార్యక్రమం అక్కడితో ముగియలేదన్నారు. ప్రతి ఒక్కటి, అన్ని సంస్థలు, ఓటు నుండి ఉద్భవించాయి.కాబట్టి ఓటు నుండి ఉద్భవించిన అన్ని సంస్థలను ఆర్‌ఎస్‌ఎస్ స్వాధీనం చేసుకోవాలని చూస్తుంది. గాంధీజీ హత్య తర్వాత, వారి తదుపరి దశ కార్యక్రమం భారతదేశ సంస్థాగత చట్రాన్ని టోకుగా స్వాధీనం చేసుకోవడం''

– రాహుల్‌గాంధీ

- ఎలక్షన్ కమిషన్‌తో కుమ్మక్కై ఓటు చోరీకి పాల్పడింది
- భారత దేశ భావనను నాశనం చేసింది
- ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసేందుకు ఇసిని తమకు అనుకూలంగా ఉపయోగించుకుంటోంది
- ఎన్నికల సంస్కరణలపై లోక్‌సభలో చర్చలో రాహుల్‌గాంధీ విమర్శ
- ప్రభుత్వానికి మూడు ప్రశ్నలు సంధించిన ప్రతిపక్ష నేత
- సర్‌ను నిలిపివేయాలని, బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలని ప్రతిపక్షాల డిమాండ్

**న్యూఢిల్లీ :** ఎన్నికల కమిషన్‌తో బిజెపి కుమ్మక్కై ఓటు చోరీ'కి పాల్పడిందని, భారతదేశ భావనను నాశనం చేసిందని, తద్వారా బిజెపి అతిపెద్ద దేశ వ్యతిరేక చర్యకి పాల్పడిందని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు చేశారు.భారత ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసేందుకు బిజెపి ఎన్నికల కమిషన్‌కు ఆదేశాలిస్తూ, తమకు అనుకూలంగా ఉపయోగించుకుంటుందని విమర్శించారు. తాను వేస్తున్న మూడు ప్రశ్నలు ఈ అంశం స్పష్టం చేస్తున్నాయని అన్నారు. ఎన్నికల సంస్కరణలపై లోక్‌సభలో మంగళవారం జరిగిన చర్చలో ఆయన పాల్గొంటూ ఆ మూడు ప్రశ్నలను సంధించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్, ఎన్నికల కమిషనర్ల నియామకం కోసం ఏర్పాటు చేసిన ఎంపిక కమిటీ నుంచి భారత ప్రధాన న్యాయమూర్తిని ఎందుకు తొలగించారని ప్రశ్నించారు. ఎన్నికల కమిషనర్ ఎవరు అవుతారనే అంశంపై ప్రధాని నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా ఎందుకు అంత ఆసక్తి చూపుతున్నారని అన్నారు. భారత చరిత్రలో

తరువాయి 2లో

## మార్చి 14 నుంచి టెన్త్ పరీక్షలు

- ఏప్రిల్ 16 వరకు కొనసాగనున్న ఎగ్జామ్స్
- షెడ్యూల్ విడుదల చేసిన ఎస్ఎస్‌సి బోర్డు
- నెలరోజుల పాటు నిర్వహణ ఏమిటని ప్రజాసంఘాల పెదవివిరుపు

ప్రజాపక్షం/హైదరాబాద్

ఎస్ఎస్‌సి (టెన్త్‌క్లాస్) వార్షిక పరీక్షల షెడ్యూల్‌ను ఎస్ఎస్‌సి బోర్డు మంగళవారం విడుదల చేసింది.. 2026మార్చి 14 నుంచి ప్రారంభం కానున్న ఈ పరీక్షలు ఏప్రిల్ 16వ తేదీన ముగియనున్నాయి. పరీక్షలు ఉదయం 9.30 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 12.30 గంటలకు వరకు కొనసాగనున్నాయి. ఇందులో ప్రథమ భాష (గూప్‌ఎ)పార్ట్ 1, 2 పరీక్షలు మధ్యాహ్నం 12.45 గంటలకు కొనసాగనున్నాయి. ఫిజికల్ సైన్స్ పరీక్ష, బయాలజీ పరీక్షలు ఉదయం 11 గంటల వరకు వోకేషనల్ (త్రిరీ) పరీక్ష 11.30గంటలకు

తరువాయి 12లో

అజయ్‌భవన్ సీనియర్ రెడ్‌గార్డ్
### కామ్రేడ్ అమ్రీక్ సింగ్ ఆకస్మిక మృతి
12





# ప్రపంచం
WORLD NEWS

### ఆస్ట్రేలియాలో భారత సంతతి వ్యక్తికి జీవిత ఖైదు

**సిడ్నీ:** ఆస్ట్రేలియాలో భారత సంతతికి చెందిన ఒక సిక్కు వయోజనుడు రాజ్ విందర్ సింగ్ జీవితకాల జైలుశిక్షకు గురయ్యాడు. ఒక యువతిని 2018లో అత్యంత కిరాతకంగా హత్య చేసినందుకుగాను న్యాయస్థానం రాజ్‌విందర్ సింగ్‌కు ఈ శిక్ష విధించింది.
టోయా కార్డింగ్లీ అనే 24 ఏళ్ళ వయసుగల యువతి ఉదయమే తన పెంపుడు కుక్కను తీసుకుని వాకింగ్‌కు వెళ్ళినప్పుడు రాజ్‌విందర్ ఆమెను వెంబడించి అత్యంత కిరాతకంగా హత్య చేశాడు. ఆమెను గొంతుకోసి చంపే ముందుగా 26 సార్లు కత్తితో పొడిచాడు. విచిత్రమైన విషయం ఏమిటంటే కోర్టులో విచారణ సందర్భంగా హతురాలు హంతకుడు ఇద్దరూ అపరిచితులని నిర్ధారణ అయింది. వారిద్దరిమధ్యా గతంలో ఎలాంటి పరిచయం లేదు. అందువల్ల కారణం పూర్తిగా ధృవీకరణ కాలేదు. పైగా హత్య జరిగిన మరునాడే సింగ్ భారతదేశానికి బయలుదేరి వచ్చేశాడు.
నాలుగు సంవత్సరాలు దొరక్కుండా తప్పించుకుని తిరిగాడు. 2022లో అతడిని అరెస్టు చేశారు. తన భార్య, ముగ్గురు పిల్లలు, తండ్రిని వదిలి అతడు భారత్‌కు పారిపోయాడు. 2023లో భారత ప్రభుత్వం సింగ్‌ను ఆస్ట్రేలియాకు అప్పగించింది.



## 22 మంది సజీవదహనం
### ఇండోనేసియాలో అగ్నిప్రమాదం

**జకర్తా:** ఇండోనేసియా రాజధాని జకర్తాలో సంభవించిన అగ్ని ప్రమాదంలో 20 మంది సజీవదహనమయ్యారు. అనేకమంది గాయపడ్డారు. ఏడు అంతస్తుల భవనంలో ఉన్న ఒక కార్యాలయంలో మంటలు చెలరేగడంతో ఈ విషాద సంఘటన జరిగింది. ఎట్టకేలకు అగ్నిమాపకదళ సిబ్బంది అనేక గంటలు కష్టపడి మంటలను అదుపుచేశారు. ఇంకా ఎవరైనా మృతులు, బాధితులు ఉన్నారా? ఎవరైనా శిథిలాల్లో చిక్కుకుని ఉన్నారా? అనే విషయంపై గాలింపు కొనసాగిస్తోంది. సెంట్రల్ జకర్తా పోలీసు విభాగం అధిపతి సుసాత్యో పూర్ణోమో కాండ్రో పాత్రికేయులకు ఈ విషయం చెప్పారు. జపనీస్ డ్రోన్ సంస్థ టెర్రా డ్రోన్ కార్పొరేషన్ బిల్డింగ్‌లో మంగళవారం మధ్యాహ్నం మొదటి అంస్తులో మంటలు చెలరేగాయి. కొద్దిసేపటికే మంటలు పై అంతస్తులకు వ్యాపించి మొత్తం భవనం అంతటినీ చుట్టుముట్టాయి. ఐతే చాలామంది కార్మికులు హుటాహుటిన పై అంతస్తులలోకి పారిపోయి అక్కడి నుండి నిచ్చెనల సహాయంతో కిందికి దిగి తప్పించుకున్నారని పోలీసులు తెలిపారు. లేకపోతే ఈ మరణాల సంఖ్య ఇంకా చాలా ఎక్కువగా ఉండేది. ఈ భవనం దగ్ధం అవుతున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. గనుక తవ్వకాలు, వ్యవసాయ రంగంలో గగనతల సర్వేలు చేసే సంస్థలకు డ్రోన్లను తయారు చేసే జపనీస్ సంస్థ కార్యాలయం ఈ భవంతిలో ఉంది. హాంగ్‌కాంగ్‌లో నవంబరు 26వ తేదీన అత్యంత ఘోరమైన అగ్నిప్రమాద ఘటనను ప్రపంచం మరచిపోకముందే మరో ఘటన చోటు చేసుకుంది.

# ప్రత్యామ్నాయ శాంతి ప్రణాళిక సిద్ధం చేస్తున్న ఉక్రేన్

### రష్యాకు భూభాగం ఇచ్చేందుకు తిరస్కృతి

**కీవ్ :** రష్యా–ఉక్రేన్ మధ్య శాంతి ఒప్పందం చేసేందుకు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చేస్తున్న ప్రయత్నాలు కొత్త మలుపు తీసుకున్నాయి. ఆక్రమిత భూభాగాలను రష్యాకు వదులుకునేందుకు ఉక్రేన్ మరోసారి తిరస్కరించింది. నాటో నాయకులతో సంభాషణల తర్వాత ఉక్రేన్ నుండి ఈ స్పష్టమైన ప్రకటన వెలువడింది. ఈ భూభాగాలను స్వాధీనం చేస్తే తదుపరి భవిష్యత్తులో చాలా సులభంగా రష్యా మరిన్ని దాడులు చేయడానికి అవకాశం ఇచ్చినట్లవుతుందని నాటో మిత్రులు జెలెన్స్కీకి సలహా చెప్పారు. మార్పులతో ప్రత్యామ్నాయ ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని, కొత్త ప్రణాళికను వైట్‌హౌస్‌కు సమర్పిస్తామని పేర్కొంది.
అంతర్జాతీయ చట్టాల ప్రకారం లేదా ఉక్రేన్ రాజ్యాంగం ప్రకారం ఈ భూభాగాలను రష్యా కు స్వాధీనంచేసే హక్కు తనకు లేదని జెలెన్స్కీ ప్రకటించారు. జెనీవా సమావేశంలో చర్చల సందర్భంగా రాయితీలు పొందిన ప్రణాళికకు భిన్నంగా సవరించిన కొత్త ప్రణాళిక రూపొందించి వైట్‌హౌస్‌కు సమర్పించాలని ఉక్రేన్ నిర్ణయించుకుంది. దీంతో ఈ పరిణామాలు కొత్త దశకు చేరుకున్నాయి. ట్రంప్ ప్రతిపాదించిన 28 అంశాల ప్రణాళిక, ఆ తర్వాత జెనీవాలో సవరించిన 19 అంశాల ప్రణాళికా కూడా రష్యాకే అనుకూలంగా ఉందని మరోసారి జెలెన్స్కీ బయటపడ్డారు. ఈ ప్రణాళిక రష్యాకే అనుకూలంగా ఉందని మొదటినుండీ జెలెన్స్కీ విమర్శిస్తున్నారు. ట్రంప్ ప్రణాళికను అడ్డుకునేందుకు యూరప్ నాయకులతో జెలెన్స్కీ ప్రారంభించిన మంతనాలు ఇటీవల పరాకాష్టకు చేరాయి. ఫ్లోరిడాలో మూడురోజుల పాటు ఉక్రేన్ ప్రతినిదులతో ట్రంప్ దూతలు విట్‌కాఫ్, కుష్నెర్ సమావేశాలు నిర్వహిస్తుండగానే జెలెన్స్కీ యూరప్ దేశాల నాయకులతో ముమ్మరంగా సమావేశాలు నిర్వహించారు. సోమవారం రాత్రి పొద్దుపోయాక లండన్‌లో నాటో నాయకులతో, బ్రిటన్ ప్రధానమంత్రి కీవ్‌స్టార్‌మర్ నాయకత్వంతో ''ఇష్టపడేవారి కూటమి'' సమావేశం టెన్ డౌనింగ్ స్ట్రీట్ కార్యాలయంలో జరిగింది. జెలెన్స్కీకి పూర్తి అండగా ఉంటామని నాటో, ఇయు నాయకుల నుండి జెలెన్స్కీకి భరోసా లభించింది. ట్రంప్ ప్రణాళికపై ఈ నాయకులందరూ క్షుణ్ణంగా చర్చలు జరిపారు. తర్వాత మంగళవారం ఆయన ఇటలీ వెళ్ళి ఆ దేశ ప్రధాన మంత్రి మెలోనీతో సమావేశం జరిపారు. ఆమె మద్దతు కూడగట్టారు. ఈ పరిణామాల పూర్వరంగంలో రష్యా కోరిన విధంగా భూభాగాలను ఆ దేశానికి త్యాగం చేసేదిలేదని మరోసారి ఉక్రేన్ తిరస్కరించింది. కొత్త శాంతి ప్రణాళిక ప్రకటన వెలువడింది. జెలెన్స్కీ అసలు తన ప్రతిపాదిత ప్రణాళికను చదవలేదని, ఒప్పందం చేసుకోవడానికి ఆయన సిద్ధపడటం లేదని ట్రంప్ ఆవేదన చెందిన విమర్శలు చేసిన 24 గంటల్లోనే జెలెన్స్కీ తన ఆలోచన బయట పెట్టారు.



**ఇక బలప్రయోగమే!**
**ఉక్రేన్ యుద్ధం ఇక మరింత తీవ్రం?**
ట్రంప్ ప్రతిపాదిత ప్రణాళిక మేరకు రష్యాకు భూభాగాలను వదులుకునేది లేదని, ప్రాదేశిక రాయితీలకు అంగీకరించేదిలేదని ఉక్రేన్ ప్రకటించడంతో పుతిన్ ముందుగా ప్రకటించిన విధంగా బలప్రయోగంతో ఆ భూభాగాలను స్వాధీనం చేసుకునే పరిస్థితులు కనిపిస్తున్నాయి. వివాదాస్పద భూభాగాల నుండి వారం రోజుల లోపు ఉక్రేన్ సైన్యం వైదొలగితే సంఘర్షణకు అవకాశం ఉండదని లేకపోతే బలప్రయోగంతో యుద్ధభూమిలోనే తాడోపేడో తేల్చుకుని తమ సాంస్కృతిక వారసత్వ భూభాగాలను స్వాధీనం చేసుకుంటామని పుతిన్ గడచిన బుధవారం (డిసెంబరు 3) భారత్ పర్యటన సందర్భంగా ''ఇండియా టుడే''కు ఇచ్చిన ఇంటర్వ్యూలో స్పష్టం చేశారు. ఉక్రేన్‌లో శాంతి సాధన యూరప్ దేశాలకు ఇష్టం లేదని, శాంతి సాధనకు ట్రంప్ చేస్తున్న ప్రయత్నాలను యూరప్ దేశాలే అడ్డుకుంటున్నాయని, యూరప్ నాయకులే ఉక్రేన్‌లో శాంతి ఒప్పందానికి పెద్ద విఘాతంగా మారారని విమర్శించారు. ట్రంప్ ప్రణాళిక అలాస్కాలో తమ మధ్య జరిగిన చర్చలకు అనుగుణంగా రూపొందించారని పుతిన్ ప్రశంసించారు. ఐతే కొన్ని అంశాలు తమకు ఆమోదయోగ్యంగా లేవని కూడా చెప్పారు. ఈ నేపథ్యంలో ఉక్రేన్ నుండి వెలువడిన ప్రకటన చూస్తే, యుద్ధం మరింత తీవ్రరూపం దాల్చే పరిస్థితులు కనిపిస్తున్నాయి. శాంతి ఒప్పందం సాధించాలంటే కొన్ని త్యాగాలు చేయకతప్పదని ట్రంప్ చెబుతూ వస్తున్నారు.ఇదిలా ఉండగా, రష్యా డ్రోన్లుతో దాడులు చేయడంతో ఉక్రేన్‌లోని వాయువ్య సున్నీలోని పలు ప్రాంతాలు అంథకారంలోకి జారుకున్నాయి.

# 3 ట్రిలియన్ వృద్ధి లక్ష్యం.. మూడంచెల తంత్రం

### కోర్... ప్యూర్... రేర్
### 'తెలంగాణ రైజింగ్ 2047' డాక్యుమెంట్ ఆవిష్కరణ

రాబోయే రెండు దశాబ్దాల్లో రాష్ట్రాన్ని సమగ్రంగా, సమ్మిళితంగా సుస్థిరంగా అభివృద్ధి చేసే దిశగా భవిష్యత్తు కు బాటలు వేసే దార్శనిక పత్రం తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ రూపుదిద్దుకుంది.రెండు రోజుల పాటు హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్ అవల మీర్‌ఖాన్‌పేట్‌లో ఏర్పాటు కానున్న భారత్ ఫ్యూచర్ సిటీలో రెండు రోజుల పాటు జరిగిన గ్లోబల్ సమ్మిట్‌లో చివరి రోజు మంగళవారం నాడు 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్ డాక్యుమెంట్‌ను ఆవిష్కరించారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఇతర అతిథులకు రోబో నడుచుకుంటూ వచ్చి విజన్ డాక్యుమెంట్‌ను అందజేసింది. దానిని వారంతా ఆవిష్కరించారు.
**ఈ ఆర్థిక వృద్ధికి మూడు మూల స్తంభాలు**
ఆర్థిక వృద్ధి, సమ్మిళిత అభివృద్ధి,సుస్థిర అభివృద్ధి.
అధునాతన సాంకేతికత, కొత్త ఆవిష్కరణలు, సమర్థవంతమైన ఆర్థిక వనరులతో పాటు సుపరిపాలన ఈ ఆర్థిక వృద్ధికి ఉత్ప్రేరకంగా పని చేస్తాయి.
రాష్ట్రంలో అన్ని ప్రాంతాల అభివృద్ధికి క్యూర్, ప్యూర్, రేర్ అనే మూడుజోన్ల అభివృద్ధి నమూనాను ఈ డాక్యుమెంట్ కీలకంగా ప్రస్తావించింది.
హైదరాబాద్ సిటీ తో పాటు పరిసర ప్రాంతాలు, గ్రామీణ ప్రాంతాల మధ్య సమతుల్య, పరస్పర ఆధారిత వృద్ధిని సాధించే సంకల్పం.
2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను సాధించాలనే మైలు రాయి ని నిర్దేశించింది. 2047 నాటికి జాతీయ జిడిపిలో తెలంగాణ వాటా పదో వంతు కు చేరాలని లక్ష్యం గా ఎంచుకుంది. పెట్టుబడులకు గమ్యస్థానంగా, ఆవిష్కరణలకు కేంద్రంగా తెలంగాణను ప్రపంచ స్థాయి మౌలిక వసతులున్న అత్యాధునిక రాష్ట్రంగా తీర్చిదిద్దటం. అన్ని వర్గాలకు సమాన గౌరవం, సమాన అవకాశాలు కల్పించే ఆదర్శవంతమైన రాష్ట్రంగా నిలబెట్టడం .
**లక్ష్య సాధనకు మూడు సూత్రాలు:**
**1. ఆర్థిక వృద్ధి :** ఆవిష్కరణలు, ఉత్పాదకత ఆధారిత వృద్ధి ద్వారా 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను సాధించడం.
**2. సమ్మిళిత అభివృద్ధి:** యువత, మహిళలు, రైతులు, అణగారిన వర్గాలతో సహా సమాజంలోని అన్ని వర్గాలకు వృద్ధి ఫలాలు అందేలా చూడటం.



**3. సుస్థిర అభివృద్ధి :** అన్ని రంగాలలో సుస్థిరతను సాధించడం, 2047 నాటికి నెట్‌జీరో ఉద్గారాల లక్ష్యాన్ని సాధించడం.
మూడు ఉత్ప్రేరకాలు:
**1. సాంకేతికత, ఆవిష్కరణ :** పాలన, పరిశ్రమలు,సేవలలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం.
**2. సమర్థవంతమైన ఆర్థిక వనరులు:** పెట్టుబడులను ఆకర్షించడానికి, ప్రాజెక్టులకు నిధులు సమకూర్చడానికి వినూత్న ఆర్థిక నమూనాలను రూపొందించడం.
**3. సుపరిపాలన :** పారదర్శక, జవాబుదారీ, పౌరకేంద్రీకృత పాలనను అందించడం.
**మూడంచెల వ్యూహం :** తెలంగాణ భౌగోళిక ప్రాంతాన్ని మూడు విభిన్న, రంగాల వారీగా మూడు జోన్లుగా విభజన. అభివృద్ధి ప్రామాణికంగా రాష్ట్రాన్ని మూడు జోన్లు గా విభజించిన ఏకైక రాష్ట్రంగా తెలంగాణ అవతరించింది. ఈ విధానం సమతుల్య ప్రాంతీయ అభివృద్ధికి పునాదులు వేస్తుంది.
**క్యూర్(కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ) :** 160 కిలోమీటర్ల ఔటర్ రింగ్ రోడ్ (ఒఆర్ఆర్) లోపల ఉన్న హైదరాబాద్ సిటీ ప్రాంతం. సేవల విస్తరణకు ప్రాధాన్యం. నెట్‌జీరో సిటీగా అభివృద్ధి చెందుతుంది. ఇది ప్రపంచ స్థాయి నాలెడ్జ్ మరియు ఆవిష్కరణల కేంద్రంగా ఉంటుంది.
ప్యూర్ (పెరిఅర్బన్ రీజియన్ ఎకానమీ): ఔటర్ రింగ్ రోడ్ (ఒఆర్ఆర్)360 కిలోమీటర్ల ప్రాంతీయ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్) మధ్య ఉన్న జోన్. తయారీ రంగానికి కేంద్రంగా ఉంటుంది. ఇక్కడ పారిశ్రామిక క్లస్టర్లు, లాజిస్టిక్స్ హబ్లు ఏర్పాటు.
**రేర్ (రూరల్ అగ్రికల్చర్ రీజియన్ ఎకానమీ):** ప్రాంతీయ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్) దాటి, రాష్ట్ర సరిహద్దుల వరకు విస్తరించి ఉన్న ప్రాంతం. వ్యవసాయం, హరిత ఆర్థిక వ్యవస్థ. వ్యవసాయ ఆధారిత పరిశ్రమలపై ప్రత్యేక దృష్టి .
**పది కీలక వ్యూహాలు**
ఈ దార్శనికతను సాధించడానికి 10 కీలక వ్యూహాలను డాక్యుమెంట్ ప్రస్తావించింది.
**1. 3–జోన్ల రాష్ట్రం :** సమతుల్య అభివృద్ధికి క్యూర్, ప్యూర్, రేర్ నమూనా.
**2. విచక్షణ నుండి విధానానికి :** పెట్టుబడుల ఆకర్షణ, పాలనలో పారదర్శకత. విధానపరమైన నిర్ణయాలను ప్రోత్సహించడం.
**3. గేమ్–ఛేంజర్ ప్రాజెక్టులు :** భారత్ ఫ్యూచర్ సిటీ, మూసీ పునరుజ్జీవనం, డ్రై పోర్ట్, బందర్ పోర్ట్ వరకు గ్రీన్ ఫీల్డ్ హైవే, రీజినల్ రింగ్ రోడ్. రింగ్ రైలు, బుల్లెట్ రైలు కారిడార్ల వంటి ప్రాజెక్టులు.
**4. సమర్థ పాలన :** డిజిటల్ గవర్నమెంట్, టి– ఫైబర్, స్పీడ్(ఎస్‌పిఇఇడి) వంటి కార్యక్రమాలతో పాలనా సామర్థ్యాన్ని పెంచడం.
**5. నాలెడ్జ్ హబ్ :** ప్రపంచ స్థాయి విద్య, పరిశోధన సంస్థలను ఆకర్షించడం .
**6. సుస్థిర సంక్షేమం :** మహిళలు, రైతులు, యువతపై ప్రత్యేక దృష్టి. ఆరోగ్యం, విద్య, జీవనోపాధి అందరికీ సమాన అవకాశాలు.
**7. అభివృద్ధి నిధులు :** మౌలిక సదుపాయాల ప్రాజెక్టులలో ప్రపంచ పెట్టుబడులను ఆకర్షించి ప్రత్యేక నిధి ఏర్పాటు చేయడం.
**8. పర్యావరణం, సుస్థిరత :** వాతావరణ మార్పులతో వాటిల్లే నష్టాలను తగ్గించడం. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వడం.
**9. సంస్కృతి :** రాష్ట్ర గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని, కళలు, పర్యాటకాన్ని పరిరక్షించడం.. ప్రోత్సహించడం.
**10. ప్రజల యొక్క, ప్రజల కోసం, ప్రజల చేత:** పాలనలో పౌరుల భాగస్వామ్యాన్ని నిర్ధారించడం. వారి ఆకాంక్షలను ప్రతిబింబించే విధానాలు రూపొందించడం.
**విజన్ డాక్యుమెంట్ రూపకల్పన సాగిందిలా :**
రాబోయే రోజుల్లో ప్రపంచంతో పోటీ పడేలా తెలంగాణను ఆవిష్కరించే బృహత్తరమైన ప్రయత్నంలో భాగమే తెలంగాణ రైజింగ్ 2047 డాక్యుమెంట్‌కు రూపకల్పన చేసినట్లు ప్రభుత్వం తెలిపింది. ఇది రాష్ట్ర భవిష్యత్తును నిర్దేశించే రోడ్ మ్యాప్ అని పేర్కొంది. తెలంగాణ రాష్ట్ర ఉజ్వల భవిత కోసం..ప్రజల భవిష్యత్తు కోసం.. భావి తరాల కోసం.. ముందుచూపుతో తెలంగాణ రైజింగ్ 2047 డాక్యుమెంట్ రూపుదిద్దుకుంది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో రాష్ట్ర ప్రభుత్వం ఈ డాక్యుమెంట్ తయారు చేసింది. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల అభిప్రాయాలు.. ఆకాంక్షలకు ఇందులో చోటు కల్పించింది. అన్ని శాఖల మంత్రులు, అన్ని విభాగాల అధికారులు, మేధావులు, అన్ని రంగాల నిపుణులు, పారిశ్రామికవేత్తలు, సామాజిక, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధుల సలహాలకు ప్రాధాన్యమిచ్చింది. ఈ డాక్యుమెంట్ తయారీలో నీతి ఆయోగ్ కీలక భూమిక నిర్వహించింది. ఐఎస్‌బి (ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్) ప్రొఫెసర్లు డాక్యుమెంట్ తయారీలో పాలుపంచుకున్నారు. వరుస సంప్రదింపులు, రోజుల తరబడి చర్చలు, ప్రపంచవ్యాప్తంగా పేరొందిన ప్రముఖుల సలహాలు, సూచనలు, వివిధ దేశాలు అనుసరిస్తున్న ఆదర్శవంతమైన విధానాలన్నింటినీ ప్రభుత్వం అధ్యయనం చేసింది. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా వృద్ధి చేయడం తెలంగాణ రైజింగ్ డాక్యుమెంట్ విజన్ ప్రధాన లక్ష్యం.దీంతో తెలంగాణ అభివృద్ధిలో ప్రపంచ దేశాల కు ధీటుగా నిలబడి.. దేశంలోనే అత్యంత అభివృద్ధి చెందిన రాష్ట్రాల్లో ఒకటిగా నిలుస్తుంది.
రాష్ట్రం నలుమూలల అన్ని జిల్లాల నుంచి దాదాపు 4 లక్షల మంది ఆకాంక్షలు.. అభిప్రాయాలతో ఈ డాక్యుమెంట్ రూపొందించారు. 65 శాతం యువత ఈ ఉజ్వల తెలంగాణ భవిష్యత్ రూపకల్పన లో పాలుపంచుకున్నారు. వీటన్నింటినీ విశ్లేషించుకొని.. వడపోసి.. తెలంగాణ భవిష్యత్తు ఎలా ఉండాలో ఈ దార్శనిక పత్రంలో పొందుపరిచింది. ఇందులో ఉన్న ప్రతి అధ్యాయం తెలంగాణ పురోగాభివృద్ధికి దోహదపడుతుంది.

## పేదల అభివృద్ధికే
(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ మట్టికి గొప్ప చైతన్యం ఉందని, జల్, జంగిల్, జమీన్ అని కొమురం భీమ్ పోరాడిన గడ్డ అని, భూమి కోసం భుక్తి కోసం విముక్తి కోసం సాయుధ రైతాంగ పోరాటంలో ఎంతో మంది నేలకొరిగిన చరిత్ర తెలంగాణ ప్రాంతానిదని సిఎం గుర్తు చేశారు. స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమాన అవకాశాల కోసం తెలంగాణ ఎదురుచూస్తోందని, తెలంగాణ ప్రజలు కోరుకున్న స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు అందించేందుకు తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ ను తీసుకొచ్చామని వివరించారు. 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్లు, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యంగా విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించామని సిఎం పునరుద్ఘాటించారు. ఈ డాక్యుమెంట్‌ను నాలుగు గోడల మధ్య కూర్చుని తయారు చేసింది కాదని,నాలుగు కోట్ల ప్రజల అభిప్రాయాలు తీసుకుని తయారు చేశామని వివరించారు.
**విద్య, నీటిపారుదల, కమ్యూనికేషన్ నినాదంతో ముందుకు**
భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మొదటి ప్రధాని జహర్‌లాల్ నెహ్రూ ముందుగా విద్య, నీటిపారుదల రంగానికి ప్రధాన్యత ఇచ్చారని, తాము విద్య,నీటిపారుదల రంగం, కమ్యూనికేషన్ నినాదంతో ముందుకు వెళ్తున్నామని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. పేదలకు సంక్షేమ ఫలాలు అందించాలన్నదే తమ ఆకాంక్ష అని, కొందరికి పేదరికం ఎక్స్‌కర్షన్ అని, కానీ తనకు పేదరికం ఏమిటో తెలుసని, తాను గ్రామీణ ప్రాంతం నుంచి ఒక ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్నానని, అందుకే తనకు పేదలు, దళితులు, ఆదివాసీలతో మంచి అనుబంధం ఉందని చెప్పారు.
ఎస్‌సి, ఎస్‌టి,బిసి,మైనార్టీ ఇలా వేర్వేరుగా విద్యను అందిస్తే కుల వివక్షకు పరిరిష్కారాన్ని చూపబోదని,అందుకే విద్యార్థి దశలోనే కులవివక్షను నిర్మూలించేందుకు తాము ఎస్‌సి,ఎస్‌టి,బిసి ,ఒసి, మైనార్టీ లకు ఒకే చోట విద్యను అందించేందుకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మిస్తున్నామని వివరించారు. రూ. 200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్‌ను నిర్మిస్తున్నామని, దీనిని తాము ఖర్చుగా బావించడం లేదని, ఈ ఖర్చును తాము తెలంగాణ భవిష్యత్‌కు పెట్టుబడిగా భావిస్తున్నామని తెలిపారు. నాణ్యమైన విద్య, నైపుణ్యం లేకపోవడంతో నిరుద్యోగం పెరుగుతోందని, అందుకే యువతలో నైపుణ్యం పెంపొందించేందుకు స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేసుకున్నామని సిఎం పునరుద్ఘాటించారు. ఒలంపిక్స్ లక్ష్యంగా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేసుకుంటున్నామన్నారు.
**సకల వర్గాల సమిష్టి కృషి : భట్టి విక్రమార్క**
డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ విజన్ డాక్యుమెంట్ సకల వర్గాల సమిష్టి కృషి అని,తెలంగాణ జీవ పత్రమని అన్నారు. సోనియా గాంధీ సాహసోపేత నిర్ణయం తెలంగాణ భవిష్యత్తు ఆశయాలను నిర్దేశిస్తుందన్నారు. విజన్ డాక్యుమెంట్స్‌లో చింతన నాయకులు, విద్యావేత్తలు మేధోపరమైన లోతు అంశాలను జోడించారని, అత్యంత ముఖ్యంగా రైతులు, యువత, వ్యాపారులు, కూలీలు వేలాదిగా తమ భవిష్యత్తు గురించి ఆశలు, సూచనలు పంచుకున్నారని వివరించారు. ఉత్పాదకత సెషన్‌లో భారత్ తదుపరి దూకుడు కేవలం కష్టపడి కాదని,తెలివిగా సిస్టమ్‌ను నిర్మించడం ద్వారా వస్తుందనే ఏకాభిప్రాయం ఏర్పడిందన్నారు.
**తెలంగాణ రైజింగ్ అన్‌బీటబుల్ : దువ్వూరి సుబ్బారావు**
దువ్వూరి సుబ్బారావు మాట్లాడుతూ చైనా, గ్యాంగ్ డాంగ్ నమూనాను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంచుకుందని, తెలంగాణ రైజింగ్ అన్‌స్టాపబుల్ మాత్రమే కాదని, అన్ బీటబుల్ అని అన్నారు. ప్రతి ఏటా 8 నుంచి 9 వృద్ధి సాధిస్తే తెలంగాణ తన లక్ష్యాలను అందుకోగలదన్నారు. ఐటి,ఫార్మా, బయోటెక్నాలజీకి హైదరాబాద్ ఒక హబ్‌గా నిలిచిందన్నారు. ప్రపంచ స్థాయి కంపెనీలకు హైదరాబాద్ ఇప్పుడు గమ్యస్థానంగా ఉన్నదని,హైదరాబాద్ ఒక ఐకానిక్ నగరంగా నిలిచిందన్నారు. రాబోయే పదేళ్లలో తెలంగాణ మాడల్‌అని అంటారని చెప్పారు.
**తెలంగాణ ఆర్థికాభివృద్ధికి కలిసి పనిచేస్తాం: సుమన్ బెర్రీ**
నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ సుమన్ బెర్రీ మాట్లాడుతూ తెలంగాణ అప్పర్ మిడిల్ కంట్రీ ఇన్కమ్ స్టేటస్ లో ఉందని, తెలంగాణ ఆర్థికాభివృద్ధికి నీతి అయోగ్ తెలంగాణతో కలిసి పనిచేస్తుందని వివరించారు. మూడు ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థను సాధించేందుకు తెలంగాణ రాష్ట్రం గతం కంటే మరింత మెరుగైన రీతిలో పనిచేయాల్సిన అవసరం ఉన్నదని సూచించారు.
**తెలంగాణ రైజింగ్ ఒక మాడల్ : అరవింద్ సుబ్రమణ్యం**
ప్రొఫెసర్ అరవింద్ సుబ్రమణ్యం మాట్లాడుతూ తెలంగాణ రైజింగ్ డాక్యూమెంట్ ఒక మ్యాగ్‌నెట్ కాదని, ఇదొక మాడల్‌అని అన్నారు. ఇప్పటికే తెలంగాణ రాష్ట్రానికి రూ.5లక్షల పెట్టుబడి సిద్ధంగా ఉన్నదని,రానున్నకాలంలో తెలంగాణ మరింత ముందుకు వెళ్తుందన్నారు.
ఆనంద్ మహీంద్ర మాట్లాడుతూ ప్రజల కేంద్రంగా తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్ ఉందని, దీర్ఘకాలిక లక్ష్యాలతో ఈ డాక్యుమెంట్ ను రూపొందించారని కొనియాడారు.
**హైదరాబాద్‌ను సినీ హబ్‌గా మార్చేందుకు ముందుంటాం: చిరంజీవి**
చిరంజీవి మాట్లాడుతూ కోరియా తమ దేశ యువతను చెడు వ్యసనాల వైపు వెళ్లకుండా వారిని చిత్ర పరిశ్రమ వైపు మళ్ళించిందన్నారు. సినీ పరిశ్రమకు సంబంధించిన నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.ప్రపంచానికి అద్భుతమైన సినిమా హబ్‌గా హైదరాబాద్‌ను నిర్మించేందుకు తాము ముందు ఉంటామని, సినీ పరిశ్రమను ప్రోత్సహించడం వల్ల ఆర్థికంగా మరింత ఎదిగేందుకు అవకాశం ఉంటుందని,ఉపాధి అవకాశాలు పెరుగతాయని, ఈ విషాయన్ని సిఎం రేవంత్ రెడ్డి గుర్తించారని చిరంజీవి అన్నారు.
**ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన రోబో**
'తెలంగాణ రైజింగ్ విజన్ 2047' డాక్యూమెంట్‌ను 'రోబో' ద్వారా వేదికపైకి తీసుకురావడం సబీకులను,వేదికపైన ఆసీనులైన వారిని ఆకర్షించింది. రోబో తన చేతుల మీదుగా సిఎం రేవంత్ రెడ్డికి డాక్యూమెంట్‌ను అందజేసింది. ఆ తర్వాత అక్కడి నుంచి వెళ్లిపోయింది.

## దేశ వ్యతిరేక చర్య
(మొదటి పేజీ తరువాయి)

ఏ ప్రధానమంత్రి చేయని విధంగా డిసెంబర్ 2023న ఈ ప్రభుత్వం ఎన్నికల కమిషనర్‌గా పని చేసినవారు తీసుకునే ఎలాంటి చర్యపై కూడా శిక్ష పడకుండా చట్టాన్ని మార్చిందని అన్నారు. ఇలాంటి మినహాయింపును ప్రధాన మంత్రి, హోంమంత్రి ఎందుకు బహుమతిగా ఇచ్చారని రాహుల్‌గాంధీ ప్రశ్నించారు. అంతే కాకుండా పోలింగ్ జరిగిన 45 రోజుల తర్వాత సిసిటివి ఫుటేజ్‌ను నాశనం చేయడానికి చట్టాన్ని ఎందుకు మార్చారని ఆయన నిలదీశారు. ఈ చర్యల ఫలితంగా ప్రధానమంత్రి కోసం ప్రత్యేకంగా ఎన్నికల ప్రచారాలు రూపొందించబడ్డాయని, బ్రెజిల్ మోడల్ హర్యానా ఓటరు జాబితాలో 22 సార్లు కనిపించిందన్నారు. హర్యానా ఎన్నిక దొంగిలించబడిందని, ఈ దొంగతనం జరిగే విధంగా భారత ఎన్నికల కమిషన్ చూసిందని ఆయన అన్నారు. ఎన్నికల సంస్కరణ చేపట్టడం సులువైనప్పటికీ, అది జరగాలని ఎన్నికల కమిషన్ కోరుకోవడం లేదని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఎన్నికలకు ఒక నెల ముందు అన్ని పార్టీలకు యంత్రాలు చదవగలిగే ఓటరు జాబితాను ఇవ్వాలని, 45 రోజుల తర్వాత సిసిటివి ఫుటేజ్‌ను నాశనం చేయడానికి అనుమతించే చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని, ఇవిఎంల రూపకల్పన ఎలా జరుగుతుందో చెప్పాలని, ఇవిఎంలను తమకు అందుబాటులో ఉంచాలని రాహుల్‌గాంధీ సూచించారు. చివరగా ఎన్నికల కమిషనర్లు ఏమి చేసినా మినహాయింపును ఇచ్చే చట్టాన్ని మార్చాలని కోరారు. ప్రస్తుత చట్టం తాము తప్పించుకునేందుకు అవకాశమిస్తుందని ఎన్నికల కమిషనర్ భావిస్తున్నారని, కానీ అది అలా జరగబోదని, ఎందుకంటే గత చర్యలకు కూడా వర్తింపజేసే విధంగా తాము చట్టాన్ని మారుస్తామని అన్నారు. భారతదేశం అతిపెద్ద ప్రజాస్వామ్యం మాత్రమే కాదు, గొప్ప ప్రజాస్వామ్యం కూడా అని ఆయన నొక్కి చెప్పారు.
'మీరు చేయగలిగే అతిపెద్ద దేశ వ్యతిరేక చర్య 'ఓటు చోరీ' చేయడం. ఎందుకంటే మీరు ఓటును నాశనం చేసినప్పుడు, మీరు ఈ దేశ నిర్మాణాన్ని నాశనం చేస్తారు. మీరు ఆధునిక భారతదేశాన్ని నాశనం చేస్తారు. మీరు భారతదేశం యొక్క ఆలోచనను నాశనం చేస్తారు' అని బిజెపిని ఉద్దేశించి అన్నారు.
**సర్‌ను తక్షణమే ఆపేయాలి : మనీశ్ తివారి**
ఎన్నికల సంస్కరణలపై లోక్‌సభలో జరిగిన చర్చను కాంగ్రెస్ సభ్యుడు మనీశ్ తివారి ప్రారంభిస్తూ సర్‌కు ఎలాంటి చట్టబద్ధ ఆధారం లేదని, తక్షణమే దానిని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల కమిషన్ ఎంపిక కమిటీలో ప్రస్తుతం ప్రధాని, హోం మంత్రి, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు సభ్యులుగా ఉన్నారని, అదనంగా రాజ్యసభ ప్రతిపక్ష నేత, ప్రధాన న్యాయమూర్తిని కూడా చేర్చాలని కోరారు. ఎన్నికల కమిషన్ తటస్థ అంపైర్‌లాగా వ్యవహరించాలని, కానీ దాని తటస్థతతపై ప్రశ్నలు తలెత్తడం బాధాకరమని అన్నారు. వంద శాతం వివిప్యాట్‌లను లెక్కించడం లేదా పాత పద్ధతిలో బ్యాలెట్ పత్రం ద్వారా ఎన్నికలు నిర్వహించడం ద్వారా ప్రజల్లో సందేహాలను తొలగించవచ్చన్నారు. ఓట్ల లెక్కింపునకు మూడు, నాలుగు రోజులు పట్టినా ప్రజాస్వామ్యంపై ప్రజలకు విశ్వాసం పునరుద్ధరించబడుతుందన్నారు. ఎన్నికలకు ఒకటి రెండు రోజుల ముందు నగదు బదిలీ చేయడం ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగమే అవుతుందని, ఇదెక్కడి ప్రజాస్వామ్యమని ప్రశ్నించారు. ఇది ప్రజాస్వామ్యం, దేశ దివాళాకోరుతనానికి నిదర్శనమన్నారు. పార్టీ ఫిరాయింపు చట్టం కూడా అపహాస్యం పాలవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.
**బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు : అఖిలేశ్ యాదవ్**
లోక్‌సభ చర్చలో సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు, ఎంపి అఖిలేశ్ యాదవ్ అన్నారు. పాత పద్ధతిలోనే బ్యాలెట్ పేపర్ విధానంలో ఎన్నికలు నిర్వహించాలని, ఎందుకంటే అభివృద్ధి చెందిన దేశాలలో సైతం బ్యాలెట్ పద్ధతిలోనే ఎన్నికలు నిర్వహిస్తున్నారని తెలిపారు. మిల్కీపూర్, రాంపూర్‌ఉప ఎన్నికల్లో నిజమైన ఓటర్లు తమ ఓటు హక్కును వినియోంచుకోకుండా ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం అడ్డుకుందని, ఎన్నికల కమిషన్‌ను ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. వేల మంది ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలిగించారని విమర్శించారు.
**18 ఏళ్ళకే పోటీకి అవకాశం ఇవ్వాలి : శివసేన**
లోక్‌సభ, శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసే అర్హత వయస్సును 25 నుంచి 18 సంవత్సరాలకు తగ్గించాలని శివసేన పక్ష నాయకుడు శ్రీకాంత్ షిందే కోరారు. తాము ఉండే చోటు నుంచే ఓటు వేసే విధంగా వలస ఓటర్లకు అవకాశం కల్పించాలన్నారు.
**ఇసి తీరు మంచిది కాదు: సుప్రియా సూలే**
స్వతంత్రంగా వ్యవహరించాల్సిన ఎన్నికల కమిషన్ ప్రభుత్వంలో భాగంగాలాగా కనిపిస్తుందని శివసేన(శరద్ పవార్) ఎంపి సుప్రియా సూలే అన్నాది. ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. సిపిఐ(ఎం) సభ్యుడు అమ్రారామ్ మాట్లాడుతూ ప్రతి ఏడాది సవరణ జరుగుతుండగా ప్రత్యేక ఓటర్ల సవరణ (సర్) ఎందుకు అని ప్రశ్నించారు. సర్ పేరుతో వలస కార్మికుల ఓట్లు తొలగిస్తున్నారని విమర్శించారు. బ్యాలెట్ విధానంలో ఎన్నికలు నిర్వహించాలని కోరారు.
**ఓట్లు తొలగిస్తే ఎన్నికలకు అర్థమేమిటి? : టిఎంసి**
ఎన్నికల కమిషన్ ఓటర్ల జాబితే ప్రత్యేక సవరణ (సర్) కేవలం ఓట్ల తొలగింపు లక్ష్యంగా సాగుతుందని టిఎంసి ఎంపి కల్యాణ్ బెనర్జీ విమర్శించారు. ఓట్లు తొలగిస్తే ఎన్నికలకు అర్థమేమిటని ఆయన అన్నారు. ఎవరు ఓటరుగా ఉండాలనేది ఎన్నికల కమిషన్ ద్వారా మోదీ నిర్ణయిస్తున్నారని విమర్శించారు. సర్ కారణంగా ఒత్తిడికి గురై, పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో ఇప్పటి వరకు 20 మంది ఆత్మహత్యలకు పాల్పడ్డారని, ఐదుగురు తీవ్ర అనారోగ్యం పాలయ్యారని, ముగ్గురు ఆత్మహత్యకు ప్రయత్నించారని చెప్పారు.ఇలాంటివే బిజెపి పాలిత రాష్ట్రాలైన ఉత్తర్‌ప్రదేశ్‌లో 10 , మధ్య ప్రదేశ్‌లో 9, గుజరాత్‌లో 6, రాజస్థాన్‌లో ఒక కేసు నమోదైందని తెలిపారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## ప్రత్యేక ఆకర్షణగా నెట్ జీరో స్టాల్

ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ రైజింగ్ 2047 సమ్మిట్‌లో భాగంగా ఎక్స్‌పోలో విద్యుత్ శాఖ హరిత ఇంధనం ఉత్పత్తి పై ఏర్పాటుచేసిన నెట్ జీరో స్టాల్‌కు విశేష ఆదరణ లభించింది. ఈ స్టాల్‌లో విద్యుత్ వెహికల్, వేస్ట్ టు ఎనర్జీ, పవన విద్యుత్తు, పంప్డ్ స్టోరేజ్ పవర్ జనరేషన్, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ వ్యవస్థ, సోలార్ ఫలకాలతో విద్యుత్ ఉత్పత్తి చేసే ప్లాంట్ల నమూనాలను ఏర్పాటు చేశారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క , డిజిపి శివధర్ రెడ్డితో పాటు పలువురు ప్రముఖులు, వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు స్టాల్‌ను సందర్శించి అక్కడ ప్రదర్శిస్తున్న నమూనాలను నిశితంగా పరిశీలించారు. విద్యుత్ ఉత్పత్తి చేసే ప్లాంట్ల నమూనాలను ప్రదర్శించడం వలన ఈ స్టాల్ అత్యధిక సందర్శకులను ఆకర్షించింది. పంపుడ్ స్టోరేజ్ ప్లాంట్ పనితీరుకు సంబంధించి రియల్ టైంలో ప్రదర్శించడం పలువురిని కట్టిపడేసింది. పర్యావరణం, గ్రీన్ ఎనర్జీ పై అవగాహన కల్పించడానికి నెట్ జీరో క్విజ్ సాఫ్ట్వేర్ కూడా రూపొందించారు. పలువురు సందర్శకులు ఎంతో ఉత్సాహంగా ఈ క్విజ్‌లో పాల్గొని నెట్ జీరో సర్టిఫికెట్ ను పొందారు. గర్వ ఒక ముఖ్యమంత్రి గారు మరియు డిజిపి కూడా ఎంతో ఉత్సాహంగా క్విజ్‌లో పాల్గొన్నారు.



## పెట్టుబడులకు ఆవిష్కరణలు తోడైతేనే

# త్రి ట్రిలియన్ డాలర్ ఎకానమీ లక్ష్యం సాధ్యం

### డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాబోయే 22 ఏళ్లలో నిర్దేశించుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలంటే ప్రస్తుతం ఉన్న అంచనాల ప్రకారం 16 రెట్లు ఆర్థిక వృద్ధిని సాధించాల్సి ఉందని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. పెట్టుబడులకు ఆవిష్కరణలు తోడైతేనే త్రి ట్రిలియన్ డాలర్ ఎకానమీ లక్ష్యం సాధ్యమవుతుందన్నారు. ఎఐ, డిప్ టెక్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం రైతుల ఉత్పత్తులు పెంచేందుకు ఉపయోగపడాలన్నారు. భారత్ ఫ్యూచర్ సిటీలో 'క్యాపిటల్, ప్రోడక్టివిటీ ఫర్ త్రీ ట్రిలియన్ డాలర్ ఎకానమీ' అంశంపైన మంగళవారం చర్చాగోష్టి జరిగింది. ఈ చర్చలో గోష్టిలో సెంటర్ ఫర్ ఎనలైటికల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రసన్న తంత్రి, యువ పారిశ్రామికవేత్త పరశురాం, ట్రాన్స్ కో సిఎండి కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ ఎక్కువగా పనిచేస్తేనే 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను చేరుకోలేమని, మరిన్ని రోడ్లు, పెద్ద సంఖ్యలో భవనాలు నిర్మించడంతో సరిపోదని, ఆర్థిక వ్యవస్థ ప్రాథమిక సమీకరణాన్ని మార్చాల్సిందేనని అన్నారు. మూలధనం + ఆవిష్కరణ = ఉత్పాదకత అని అన్నారు. ఉత్పాదకతే తెలంగాణ సాధారణ పౌరుడి వేతనాలు, గౌరవాన్ని శాశ్వతంగా పెంచే ఏకైక మార్గమన్నారు. ఎన్నేళ్లుగా భారతదేశంలోని ప్రభుత్వాలు తమను 'రెగ్యులేటర్లు'గా మాత్రమే భావించాయని, అనుమతులు, లైసెన్సులు, ఫైళ్లకే ప్రాముఖ్యత ఇచ్చాయని, 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'లో ర్యాంకులు పెరిగితే సంతోషపడ్డామని, కానీ ప్రపంచం చాలా వేగంగా మారిందని, డిప్టెక్, ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్ యుగంలో 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' అనేది కేవలం కనీస అర్హత అని, అది ఒక బేస్‌లైన్ మాత్రమేనని భట్టి వివరించారు. ఆసియాలో ఇన్నోవేషన్ క్యాపిటల్ కావాలంటే, 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' నుండి 'ఈజ్ ఆఫ్ ఇన్నోవేటింగ్' వైపు సాగాలన్నారు.

**ఫైళ్లు క్లియర్ చేయడం కాదు.. ఎకోసిస్టమ్ క్రియేట్ చేసే ప్రభుత్వం కావాలి**

ఫైళ్లు క్లియర్ చేయడమే కాదని, ఎకోసిస్టమ్‌లను క్రియేట్ చేసే ప్రభుత్వం కావాలని భట్టి విక్రమార్క అన్నారు. తమ విజన్ డాక్యుమెంట్ క్యూర్ (అర్బన్),ప్యూర్ (పెరిఅర్బన్), రేర్ (రూరల్) అనే ప్రత్యేక స్ట్రాటజీని ప్రతిపాదించామన్నారు. బ్యాంకులు భద్రతను ఇష్టపడతాయని, కానీ ఇన్నోవేషన్‌కు ఫెయిల్యూర్ అవసరమని, కానీ ఇంటర్‌నెట్ నుండి స్పేస్ ట్రావెల్ వరకు అత్యంత పెద్ద బ్రేక్‌థ్రూలు, దశాబ్దాల పాటు లాభం లేకపోయినప్పటికీ ఎవరైనా ఒక రిస్క్ తీసుకున్నప్పుడు మాత్రమే సాధ్యమయ్యాయనే విషయం ప్రపంచ చరిత్ర చెబుతుంది డిప్యూటీ సిఎం భట్టి తెలిపారు. రెగ్యులేటర్‌గా కాకుండా, రిస్క్‌ను పంచుకునే 'క్యాటలిస్ట్'గా,ప్రజల కోసం రివార్డులు పొందే భాగస్వామిగా మారడానికి సిద్ధంగా ఉన్నామ న్నారు. సైబరాబాద్‌తో పాటు వరంగల్, నిజామాబాద్ రైతుల ఉత్పాదకత పెంచే 'బోరింగ్ ప్రాబ్లమ్స్'ను కూడా ఎలా పరిష్కరించేలా చేసుకోవాలనే అంశంపైన కూడా దృష్టి పెట్టాలని సూచించారు.

# చిత్ర పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం సిద్ధం

### అన్ని సౌకర్యాలు కల్పిస్తాం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణలో చలన చిత్ర పరిశ్రమ అభివృద్ధికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తెలిపారు. భారత్ ఫ్యూచర్ సిటీలో స్టూడియోలను ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వం తరఫున సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025 రెండో రోజున సృజనాత్మక శతాబ్దం – వినోద రంగం భవిష్యత్తు అన్న అంశంపై జరిగిన చర్చల్లో ప్రముఖ నటులు చిరంజీవి, రితేష్ దేశ్‌ముఖ్, సుభాష్ ఘాయ్, అల్లు అరవింద్, సురేష్ బాబు, నటులు జెనీలియా దేశ్‌ముఖ్, అక్కినేని అమల, అనిరుధ్ రాయ్ చౌదరి, శ్యాం ప్రసాద్ రెడ్డి, జోయా అక్తర్, చుంకీ పాండేతో పాటు పలువురు టాలీవుడ్, బాలీవుడ్ రంగానికి చెందిన ప్రముఖులు ముఖ్యమంత్రితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి శ్రీ మల్లు భట్టి విక్రమార్క , మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి , ఫిల్మ్ డెవల్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ స్క్రిప్ట్‌తో వస్తే సినిమా పూర్తి చేసుకుని వెళ్లేలా రాష్ట్ర ప్రభుత్వం సినిమా పరిశ్రమను ప్రోత్సహించడానికి సిద్ధంగా ఉందని, అందుకు అనుగుణంగానే నిర్ణయాలు ఉంటాయని చెప్పారు. ఫ్యూచర్ సిటీలో ఏర్పాటు చేసిన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీలో సినిమా పరిశ్రమకు సంబంధించిన 24 క్రాఫ్ట్స్‌లో పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా శిక్షణ అందించే అంశాన్ని పరిశీలించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సూచించారు.





### అత్యుత్తమ ఫిల్మ్ టూరిజం కేంద్రంగా తెలంగాణ : కోమటిరెడ్డి

సినిమా షూటింగ్, ఎవిజిసితో పాటు ఫిల్మ్ టూరిజం కోసం అత్యుత్తమ కేంద్రంగా తెలంగాణను మార్చడానికి దృఢమైన ప్రణాళికలను రూపొందిస్తున్నామని రాష్ట్ర సినిమాటోగ్రఫి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. 'ది క్రియేటివ్ సెంచరీ ఇండియాస్ సాఫ్ట్ పవర్ అండ్ ది ఫ్యూచర్ ఆఫ్ ఎంటర్‌టైన్మెంట్' టాపిక్‌పై చర్చగోష్టిలో మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ఫిల్మ్ పాలసీ, సంబంధిత ప్రోత్సాహకాల ద్వారా భారీగా పెట్టుబడులు పెట్టే వారికి క్యాపిటల్ సబ్సిడీలు, స్థానిక వనరులు ఉపయోగిస్తే ఉత్పత్తి వ్యయాల రీయింబర్స్‌మెంట్ వంటి బలమైన సహాయాలు అందిస్తున్నామని తెలిపారు.



2025లో రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌ను భారత సినిమా ఉత్పత్తి ఎపిక్ సెంటర్‌గా మార్చే సంకల్పాన్ని మరోసారి పునరుద్ఘాటించారు. సృజనకర్తల సంక్షేమం, పరిశ్రమ కార్మికుల అభివృద్ధి, సమగ్ర ఎకోసిస్టమ్ నిర్మాణం కూడా తమ దృష్టిలో కీలక భాగాలని మంత్రి చెప్పారు. వినోదం అనేది అత్యంత ప్రభావవంతమైన రాజనీతిగా ఎదిగే యుగమని, ప్రపంచంలోనే భారతదేశం ముందంజలో నిలుస్తోందన్నారు. భారతదేశం చెప్పే కథలు సరిహద్దులను దాటి ప్రపంచమంతా విస్తరిస్తున్నాయని పేర్కొన్నారు. ఇది యాదృచ్ఛికం కాదు ఇది భారతీయ సృజనాత్మకత యొక్క శక్తి అని, వారసత్వంలో బలంగా నిలిచి, భవిష్యత్తుతో సమరసమై ముందుకు సాగుతున్న శక్తిగా అభివర్ణించారు. భారతదేశం వినోదాన్ని మాత్రమే ఎగుమతి చేయడంతో పాటు భావాలను, విలువలను, ప్రపంచాన్ని హత్తుకునే ప్రత్యేక సాంస్కృతిక గుర్తింపును కూడా పంచుతుందని తెలిపారు. ప్రపంచంలోనే అతిపెద్ద సినిమా నిర్మాణ వ్యవస్థ రామోజీ ఫిల్మ్ సిటీ సహా హాలీవుడ్, ఒటిటి దిగ్గజాలు, అంతర్జాతీయ ఫ్రాంచైజీలను శక్తినిచ్చే ప్రముఖ విఎఫ్ఎక్స్, గేమింగ్, యానిమేషన్ సంస్థలు, ఆధునిక సాంకేతిక మౌలిక సదుపాయాలతో కూడిన బహుళ సాంస్కృతిక ప్రతిభావంతుల సమూహమని వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్‌ను ప్రపంచ మీడియా, వినోద కేంద్రంగా తీర్చిదిద్దడానికి కట్టుబడి ఉందన్నారు. అంతర్జాతీయ సినిమా నిర్మాణానికి సౌకర్యాలతో పాటు ఎవిజిసిఎక్స్ఆర్ నైపుణ్య అభివృద్ధి, ఇన్నోవేషన్ సెంటర్లు, మౌలిక సదుపాయాలు, స్టూడియోలు, కోప్రొడక్షన్లకు ప్రోత్సాహకాలు, అంతర్జాతీయ కంటెంట్ సృష్టికర్తలు, పెట్టుబడిదారులతో బలమైన భాగస్వామ్యాలుగా ఉన్నాయన్నారు. సినిమా, ఒటిటి, డిజిటల్ మీడియా, గేమింగ్, ఈస్పోర్ట్స్, ఎక్స్ఆర్, మెటావర్స్, వర్చువల్ ప్రొడక్షన్, క్రియేటర్ ఎకానమీ ఇవన్నీ కలిసి కొత్త విశ్వాన్ని సృష్టిస్తున్నాయని, ఎఐ, స్పేషియల్ కంప్యూటింగ్, వర్చువల్ సెట్లు ఇవి సృజనను కొత్త స్థాయికి తీసుకెళ్తున్నాయని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వెల్లడించారు.

## లైఫ్ సైన్సెస్ రంగంలో రూ.63 వేల కోట్ల పెట్టుబడులు

### మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు


ప్రజాపక్షం/హైదరాబాద్: తమ ప్రభుత్వం అమలు చేస్తున్న పరిశ్రమల అనుకూల విధానాల వల్ల గడచిన రెండేళ్లలో ఒక్క లైఫ్ సైన్సెస్ రంగంలోనే రూ.63 వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయని ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. గ్లోబల్ సమ్మిట్ లో మంగళవారం ఫ్యూచర్ సిటీపై జరిగిన చర్చాగోష్ఠిలో ఆయన ప్రసంగించారు. తెలంగాణా గ్లోబల్ వ్యాక్సిన్స్ కేంద్రంగా గా అవతరించిందని ఆయన వివరించారు. కరోనా సమయంలో ప్రపంచం మొత్తానికి తాము అండగా నిలిచామని తెలిపారు. వంద బిలియన్ డాలర్ల విలువైన 2,000 ఫార్మా కంపెనీలు రాష్ట్రంలో ఉన్నాయని ఆయన వెల్లడించారు. ప్రపంచంలో పది పెద్ద ఫార్మా కంపెనీల్లో 8 తెలంగాణాలో ఉన్నాయన్నారు. గత ప్రభుత్వాల తీసుకున్న నిర్ణయాలను, విధానాలను కొనసాగిస్తూ పారిశ్రామిక రంగానికి ఏ ఆటంకాలు లేకుండా చూస్తున్నట్టు శ్రీధర్ బాబు



చెప్పారు. అంతర్జాతీయ స్థాయి లైఫ్ సైన్సెస్ యూనివర్సిటీ ఏర్పాటుకు తాము సిద్ధంగా ఉన్నామని వివరించారు. ఇండస్ట్రీ పెద్దల భాగస్వామ్యంతో నిపుణులైన వర్క్ ఫోర్స్‌ను తయారు చేస్తామని చెప్పారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ కూడా పరిశ్రమల భాగస్వామ్యంతోనే ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేసారు. అందులో డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్ రెండు బ్యాచ్‌ల విద్యార్థులకు శిక్షణ నిచ్చి ఉద్యోగావకాశాలు కల్పించిందని తెలిపారు. భవిష్యత్తులో విద్యుత్తు కొరత లేకుండా కొత్త గ్రీన్ ఎనర్జీని పాలసీని తమ ప్రభుత్వం రూపొందించిందని శ్రీధర్ బాబు తెలిపారు.

# మూసీ పునరుద్ధరణే హైదరాబాద్ భవిష్యత్తు

### పట్టణాభివృద్ధి నిపుణుల ఉద్ఘాటన



(గ్లోబల్ సమ్మిట్ నుంచి ఇ.చంద్రశేఖర్)

నదుల సహజ ప్రవాహానికి ఆటంకం కలగకుండా కొనసాగితేనే మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు పునరుద్ధరణ ఫలిస్తుంది, లేదం టే అన్ని ప్రయత్నాలు వ్యర్థమవుతాయని పట్టణాభివృ ద్ధి రంగానికి చెందిన పలువురు నిపుణులు అన్నారు. భారత్ ఫ్యూచర్ సిటీలో మంగళవారం జరిగిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్‌లో 'మూసీ రీజ్యూవెనేషన్ అండ్ బ్లూగ్రీన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్ హైదరాబాద్' అంశంపై ఏర్పాటు చేసిన చర్చ గోష్టిలో పలువురు నిపుణులు తమ అభిప్రాయాలు వెల్లడించారు.

**నదుల హక్కు కాపాడాలి**

రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న మూసీ పునరుద్ధరణ యత్నాలను అభినందిస్తు నదులు, చెరువులు, అడవులను రక్షించడం రాజ్యాంగపరమైన బాధ్యత అని గుర్తు చేశారు. మూసీని పునరుద్ధరిస్తామంటే, మొదట నది ప్రవాహ హక్కు ఏమిటో తెలుసుకోవాలి, అని చెప్పారు. రాజస్థాన్‌లో 10–12 ఏళ్ల పాటు నదుల పునరుద్ధరణకు శ్రమించిన అనుభవాన్ని పేర్కొంటూ, ప్రాజెక్టులు ప్రజల జీవనశైలికి అనుసంధానంగా ఉండాలని సూచించారు.

*–వాటర్‌మాన్ ఆఫ్ ఇండియా రాజేందర్ సింగ్ ..*

**డ్రైన్ కాదు .. మళ్లీ నది కావాలి**

వరల్డ్ బ్యాంక్ మాజీ పర్యావరణ నిపుణుడు తపస్ పాల్ మాట్లాడుతూ, మూసీ పునరుద్ధరణ ప్రణాళికను అత్యంత కీలకమైనదిగా అభివర్ణించారు. ఎప్పుడో జీవనాడిగా ఉన్న మూసీని మనమే డ్రెయిన్‌గా మార్చేశాం. దాన్ని మళ్లీ నదిగా మార్చే సంకల్పం ఉండాలి. హైదరాబాద్ చేయలేకపోతే ఇతర నగరాలు చేయలేవు, అని స్పష్టం చేశారు.

*– వరల్డ్ బ్యాంక్ మాజీ నిపుణుడు..*

**దేశంలో అత్యంత ప్రభావవంతమైన ప్రాజెక్ట్ అవుతుంది**

ఏషియన్ డెవలప్మెంట్ బ్యాంక్ సీనియర్ వాటర్ రిసోర్సెస్ నిపుణులు అలెక్సియా మైకల్స్ మాట్లాడుతూ, బ్లూగ్రీన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో ప్రజల భాగస్వామ్యాన్ని తప్పనిసరి అంశంగా చూడాలని సూచించారు. ఎ డి బి బ్యాంక్ ఇటీవల నీటి వనరుల పునరుద్ధరణకు 10 బిలియన్ డాలర్లను కేటాయించినట్లు తెలిపారు. చైనాలోని షినాన్ నది ప్రాజెక్ట్‌కు దీర్ఘకాలిక మద్దతు అందించినట్లు గుర్తుచేశారు. మూసీ పునరుద్ధరణ భారత్‌లో అత్యంత ప్రభావవంతమైన పర్యావరణ, సామాజిక ప్రాజెక్ట్ అవుతుంది, అని పేర్కొన్నారు.

**మూసీ–గోదావరి లింక్ లక్ష్యం**

చర్చ గోష్టిలో తెలంగాణ మంత్రి డి.శ్రీధర్ బాబు మాట్లాడుతూ, మూసీ పునరుద్ధరణను దేశానికి బెంచ్ మార్క్‌గా నిలపాలని ప్రభుత్వ లక్ష్యమని చెప్పా రు. 155 కి.మీ. పొడవైన మూసీ నదిని మళ్లీ స్వచ్ఛమైన నదిగా మార్చడమే ముఖ్య లక్ష్యం. సిఎం ప్రత్యే క ఆజెండా ప్రకారం మూసీని గోదావరి నదితో లింక్ చేసి, ఎప్పటికప్పుడు ప్రవాహం ఉండేలా చేస్తామని తెలిపారు. ఒఆర్ఆర్ లోపల 476 చెరువులు, బయట 2,786 చెరువుల పునరుద్ధరణ జరుగుతోందని, కొత్వాల్ గూడలో 85 ఎకరాల్లో 90రకాల పక్షు, జంతు జాతులతో ఎకో పార్క్ నిర్మాణం జరుగుతోందని వివరించారు.

*– తెలంగాణ మంత్రి శ్రీధర్ బాబు*

**నైట్ ఎకానమీకి కూడా అనిలయం**

మూసీ నగర ఆర్థిక వ్యవస్థకు మరలా జీవనాడిగా మారాలని ఎం ఆర్ డి సి మేనేజింగ్ డైరెక్టర్ ఇవి. నరసింహ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. మూసీ పునరుద్ధరణ అంటే కొత్త ఆర్థిక వ్యవస్థ, నైట్ ఎకానమీకి దారితీయడం. మూసీ మళ్లీ హైదరాబాద్‌కు జీవనాడిగా మారాలి అని ఆయన అన్నారు.

*– ఎంఆర్‌డిసి*

## ఇందిరమ్మ చీర కట్టులో మంత్రి కొండా సురేఖ

ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ రైజింగ్... గ్లోబల్ సమ్మిట్‌లో రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ లోకల్ అట్రాక్షన్‌గా నిలిచారు. గ్లోబల్ సమ్మిట్‌లోకి మంత్రి సురేఖ ఇందిరమ్మ చీరలో అడుగు పెట్టిన క్షణం మొదలు... అందరూ ఆత్మీయంగా ఆమెను పలకరించారు. తొలుత డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, పొంగులేటి, జూపల్లి కృష్ణారావు తదితరులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమెను కలిసిన ప్రతి ఒక్కరూ... సురేఖక్క... ఇందిరమ్మ చీర బాగుంది అంటూ కితాబిచ్చారు. సమ్మిట్ త ర్వాత వివిధ స్టాల్స్‌ను పరిశీలిస్తున్న సందర్భంలో మంత్రి సురేఖతో... అందరూ సెల్ఫీలు తీసుకునేందుకు ఆసక్తి చూపించారు. సురేఖమ్మ... ఇందిరమ్మ చీర అదుర్స్ అంటూ చెప్పుకొచ్చారు.





(గ్లోబల్ సమ్మిట్ నుంచి బి.వాసుదేవరాజు)

# ఎకో టూరిజం అభివృద్ధికి తెలంగాణలో విస్తృత అవకాశాలు


### గ్లోబల్ సమ్మిట్ చర్చాగోష్టిలో మంత్రి కొండా సురేఖ

తెలంగాణ రాష్ట్రంలో 7,200 చ.కి.మీ విస్తీర్ణంలో ఉన్న రక్షిత వన్యప్రాంతాలు, సహజసిద్ధమైన ప్రకృతి, ఈ ఎకో టూరిజం అభివృద్ధికి విస్తృతమైన అవకాశాలు కల్పిస్తున్నదని అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. భారత్ ఫ్యూచర్ సిటీ లో జరుగుతున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ స మ్మిట్‌లో టెంపుల్ టూరిజంఎకో టూరిజం అం శంపైపై జరిగిన చర్చాగోష్టిలో కోండా సురేఖ మాటల్లో..' తెలంగాణ రాష్ట్ర మొత్తం భూభాగం 1,12,077 చ.కి.మీ. కాగా, అందులో 21,179 చ.కి.మీ మేర అడవులు విస్తరించి ఉన్నాయి. ఇది మొత్తం భూభాగంలో 18.89 శాతంగా ఉం ది. అటవీ వెలుపల ఉన్న ఇతర చెట్లతో (3,518 చ.కి.మీ, 3శాతం) కలిపి రాష్ట్రంలో ఉన్న మొ త్తం పచ్చదనం 24,697 చ.కి.మీ (22శాతం) గా నమోదైంది.ఓ వైపు ప్రకృతిని కాపాడుతూనే మరోవైపు స్థానిక ప్రజల జీవనోపాధులను పెంచే బాధ్యతాయుత ఎకో టూరిజాన్ని ప్రోత్సహించ డం లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం ముందడుగు వేస్తుంది. సరస్సులు, గడ్డి భూములు, జాతీయ ఉద్యానవనాలు, అమ్రాబాద్ కవ్వాల్ వంటి ప్రముఖ టైగర్ రిజర్వులతో రాష్ట్రం సహజసిద్ధమైన సంపదను కలిగి ఉంది. పర్యాటక విధానం 2025–30, ఎకోటూరిజం ఫ్రేమ్ వర్కును ప్రవేశపెట్టి, తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థను నోడల్ ఏజెన్సీగా నిర్ణయించడం జరిగింది. 'తక్కువ నిర్మాణాలు ఎక్కువ అనుభవం' అన్న నినాదంతో పర్యావరణానికి హానీ లేకుండా సందర్శకులకు వన్యప్రదేశ అనుభవం అందించడమే ఈ స్లోగన్ ప్రధాన ఉద్దేశ్యం. ప్రైవేటు రంగంతో కలిసి కొత్త ప్రాజెక్టులు చేపట్టేందుకు ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉద్యోగాలు, శిక్షణ, హాస్పిటాలిటీ నైపుణ్యాలు అందించడం ద్వారా ఎకోటూరిజాన్ని సమగ్ర అభివృద్ధి దిశగా తీసుకెళుతున్నం.రాష్ట్రంలో 13 ఎకోటూరిజం సర్క్యూట్లు ఏర్పాటు చేయగా, రామప్పశ్రీశైలం లాంటి వారసత్వఆధ్యాత్మిక కేంద్రాలను ప్రకృతి పర్యాటకంతో అనుసంధానిస్తున్నారు. అమ్రాబాద్ టైగర్ రిజర్వులో పులుల సంఖ్య గణనీయంగా పెరిగి 2024 నాటికి 36కు చేరుకున్నది. ఇది పులుల సంరక్షణలో రాష్ట్ర విజయాన్ని ప్రతిబింబిస్తోంది.నందిపేట, తాడ్వాయి, పాఖాల్ వంటి కొత్త ఎకోటూరిజం ప్రదేశాలు అభివృద్ధి దశలో ఉన్నాయి. త్వరలో గైడెడ్ ఫారెస్టు ట్రెక్కులు, ఆన్లైన్ బుకింగ్ యాప్ కూడా అందుబాటులోకి రానున్నది. ఎకోటూరిజం ద్వారా 2047 నాటికి నెట్ జీరో లక్ష్యాల ను చేరేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేస్తున్నది.ఇక దేవాదాయ శాఖలో 12,434 దేవాలయాలు కలవు. అందులో 695 దేవాలయాలు ఆదాయము కలిగి ఉన్నవి. సుమారుగా 3,505 దేవాలయాలకు, ఆయా దేవాలయాలకు కలిగినటువంటి భూముల ద్వారా వచ్చేటువంటి ఆదాయాల ద్వారా, దేవాదాయ శాఖ ద్వారా నిర్వహించబడుతున్నాయి. ప్రస్తు తం 6,439 ఎటువంటి ఆదరణకు నోచుకోనటువంటి దేవాలయాలకు నిత్య ధూప దీప నైవేద్యం నిమిత్తం ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తుంది అని తెలిపారు. ఈ ప్యానెల్ డిస్కషన్‌లో రాష్ట్ర టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణా రావు, టూరిజం కార్పొరేషన్ ఎండి వల్లూరి క్రాంతి, రామోజీ ఫిలిం వైస్ ప్రెసిడెంట్ ఎవి రావు, ఎక్స్పోరియం పార్క్ సిఇఒ రామ్‌దేవ్ తదితరులు పాల్గొన్నారు.

## 'ప్రతి కుటుంబానికి సొంతిల్లు – ప్రభుత్వం సంకల్పం'

### మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రంలోని ప్రతి కుటుంబం ఉన్నతమైన ప్రమాణాలతో నివసించేందుకు అనువైన సొంత ఇంటి వసతిని కల్పించాలనేది ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ముఖ్యంగా అన్ని వర్గాల ప్రజలకు అనువుగా ఉండే ధరల్లో ఒక సమగ్ర విధాన రూపకల్పనకు 'తెలంగాణా రైజింగ్ 2047 గ్లోబల్ సమ్మిట్' చక్కటి వేదిక అని ఆయన అన్నారు. భారత్ ఫ్యూచర్ సిటీలో జరుగుతున్న 'తెలంగాణా రైజింగ్ 2047 గ్లోబల్ సమ్మిట్'లో భాగంగా మంగళవారం 'అఫర్డ్ బుల్ హౌసింగ్ పాలసీ ఫర్ అర్బన్ ఫ్యూచర్ తెలంగాణా మోడల్ 2047' అనే అంశంపై జరిగిన సదస్సులో మంత్రి కీలక ఉపన్యాసం చేశారు. నూతన విధాన రూపకల్పనపెరుగుతున్న పట్ట



ణీకరణ, విస్తృతమవుతున్న గృహ అవసరాలను దృష్టిలో ఉంచుకుని దేశానికి ఆదర్శంగా ఉండేలా ఆర్థికంగా సాధ్యమైన, పర్యావరణ పరిరక్షణకు అనుగుణమైన, సాంకేతికత ఆధారిత అంశాలతో కూడిన సమగ్ర పాలసీని రూపొందిస్తున్నామని వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరించే విధానాలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రోల్ మోడల్‌గా నిలుస్తాయని మంత్రి విశ్వాసం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ పథకం ద్వారా ఇప్పటివరకు 42 లక్షల ఇళ్లు నిర్మించగా, ప్రస్తుతం ఇందిరమ్మ ఇండ్ల కింద 3.5 లక్షల ఇండ్లు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. మధ్యతరగతి కోసం హౌసింగ్ బోర్డు, రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ ద్వారా సుమారు ఒక లక్ష ఇళ్లు నిర్మించామని చెప్పారు. అయినప్పటికీ రాష్ట్రంలో గృహాల డిమాండ్ సరఫరా మధ్య పెద్ద అంతరం కొనసాగుతోందని, దీన్ని పూడ్చేందుకు ఆదాయంతో సంబంధం లేకుండా ప్రతీ వర్గానికీ అందుబాటులో గృహాలు కల్పించే సమగ్ర పాలసీ రూపొందిస్తున్నామన్నారు. కొత్త అఫర్డ్ బుల్ హౌసింగ్ పాలసీలో తాజాగా ప్రకటించిన క్యూర్, ప్యూర్, రేర్ జోన్‌లకు అనుగుణంగా విధానాలు రూపొందిస్తున్నామన్నారు. ఈ కా ర్యక్రమంలో ప్రపంచ బ్యాంకు ప్రతినిధి అభిజిత్ శంకర్ రే, రాంకీ సిఎండి నందకిషోర్, హడ్కో ఎం.డి వి. సురేష్, క్రెడై అధ్యక్షుడు జి. రామ్ రెడ్డి, ఎఎస్‌బిఎల్ సిఈఓ అజితేష్, సిబిఆర్ఈ ప్రతినిధి ప్రీతం మెహెరా తదితరులు పాల్గొన్నారు.


## పర్యాటక రంగంలో రూ.7,045 కోట్ల పెట్టుబడులు

### సిఎం–, మంత్రి జూపల్లి సమక్షంలో ఎంఒయులు

ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణ పర్యాటక రంగంలో భారీ పెట్టుబడులు వెల్లువెత్తాయి. కందుకూరులోని భారత్ ఫ్యూచర్ సిటీలో మంగళవారం జరిగిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ రెండో రోజున, పర్యాటక రంగంలో ఏకంగా రూ.7,045 కోట్ల పెట్టుబడి నిబద్ధతలు రాష్ట్రానికి దక్కాయి. సమిట్ ప్రాంగణంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సమక్షంలో దేశీయ, అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. ఈ పెట్టుబడుల ద్వారా 40 వేల మందికి ఉద్యోగాలు లభించే అవకాశం ఉందని, ఇందులో ప్రత్యక్షంగా10 వేల, పరోక్షంగా 30 వేల మందికి ఉపాధి లభిస్తుందని ఆశిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, టిజిటిడిసి మేనేజింగ్ డైరెక్టర్ క్రాంతి వల్లూరు, తదితర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

**పెట్టుబడుల వివరాలు ఇలా ఉన్నాయి..**

- రూ. 3,000 కోట్లు ఫుడ్‌లింక్ ఎఫ్‌బి హోల్డింగ్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్



- భారత్ ఫ్యూచర్ సిటీలో పిపిపి పద్ధతిలో ఇంటిగ్రేటెడ్ గ్లోబల్ కన్వెన్షన్, ట్రేడ్ &ఎగ్జిబిషన్ సెంటర్
- రూ. 1,000 కోట్లు డ్రీమ్‌వ్యాలీ గోల్ఫ్ & రిసార్ట్స్ , భారత్ ఫ్యూచర్ సిటీలో ప్రపంచస్థాయి గోల్ఫ్ డెస్టినేషన్
- రూ.1,000 కోట్లు సారస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ భారత్ ఫ్యూచర్ సిటీలో అంతర్జాతీయ సాంస్కృతిక కేంద్రం
- రూ.800 కోట్లు అట్మాస్ఫియర్ కోర్ హోటల్స్ (మాల్దీవులు) హైదరాబాద్‌లో ఎలైట్ అంతర్జాతీయ వెల్‌నెస్ రిట్రీట్ (అగ్రశ్రేణి అంతర్జాతీయ ఆరోగ్య కేంద్రం)
- రూ.300 కోట్లు పోలిన్ గ్రూప్ (టర్కీ) మల్టీవర్స్ హోటల్స్ ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్‌లో ప్రపంచస్థాయి ఆక్వా మెరైన్ పార్క్ & ఆక్వా టన్నెల్
- రూ. 300 కోట్లు ఫ్లూయిడ్రా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (స్పెయిన్) హైదరాబాద్‌లో కృత్రిమ బీచ్ , లగూన్ & రిసార్ట్ ప్రాజెక్ట్
- రూ. 300 కోట్లు శ్రీ హవిష హాస్పిటాలిటీ & ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ హైదరాబాద్‌లో స్మార్ట్ మొబిలిటీ వెల్‌నెస్ రిసార్ట్ & కన్వెన్షన్ సెంటర్
- రూ. 200 కోట్లు కేఈఐ గ్రూప్ & అసోసియేట్స్ (కామినేని గ్రూప్) కిస్మత్‌పూర్ గ్రామం, గండిపేట వద్ద గ్లాస్‌హౌస్‌గ్రీన్‌హౌస్ కన్వెన్షన్ సెంటర్
- రూ. 120 కోట్లు రిధిరా గ్రూప్, యాచారం, భారత్ ఫ్యూచర్ సిటీ వద్ద నోవోటెల్ బ్రాండెడ్ హాస్పిటాలిటీ ప్రాజెక్ట్
- రూ. 25 కోట్లు సలాం నమస్తే దోస హట్ ప్రైవేట్ లిమిటెడ్ (ఆస్ట్రేలియా) విజ్యాగ్ రిక్రియేషన్ ప్రైవేట్ లిమిటెడ్ అడ్వెంచర్&ఈకోటూరిజాన్ని ప్రో త్సహించడానికి రాష్ట్రమంతటా కారవాన్ పార్కులు

# జనరల్
STATE & REGIONAL NEWS

## గ్లోబల్ సమ్మిట్ సందర్శనకు పాఠశాలల విద్యార్థులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో నిర్వహిస్తున్న తెలంగాణ రైసింగ్ గ్లోబల్ సమ్మిట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను సందర్శించడానికి ప్రత్యేకంగా ఎంపిక చేసిన కొన్ని రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థులకు మాత్రమే అనుమతిస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ఆయా పాఠశాలలను రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఎంపిక చేస్తారని, కేవలం ఎంపిక చేసిన ఈ పాఠశాలల విద్యార్థులకు మాత్రమే బుధవారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఏడు గంటల వరకు అనుమతిస్తున్నట్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం నుండి మిగిలిన రోజుల్లో ఎవరెవరికి ప్రవేశం ఉంటుందనే విషయమై బుధవారం ప్రకటించడం జరుగుతుందన్నారు.

TELANGANA RISING GLOBAL SUMMIT

# రూ.5.75 లక్షల కోట్ల పెట్టుబడులు





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025లో రాష్ట్రానికి పెట్టుబడులు వెల్లువెత్తాయి. ఈ గ్లోబల్ సమ్మిట్‌లో రూ.5.75 లక్షల కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు వివిధ కంపెనీలు ప్రభుత్వంతో ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు వివిధ కంపెనీలు ఆసక్తి చూపుతూ మొదటి రోజు రూ. 2.43 లక్షల కోట్లు, రెండోవ రోజు రూ.3.32 లక్షల కోట్లకు ఎంఒయులు కుదుర్చుకున్నారు. పెట్టుబడులు పెట్టేందుకు అసక్తిగల వివిధ కంపెనీ ప్రతినిధులతో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, వివిధ శాఖలకు చెందిన మంత్రులతో సమావేశమయ్యారు. గోద్రేజ్ జెర్సీ సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ ఫిరోజ్‌షా గోద్రెజ్, గ్రూప్ ప్రెసిడెంట్ రాకేష్ స్వామి సిఎం రేవంత్ రెడ్డితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో తమ కంపెనీ విస్తరణపై వారు సిఎంతో చర్చించారు. మిల్క్, ఎఫ్‌ఎంసిజి, రియల్ ఎస్టేట్, ఆయిల్ పామ్ విభాగాల్లో పెట్టుబడులకు ఆ సంస్థ ఆసక్తి చూపింది. అలాగే సిఎం రేవంత్ రెడ్డితో బయోవరం ఫార్మా గ్రూప్ చైర్మన్ వరప్రసాదరెడ్డి ,ఆ సంస్థ ప్రతినిధులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలు ఒప్పందాలు చేసుకున్నారు. రాష్ట్ర అభివృద్ధికి ప్రైవేట్ రంగం ముందుకు రావడం పట్ల సంతోషంగా ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా పేర్కొన్నారు. తెలంగాణను భారతదేశంలో నెంబర్1 ఇన్వెస్ట్మెంట్ డెస్టినేషన్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యమని తెలిపారు.

### విద్యుత్‌లో రూ.3,24,698 కోట్లు : భట్టి

పెట్టుబడులకు స్వర్గ ధామం తెలంగాణ అంటూ గ్లోబల్ సమ్మిట్‌లో పెద్ద ఎత్తున పెట్టుబడులు ఆకర్షించేందుకు ఉపముఖ్యమంత్రి, విద్యుత్తు, ఆర్థిక, ప్రణాళిక శాఖ మంత్రి డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగారు. ఇందుకు సంబంధించి ఆయన గత కొద్దిరోజులుగా తన శాఖ సిబ్బందితో తెలంగాణ యువతకు ఉపాధి కల్పించేందుకు పకడ్బందీ ప్రణాళిక రూపొందించారు. ఆ మేరకు తన శాఖ పరిధిలోని ఉన్నతాధికారులతో పలుమార్లు సమీక్ష సమావేశాలు నిర్వహించి ఒప్పందాలకు సంబంధించిన ప్రగతిని తాను స్వయంగా పర్యవేక్షించారు. ఫలితంగా గ్లోబల్ సమ్మిట్‌లో రెండు రోజుల వ్యవధిలో ఆయన శాఖలకు సంబంధించి రూ 3.24 లక్షల కోట్ల ఒప్పందాలు జరిగాయి. ఈ ఒప్పందాల ద్వారా రాష్ట్రంలోని 1,40,500 మంది తెలంగాణ యువతకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. తెలంగాణ జెన్కో, రెడ్కో,సింగరేణి సంస్థలు వివిధ కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకున్నాయి.

## పలు కంపెనీలతో తెలంగాణ ప్రభుత్వం ఒప్పందాలు

### రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టనున్న పారిశ్రామిక, వాణిజ్య సంస్థల వివరాలు

**గోద్‌రేజ్ ఇండస్ట్రీస్ గ్రూప్ :** డెయిరీ విస్తరణకు రూ.150 కోట్లు పెట్టుబడిరోజుకు 5 లక్షల లీటర్ల ప్రాసెసింగ్ సామర్థ్యంతో యూనిట్ ఏర్పాటు. 40 ఎకరాల్లో ప్రాజెక్ట్ రెండేళ్లలో 300 ఉద్యోగాలు.

**ఫెర్‌టిస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ :** ఫుడ్,అగ్రికల్చర్ ఆర్‌అండ్‌డి సెంటర్, అత్యాధునిక రెయర్ షుగర్స్ తయారీ యూనిట్ ఏర్పాటు.అల్లులోజ్, గ్లెసిన్ ఆధారిత పదార్థాలు, ఫంక్షనల్ న్యూట్రియంట్స్ ఉత్పత్తి, మొత్తం పెట్టుబడి రూ. 2,000 కోట్లు (మొదటి దశలో రూ 500 కోట్లు, రెండవ దశ రూ1,500 కోట్లు). 100 ఎకరాలు 800 మందికి పైగా ఉద్యోగ అవకాశాలు. అదనంగా సస్టెయినబుల్ అగ్రికల్చర్ కోసం రూ.200 కోట్లు పెట్టుబడి ప్రతిపాదన

**కెజెఎస్ ఇండియా:** 44 ఎకరాలలో యూనిట్2తో భారీ ఎఫ్‌అండ్‌బి తయారీ విస్తరణ. పెట్టుబడి రూ. 650 కోట్లు, 1,551 ఉద్యోగాలు. నెస్లే, యూనిలీవర్, మయోరా వంటి గ్లోబల్ బ్రాండ్స్కు కాంట్రాక్ట్ మాన్యుఫ్యాక్చరింగ్

**వింటేజ్ కాఫీ, బివేరేజస్ ప్రీమియం:** 15 ఎకరాల్లో ఫ్రీజ్ డ్రైడ్‌కాఫీ ఎగుమతి యూనిట్ ఏర్పాటు. పెట్టుబడి రూ. 1,100 కోట్లు, 1,000 ఉద్యోగాలు.

**రిలయన్స్ కన్జుమర్ ప్రొడక్ట్స్ (ఆర్‌సిపిఎల్):** వెయ్యి ఎకరాల్లో మల్టీప్రోడక్ట్ ఎఫ్‌ఎంసిజి తయారీ యూనిట్ ఏర్పాటు, బేవరేజెస్, స్నాక్స్, కన్ఫెక్షనరీ ఉత్పత్తుల నిమ్మితం రూ.1,500 కోట్ల పెటుటబడి ,1,000 ఉద్యోగాలు.

**కెన్స్ టెక్నోలజీ సంస్థ:** ఎలక్ట్రానిక్స్ కాంట్రాక్ట్ మాన్యుఫ్యాక్చరింగ్ విస్తరణకు రూ 1,000 కోట్ల పెట్టుబడికి ప్రతిపాదనలు

**జెసికె ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్:** డేటా సెంటర్ ఫెసిలిటీస్, అనుబంధ మౌలిక వసతులు. రూ.9వేల కోట్ల పెట్టుదులు, రెండు వేల ఉద్యోగ అవకాశాలు

**ఆర్‌టిసి ఎనర్జీ ఇండియా సంస్థ:** మూడు దశల్లో రూ. 2,500 కోట్ల పెట్టుబడి. 1,600 పైగా ఉద్యోగాలు

**అక్వీలన్ నెక్సస్ లిమిటెడ్:** క్లీన్ ఎనర్జీ ఆధారిత 50 ఎండబ్ల్యు 'నెట్ జిరో డేటా సెంటర్ ' ఏర్పాటు ఎఐఐఒటి సొల్యూషన్స్ కోసం తెలంగాణ హబ్‌గా అభివృద్ధి.

**ఎజిపి గ్రూప్ :** 125 ఎకరాల్లో 1జి డబ్ల్యు హైపర్స్కేల్ డేటా సెంటర్ క్యాంపస్ ఏర్పాటు. అలాగే బిఇఎస్ఎస్( బ్యాటరీ ఎనర్జీ స్టోర్ సిస్టమ్). రూ.6,750 కోట్ల పెట్టుబడి.

**ఇన్‌ఫ్రాకిడ్‌సి పార్క్స్:** 150 ఎకరాల్లో భారీ 1జిడబ్ల్యు ఎఐ రెడీ డేటా పార్క్ ఏర్పాటు. రూ. 70వేల కోట్ల భారీ పెట్టుబడి ప్రతిపాదనలు.

**పుర్‌వ్యా గ్రూప్:**810 ఎకరాల్లో 50 ఎండబ్ల్యు డేటా గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ ఏర్పాటు.మూడువేల ఉద్యోగాలు

**హెటిరో గ్రూప్ :** వంద ఎకరాల్లో భారీ ఫార్మాస్యూటికల్ ఫార్ములేషన్ యూనిట్ ఏర్పాటు రూ. 1,800 కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలు. 9వేల మందికి పైగా ఉద్యోగ అవకాశాలు .

**భారత్ బయోటెక్ :** 34 ఎకరాల్లో ఆధునిక సిఆర్‌డిఎంఒ సౌకర్యం ఏర్పాటు. రూ. వెయ్యి కోట్ల పెట్టుబడి, 200 మందికిపైగా ప్రత్యక్ష,పరోక్ష ఉద్యోగాలు.

**అరబిందోఫార్మా :** కాంప్లెక్స్ జనరిక్స్, ఇంజెక్టబుల్స్, బయోసిమిలర్స్ విస్తరణ. రూ.రెండు వేల కోట్ల పెట్టుబడులు. మూడు వేల ఉద్యోగాలు.

### గ్రనూల్స్ ఇండియా

- ☞ వంద ఎకరాల్లో పెప్టైడ్స్ తయారీ, ఆంకాలజీ సిడిఎంఒ యూనిట్ ఏర్పాటు, రూ.1,200 కో ట్లు, గ్రీన్ ఫార్మా సిటీలో తెలంగాణలో డెయిరీ విస్తరణకు రూ.150 కోట్లు పెట్టుబడి. 40 ఎకరాల్లో యూనిట్300 ఉద్యోగాలు.
- ☞ అల్లులోజ్, రెయర్ షుగర్స్ తయారీ యూని ట్తో పాటు అగ్రి ఆర్&డి సెంటర్. మొత్తం పెట్టుబడి రూ.2,000 కోట్లు800 ఉద్యోగాలు.
- ☞ కెసిఎస్ ఇన్ ఇండియా రూ.650 కోట్లతో యూనిట్ 2 ఫుడ్ & బేవరేజెస్ తయారీ విస్తరణ. 1,551 ఉద్యోగాలు.
- ☞ వినటేజ్ కాఫీ ప్రిమియం ఫ్రీజ్‌డ్రైడ్ కాఫీ ప్లాంట్కు రూ.1,100 కోట్లు. 1,000 ఉద్యోగాలు.
- ☞ రిలియన్స్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ ఎఫ్‌ఎంసిజి తయారీ యూనిట్కు రూ.1,500 కోట్లు1,000 ఉద్యోగాలు.
- ☞ కైనెస్ టెక్నాలజీ ఎలక్ట్రానిక్స్ తయారీ విస్తరణకు రూ.1,000 కోట్ల పెట్టుబడి.
- ☞ జెసికె ఇన్‌ఫ్రా డేటా సెంటర్ ఫెసిలిటీకి రూ.9,000 కోట్లు2,000 ఉద్యోగాలు.
- ☞ ఆర్‌సిటి ఎనర్జీ 3 దశల్లో రూ.2,500 కోట్లు1,600 ఉద్యోగాలు.
- ☞ అకిలోన్ నెక్సస్ క్లీన్ ఎనర్జీ ఆధారిత 50 ఎండబ్ల్యు నెట్‌జీరో డేటా సెంటర్.
- ☞ ఎజిపి గ్రూప్ 125 ఎకరాల్లో 1 జిడబ్ల్యు డేటా సెంటర్ క్యాంపస్, బిఇఎస్ఎస్ రూ.6,750 కోట్లు.
- ☞ ఇన్‌ఫ్రాకీ డిసి పార్క్ 150 ఎకరాల్లో 1 జిడబ్ల్యు ఎఐ రెడీ డేటా పార్క్‌రూ.70,000 కోట్ల భారీ పెట్టుబడి.
- ☞ పూర్వీ గ్రూప్ జిసిసి + 50 ఎండబ్ల్యు డేటా సెంటర్3,000 ఉద్యోగాలు.
- ☞ హెటిరో ఫార్మా ఫార్ములేషన్ యూనిట్లకు రూ.1,800 కోట్లు9,000 ఉద్యోగాలు.
- ☞ భారత్ బయోటెక్ సిఆర్‌డిఎంఒ సదుపాయానికి రూ.1,000 కోట్లు200 ఉద్యోగాలు.
- ☞ అరబిందో ఫార్మా కాంప్లెక్స్ జనరిక్స్ విస్తరణకు రూ.2,000 కోట్లు3,000 ఉద్యోగాలు.
- ☞ గ్రానులెస్ ఇండియా పెప్టైడ్స్, ఆంకాలజీ సిడిఎంఒ యూనిట్‌రూ.1,200 కోట్లు3,000 ఉద్యోగాలు.
- ☞ బయోలాజికల్ ఇ వ్యాక్సిన్, సిడిఎంఇ ప్రాజెక్ట్కు రూ.3,500 కోట్లు (మొత్తం 4,000 కోట్లు)3,000 ఉద్యోగాలు.



## సోలార్ సైకిల్‌పై రవాణా మంత్రి రయ్ రయ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2047లో విద్యార్థులు తయారు చేసిన సోలార్ సైకిల్‌పై రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ రయ్ రయ్ అంటూ చక్కర్లు కొట్టారు.




## తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్.. 3వేల డ్రోన్లతో గిన్నిస్ రికార్డ్



**హైదరాబాద్ :** తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్ ముగింపు వేడుకలో ఏర్పాటు చేసిన భారీ డ్రోన్ షో ఆకట్టుకుంది. తెలంగాణ రైజింగ్–2047 లక్ష్యాలు వివరించే థీమ్‌లతో డ్రోన్ షో ఏర్పాటు చేశారు. గిన్నిస్ రికార్డు సాధించేలా 3 వేల డ్రోన్‌ల తో ప్రత్యేక ప్రదర్శన నిర్వహించారు. గతంలో అబుదాబిలో 2,131 డ్రోన్ల ప్రదర్శనకు గిన్నిస్ బుక్ రికార్డు వరించింది. తాజాగా దానిని అధిగమించేలా 3 వేల డ్రోన్లతో తెలంగాణ ప్రభుత్వం డ్రోన్ ప్రదర్శన ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమానికి హాజరైన గిన్నిస్ వరల్డ్ రికార్డు సభ్యులు సిఎం రేవంత్‌రెడ్డికి ధ్రువపత్రాన్ని అందజేశారు. ముగింపు వేడుకల సందర్భంగా బాణసంచా వెలుగుల్లో గ్లోబల్ సమిట్ ప్రాంగణం కాంతులీనింది.



## పోలీస్ స్టాల్ టిజి క్వెస్ట్‌ను సందర్శించిన డిజిపి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** గ్లోబల్ సమ్మిట్‌లో ఏర్పాటు చేసిన పోలీస్ స్టాల్ టిజి క్వెస్ట్‌ను రాష్ట్ర డిజిపి బి.శివధర్ రెడ్డి మంగళవారం సందర్శించారు. రాష్ట్రంలో శాం తిభద్రతల నిర్వహణకు సాంకేతిక విజ్ఞానం ఆవశ్యకతపై అవగాహన కల్పించేందుకు టిజి క్వెస్ట్ స్టాల్‌ను ఏర్పాటు చేసినట్లు పోలీస్ అధికారులు డిజిపికి వివరించారు. ఈ సందర్భంగా, పోలీసు విధుల్లో డ్రోన్లు కీలకపాత్ర పోషిస్తున్నందున వాటి వినియోగాన్ని విస్తృతం చేస్తున్నట్లు అధికారులు తెలియజేశారు. భారీ స్థాయిలో బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్న సందర్భంలో డ్రోన్ల వినియోగం పలు ప్రయోజనాలను చేకూరుస్తుందని తెలిపారు. నేరాల నియంత్రణలోనూ, పరిశోధనలోనూ, మహిళా భద్రతలలో, ట్రాఫిక్ నియంత్రణలో, విఐపిల బందోబస్తులో, అలాగే తీవ్రవాద, ఉగ్రవాద అరచకాలను నియంత్రించడంలో వీటిని ఉపయోగించడం ద్వారా నేరాలను నియంత్రించవచ్చని డిజిపి అభిప్రాయపడ్డారు. పోలీసు విధుల్లో సాంకేతిక పరిజ్ఞాన వినియోగాన్ని ప్రస్ఫుటం చేస్తూ 'టీజీ క్వెస్ట్' స్టాల్‌ను తీర్చిదిద్దడాన్ని డిజిపి అధికారులను అభినందించారు.అనుమానాస్పద, సమస్యాత్మక ప్రాంతాలను అత్యంత తక్కువ సమయంలో, సమర్థంగా గుర్తించడంలో ఈ డ్రోన్లు కీలకం కానున్నాయ నీ, దర్యాప్తు అధికారులు క్షేత్రస్థాయిలోకి దిగకముందే, డ్రోన్ల ద్వారా సేకరించిన సమాచారం, దృశ్యాలను వారికి అందించడం వల్ల విచారణ ప్రక్రియ వేగవంతమవుతుందని తెలియజేశారు. గ్లోబల్ సమ్మిట్‌లో ఏర్పాటు చేసిన కమాండ్‌కంట్రోల్ సెంటర్‌లో డ్రోన్ల పనితీరును శివధర్ రెడ్డి పరిశీలించారు. గ్లోబల్ సమ్మిట్ ప్రాంతంలో పరిసరాలను గమనించేందుకు దాదాపు 10 డ్రోన్లను వినియోగించినట్లు అధికారులు తెలిపారు. వచ్చే నెలలో జరగనున్న సమ్మక్కసారలమ్మ జాతరలో డ్రోన్లను విస్తృతంగా ఉపయోగించాలని నిర్ణయించారు.

## తెలంగాణ ఆర్థిక ప్రగతిలోకి వ్యవసాయ రంగమే గ్రోత్ ఇంజిన్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ ఆర్థిక ప్రగతికి వ్యవసాయ రంగం గ్రోత్ ఇం జిన్‌గా మారబోతుందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. హైదరాబాద్ భారత్ ఫ్యూచర్ సిటీలో రెండో రోజు గ్లోబల్ సమ్మిట్ ప్రాంగణంలో గోద్రెజ్ అగ్రోవెట్ లిమిటెడ్ సిఇఒ సొగత్ నియోగి,ఆయిల్ పామ్ బిజినెస్ వైస్ ప్రెసిడెంట్ చావా వెంకటేశ్వర రావు...కార్పొరేట్ అఫైర్స్ మీషికా నాయర్‌లతో మంత్రి తుమ్మలతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజన్ డాక్యుమెంట్‌పై ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రై తాంగం సంక్షేమం కోసం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రెండు ఏళ్ళలో లక్ష కోట్లు ఖ ర్చు పెట్టామన్నారు. ప్రభుత్వం 10 లక్షల ఎకరాల్లో ఆయిల్ ఫామ్ సాగు లక్ష్యంగా పెట్టుకోగా, ప్రస్తుతం మూడు లక్షల ఎకరాల్లో పామాయిల్ సాగు అవుతోందన్నారు. రైతులకు దీర్ఘకాలం లాభాలు ఉండేలా పామాయిల్ సాగు విస్తరణ చేపట్టినట్లు త ద్వారా గ్రీన్ కవర్ పెరగటంతో పాటు పర్యావరణ హితంగా పామాయిల్ సాగు గే మ్ చేంజర్‌గా మారుతుందని మంత్రి తుమ్మల విజన్ డాక్యుమెంట్‌లో వివరించారు. ఖమ్మం జిల్లా కొణిజెర్ల మండలం గుబ్బగుర్తి గ్రామంలో మెస్సర్స్ టిఎస్‌ఐఐసి లిమిటెడ్ ఇంటిగ్రేటెడ్ ఆయిల్ పామ్ కాంప్లెక్స్ పురోగతిపై మంత్రి తుమ్మలకు వివరించారు. స్థిరమైన వ్యవసాయ ఉత్పాదకతకు మద్దతు ఇచ్చే అధికనాణ్యత, వాతావరణస్థితిస్థాపక సంకరజాతులకు తెలంగాణ, భారతదేశంలోని వ్యవసాయ వర్గాలను మరింత విస్తృతంగా శక్తివంతం చేయడం ప్రధాన లక్ష్యమని కంపెనీ ప్రతినిధులు మంత్రికి వివరించారు.

## అభివృద్ధి వ్యూహం ఒకే రంగానికి పరిమితం కాదు

కనెక్టెడ్ తెలంగాణ -ఇంటిగ్రేటెడ్ ట్రాన్స్‌పోర్ట్ అండ్ అర్బన్ రూరల్ కనెక్టివిటీ' అంశంపై చర్చగోష్టిలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** విమానయాన రంగంలో తెలంగాణను దేశంలోనే అగ్రగామి ఎయిర్ హబ్‌గా, అంతర్జాతీయ లాజిస్టిక్స్, పర్యాటనం,వ్యాపార ప్రయాణాల మధ్య కేంద్రముగా అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2047 లో భాగంగా 'రోడ్ సెక్టర్ పాలసీ'ని సిఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు, రోడ్డు భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్‌తో కలిసి మంత్రి ఆవిష్కరించారు. అనంతరం 'కనెక్టెడ్ తెలంగాణ ఇంటిగ్రేటెడ్ ట్రాన్స్‌పోర్ట్ అండ్ అర్బన్ రూరల్ కనెక్టివిటీ'' అంశంపై చర్చ గోష్టి జరిగింది. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మట్లాడుతూ తమ అభివృద్ధి వ్యూహం ఒకే రంగానికి పరిమితం కాదని, రోడ్లు, రైల్వేలు, విమానయానం, డిజిటల్ మౌలిక వసతులు, కరెంట్, ఆరోగ్యం, లాజిస్టిక్స్ ఇలా అన్ని రంగాలు ఒకేసారి ముందుకు వెళ్లేలా ప్లాన్ చేయడంతో పాటు రాష్ట్ర చరిత్రలోనే మొదటిసారిగా రోడ్ సెక్టర్ పాలసీని తీసుకువచ్చామన్నారు.

### అత్యాధునిక డ్రైపోర్ట్ ఏర్పాటు..

తెలంగాణ ల్యాండ్‌లాక్డ్ రాష్ట్ర పరిమితిని అధిగమిస్తూ, అత్యాధునిక డ్రై పోర్ట్‌ను కూడా ఏర్పాటు చేస్తున్నామని, రాష్ట్రాన్ని బలమైన ఆర్థిక కేంద్రంగా మార్చడానికి ఇది కీలకం కానుందని మంత్రి అన్నారు. ఈ సెషన్ హైదరాబాద్‌కు దగ్గరగా ఉండే ప్రాంతాల నుంచి మొత్తం రాష్ట్రానికి, దక్షిణ భారతదేశానికి ఎలా బలమైన కనెక్టివిటీ ఇవ్వాలో దానిపైనే దృష్టి పెడుతోందన్నారు. అలాగే దేశం, ప్రపంచంతో కలిసిపోయే నిరంతర కనెక్టివిటీని మరింత బలం చేస్తోందన్నారు. రెండు తెలుగు రాష్ట్ర రాజధానులను కలిపేలా 8లేన్ గ్రీన్‌ఫీల్ ఎక్స్‌ప్రెస్ హైవే ఏర్పాటుతో పాటు శ్రీశైలం దేవస్థానానికి ఎలివేటెడ్ కారిడార్ వంటి ప్రాజెక్టులను నిర్మించడం వంటివి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతగా తీసుకుంటోందని మంత్రి వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రం 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగడమే లక్ష్యంగా ముందుకు సాగుతోందని, ఇది సాధించాలంటే రహదారులతో పాటు రైల్వే కనెక్టివిటీ కూడా వేగంగా, సమర్థంగా ఉండాలన్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణలో పరిశ్రమలు, సరుకు రవాణా కోసం ప్రత్యేక రైలు కారిడార్లు, రైల్వే స్టేషన్లను అంతర్జాతీయ ప్రమాణాల టర్మినల్స్‌గా రూపుదిద్దడం, ఉపనగర, అంతర్ రాష్ట్ర రైలు కనెక్టివిటిని విస్తరించడం, హైస్పీడ్ రైల్వే, బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టులు వంటి అంశాలపై దృష్టి పెట్టిందన్నారు. ఈ సమావేశం ద్వారా భవిష్యత్తులో మంచి ఫలితాలను ఇస్తాయని, తెలంగాణ రైజింగ్ విజన్ 2047 వైపు అడుగులు మరింత బలంగా ముందుకు సాగుతాయని ఆశిస్తున్నానని మంత్రి పేర్కొన్నారు.

## అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణ క్రీడాకారులు

మంత్రి అజారుద్దీన్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ నుంచి అనేకమంది క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయికి వెళ్లారని మంత్రి అజారుద్దీన్ అన్నారు. గోపీచంద్ అకాడమీ నుంచి అనేక మంది వచ్చారని క్రీడాభివృద్ధిలో మైదానాల పాత్ర చాలా కీలకం అన్నారు. ఫుట్ బాల్‌ను కూడా రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని చెప్పారు. ఇవాళ తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ రెండో రోజు కార్యక్రమాల్లో భాగంగా 'ఒలింపిక్ గోల్డ్ క్వెస్ట్' అంశంపై చర్చ నిర్వహించారు. దీనిలో మంత్రి అజారుద్దీన్‌తో పాటు క్రీడా ప్రముఖులు అనిల్ కుంబ్లే, పుల్లెల గోపీచంద్, పివి సింధు, అంబటి రాయుడు, గుత్తా జ్వాల పాల్గొన్నారు. ఈ చర్చలో మాట్లాడిన అజారుద్దీన్.. పివి సింధు, సైనా నెహ్వాల్, గుత్తా జ్వాల మంచి పేరు తెచ్చుకున్నారని క్రీడాకారులకు ఆర్థిక సమస్యలు లేకుండా చూడాల్సిన అవసరం ఉందన్నారు. క్రీడాపాలసీతో అనేక ఉపయోగాలు ఉన్నాయని క్రీడాకారులకు ప్రభుత్వం నుంచి అండదండలు అవసరం అన్నారు. క్రీడాకారులకు ఆర్థిక సాయం, మంచి ఉద్యోగం ఇవ్వాలన్నారు.

### ప్రతిదశలో ప్రోత్సాహం అవసరం: పివి సింధు

ఈ చర్చలో పివి సింధు మాట్లాడుతూ క్రీడాకారుల విజయానికి అనేక అంశాలు దోహదం చేస్తాయని అన్నారు. మౌలిక వసతులు, కోచ్లు చాలా కీలకమని చెప్పారు. ప్రతి దశలోనూ క్రీడాకారులకు ప్రోత్సాహం అవసరమన్నారు. సిఎం రేవంత్ రెడ్డి క్రీడలకు ఎంతో మద్దతుగా నిలుస్తున్నారని రాబోయే సంవత్సరాలు తెలంగాణ క్రీడాకారులకు ఎంతో ఆశాజనకంగా ఉండబోతున్నాయన్నారు.

### విజన్ 2047 అద్భుతం : గోపీచంద్

పుల్లెల గోపీచంద్ మాట్లాడుతూ హైదరాబాద్ దేశంలోనే ఉత్తమ నగరాలలో ఒకటని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజన్ 2047 నిజంగా అద్భుతమైనదన్నారు. క్రీడల పట్ల ముఖ్యమంత్రికి వ్యక్తిగత నిబద్ధత ఉందని స్పోర్ట్స్ సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ హబ్‌ల ప్రకటన నుంచి పిల్లల్లో ఫిట్నెస్, క్రీడల్లో పాల్గొనడాన్ని ప్రోత్సహించే విషయాలు ఇందుకు నిదర్శనం అన్నారు. రేవంత్ రెడ్డి దేశంలోనే అత్యంత ఫిట్ సిఎంలలో ఒకరు అని ఆయ న క్రమశిక్షణ, క్రీడల పట్ల ఉన్న ఉత్సాహం అందరికీ ప్రేరణనిస్తుందన్నారు. తెలంగాణ క్రీడల భవిష్యత్తుపై ఆశాభావం వ్యక్తం చేస్తూ ఈ సమ్మిట్‌లో భాగస్వామిగా ఉండటం ఎంతో ఆనందంగా ఉందన్నారు.


## హైదరాబాద్‌లో ప్రపంచస్థాయి ఫుడ్‌బాల్ అకాడమీ : మంత్రి వాకిటి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఫీఫా – ఎఐఎఫ్ఎఫ్ ఫుట్ బాల్ అకాడమీ టాలెంట్ అభివృద్ధికి ప్రపంచ స్థాయి అకాడమీ హైదరాబాద్‌లో స్థాపించనున్నామని క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. గ్లోబల్ సమ్మిట్ ద్వారా తెలంగాణ స్పోర్ట్ విభాగంలో పెట్టుబడుల ద్వారా తెలంగాణ క్రీడా ముఖచిత్రం మారబోతుందని మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన స్పోర్ట్స్ శాఖలో వస్తున్న అభివృద్ధిని వివరించారు. జిఎంఆర్ స్పోర్ట్స్ ఫ్యూచర్ సిటీ ప్రాజెక్ట్ లో భాగంగా శాటిలైట్ స్పోర్ట్స్ సిటీ అభివృద్ధి చేయనున్నారన్నారు. ఇండియా ఎక్స్ ట్రీమ్ అడ్వెంచర్ 20 ఎకరాల్లో ఎక్స్ ట్రీమ్ స్పోర్ట్స్ అడ్వెంచర్, ఈస్పోర్ట్స్ అరేనా మొత్తంగా రూ.500 కోట్లు పెట్టుబడి పెట్టడానికి సిద్ధమైందని వివరించారు. డ్రీమ్‌వాలీ గోల్ఫ్ అండ్ రిసార్ట్స్ రూ.1,000 కోట్లతో నిర్మించనున్నారన్నారు. తెలంగాణను గ్లోబల్ హాకి హబ్‌గా మార్చేందుకు హాకీ మహిళల వరల్డ్ కప్ క్వాలిఫైయర్ 2026ను 8 దేశాలు పాల్గొనే అంతర్జాతీయ పోటీని గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించనున్నారు. 18 దేశాలు పాల్గొనే ఏషియన్ రోయింగ్ ఛాంపియన్‌షిప్ 2026 నిర్వహించనున్నారు. హైదరాబాద్ ఇంటర్నేషనల్ చెస్ ఫెస్టివల్ 2026 ప్రపంచంలోనే అతి పెద్ద చెస్ ఉత్సవం కానుందని ఆయన తెలిపారు.

### 2036 ఒలంపిక్స్‌లో అధిక పథకాల లక్ష్యం : వాకిటి

రాబోయే 2036 ఒలంపిక్స్ లో, అంతర్జాతీయ స్థాయి పోటీలో తెలంగాణ క్రీడాకారుల ప్రాతినిధ్యం పెంచే లక్ష్యంగా పాలసీని అమలు చేస్తున్నామని రాష్ట్ర కీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. క్రీడాకారులు, పారిశ్రామికవేత్తలు ప్రభుత్వ పెద్దలతో కమిటీ సభ్యులుగా తెలంగాణ స్పోర్ట్స్ హబ్ ను ఏర్పాటు చేశామన్నారు. భారత్ ఫ్యూచర్ సిటీలో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో జరిగిన తెలంగాణ ఒలింపిక్ గోల్డ్ క్వెస్ట్ సదస్సులో మంత్రి వాకిటి శ్రీహరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీహరి మాట్లాడుతూ... యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ స్పోర్ట్స్ యూనివర్సిటీ, యంగ్ ఇండియా స్పోర్ట్స్ అథారిటీని నూతనంగా ఏర్పాటు చేశామని మంత్రి తెలియజేశారు. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ద్వారా పాఠశాల స్థాయి నుండే క్రీడా వ్యవస్థ బలోపేతానికి కృషి చేస్తున్నామన్నారు. తెలంగాణలోనే 119 నియోజకవర్గాల్లో మినీ స్టేడియాలు, గ్రా మాల్లో క్రీడా మైదానాల ఏర్పాటు చేస్తున్నామని తెలిపా రు. వెయ్యి ఎకరాల్లో శాటిలైట్ స్పోర్ట్స్ సిటీని ఏర్పాటు చేసి తద్వారా ఒలంపిక్, అంతర్జాతీయ స్థాయి క్రీడా ఈ వెంట్లకు ఆతిథ్య కేంద్రంగా హైదరాబాదును తీర్చిదిద్దడ మే లక్ష్యమన్నారు. స్పోర్ట్స్ టెక్ స్టార్టప్‌లు టూరిజం లాంటివి అన్నీ టీహబ్, టి.ఎస్ ఐపాస్ భాగస్వామ్యంతో ముందుకు సాగుతున్నాయన్నారు. అథ్లెట్‌ల సంక్షేమానికి మా ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. వారికోసం గ్రేడెడ్ ఇంటెన్సివ్‌లు, ఇన్సూరెన్సు, గురువందనం లాంటి స్కీములు ప్రవేశపెట్టడం జరిగిందని తెలిపారు. క్రీడా వ్యవస్థను బలోపేతం చేయడం కోసం కోచింగ్ మౌలిక సదుపాయాలు ఇన్నోవేషన్ అథ్లెట్ డెవలప్మెంట్ రంగాల్లో తోడ్పాటుకు భాగస్వాములు కావడానికి ఈ వేదిక ద్వారా ఆహ్వానిస్తున్నామన్నారు. మంత్రి అజారుద్దీన్, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డి,తెలంగాణ ఒలంపిక్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎపి జితేందర్ రెడ్డి, స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేశ్ రంజన్, మాజీ క్రికెటర్లు అనిల్ కుంబ్లే,అంబటి రాయుడు, బ్యాడ్మింటన్ క్రీడాకారులు పుల్లెల గోపీచంద్ పివి సింధు, జ్వాలా గుత్తా, స్పోర్ట్స్ సీనియర్ జర్నలిస్ట్ బాలా మజుందార్, స్పోర్ట్స్ హబ్ మెంబర్ విఠాదాని తదితరులు పాల్గొన్నారు.



# జాతీయం

NATIONAL & GENERAL NEWS

## అనంతనాగ్, కుల్గాంలో ఎన్ఐఎ సోదాలు



**శ్రీనగర్ :** ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో నవంబర్ 10న జరిగిన పేలుడు దర్యాప్తులో భాగంగా జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) మంగళవారం జమ్మూ కశ్మీర్‌లోని అనంతనాగ్, కుల్గాం జిల్లాల్లోని అనేక ప్రదేశాలలో సోదాలు నిర్వహించిందని అధికారులు తెలిపారు. 'వైట్ కాలర్' ఉగ్రవాద మాడ్యూల్‌కు సంబంధించి అరెస్టు చేసిన ఇద్దరు నిందితులు డాక్టర్ అదీల్ రాథర్, జాసిర్ బిలాల్ వానిలను పోలీసులు, సిఆర్‌పిఎఫ్ సహాయంతో ఎన్ఐఎ అధికారులు తీసుకువచ్చారని వారు తెలిపారు. అనంతనాగ్‌లోని మట్టన్ అటవీ ప్రాంతంలో, కుల్గాం లోని ఖాజిగుండ్ ప్రాంతంలోని వాన్ పోరాలో దాక్కున్న ప్రదేశాల గురించి దర్యాప్తుదారులకు చెప్పిన ఇద్దరు నిందితుల సూచన మేరకు ఈ సోదాలు జరిగాయి.

### రాజ్యసభలో వందేమాతరంపై చర్చ...

# షా, ఖర్గే మధ్య మాటల యుద్ధం

- బుజ్జగింపు రాజకీయాలు కోసం గేయాన్ని విభజించారు : షా
- ఆ తీర్మానాన్ని నెహ్రూ ఒంటరిగా చేయలేదు : ఖర్గే

**న్యూఢిల్లీ :** 'వందేమాతరం' 150వ వార్షికోత్సవాలను పురస్కరించుకుని ఈ గేయంపై సోమ, మంగళవారాల్లో ప్రత్యేక చర్చ జరిగింది. సోమవారం చర్చను లోక్‌సభలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించగా, మంగళవారం రాజ్యసభలో హోంమంత్రి అమిత్‌షా షురూ చేశారు. ఈ నేపథ్యంలో అమిత్ షా, కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నేత నేత మధ్య మాటల యుద్ధం కొనసాగింది. అమిత్ షా మాట్లడుతూ 'వందేమాతరం' గేయాన్ని బుజ్జగింపు రాజకీయాల కోసం విభజించడంతో అది భారతదేశ విభజనకు దారితీసిందన్నారు. జాతీయ గేయం 150 ఏళ్ల చర్చను రానున్న పశ్చిమ బెంగాల్ ఎన్నికలతో అనుసంధానించినందుకు ప్రతిపక్షాలను ఆయన తీవ్రంగా విమర్శించారు. వందేమాతరం భారతదేశ సాంస్కృతిక జాతీయతను మేల్కొల్పిన 'మంత్రం' అని, స్వాతంత్ర్య పోరాట కాలంలో ఉన్నంత సందర్భోచితంగా నేటికీ అది అలాగే ఉందని అన్నారు. దేశాన్ని విక్షిత్ భారత్ వైపు తీసుకెళ్లడంలో ఈ గేయం రానున్న రోజుల్లో కూడా సందర్భోచితంగా ఉంటుందని ఆయన ఉద్ఘాటించారు. వందేమాతరంపై చర్చ అవసరాన్ని ప్రశ్నించినందుకు కాంగ్రెస్‌పై షా విమర్శలు చేశారు. మొదటి ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ గేయాన్ని 'విభజించి' రెండు చరణాలకు పరిమితం చేశారని ఆరోపించారు. లోక్‌సభలో కొంతమంది ఎంపీలు వందేమాతరం గురించి చర్చించాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారని, అయితే చర్చ అవసరమని, ఈ గేయాన్ని స్వాతంత్ర్య ఉద్యమ సమయంలోనే కాకుండా నేటికీ అంతే సందర్భోచితంగా ఉందన్నారు. 2047లో విక్షిత్ భారత్ సాధించినప్పుడు కూడా అంతే సందర్భోచితంగా ఉంటుందని షా ఆశాభావం వ్యక్తం చేశారు. కొంత మంది పశ్చిమ బెంగాల్‌లో ఎన్నికలు వస్తున్నందున వందేమాతరం గురించి చర్చిస్తున్నామని చెబుతున్నారని, బెంగాల్ ఎన్నికలతో అనుసంధానించడం ద్వారా వందేమాతరం ప్రాముఖ్యతను తగ్గించడానికి వారు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. వందేమాతరం సందేశ స్ఫూర్తిని దేశ యువతకు తీసుకెళ్లాలని హోంమంత్రి సభ్యులను కోరారు. ఈ గేయాన్ని బెంగాల్‌లో బంకిం చంద్ర చటోపాధ్యాయ రాశారని, అయితే ఇది దేశవ్యాప్తంగా వ్యాపించిందని, భారతదేశ స్వాతంత్ర్య పోరాటానికి ఒక నినాదంగా మారిందని ఆయన అన్నారు. భారతదేశం 'ఇస్లామిక్ దాడులను సహించిన సంవత్సరాల తర్వాత ఇది రాయబడిందని, బ్రిటిష్ వారు దేశంపై కొత్త సంస్కృతిని రుద్దడానికి ప్రయత్నించారని హోంమంత్రి అన్నారు. వందేమాతరం పాడినందుకు ప్రజలను కొట్టి జైలులో పెట్టినప్పటికీ, అది ప్రజల హృదయాలను తాకిందని, కశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు వ్యాపించిందన్నారు.





'భారతదేశం మాత్రమే సరిహద్దులను ఏ చర్య ద్వారా నిర్ణయించబడని ఏకైక దేశం, దాని సరిహద్దులను మన సంస్కృతి ద్వారా నిర్ణయించారు, సంస్కృతి దానిని ఏకం చేసింది. అందుకే సాంస్కృతిక జాతీయవాదం అనే ఆలోచన, ఈ సాంస్కృతిక జాతీయతను బంకిం చంద్ర చటోపాధ్యాయ మేల్కొలిపింది' అని షా అన్నారు. కాంగ్రెస్ మరియు నెహ్రూ ఈ గేయాన్ని 'విభజించారని' ఆయన ఆరోపించారు. ఈ ఈ క్రమంలో ప్రతిపక్ష సభ్యుల నుండి తీవ్ర అసంతృప్తి వ్యక్తమైంది. అనంతరం కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతదూ నరేంద్ర మోదీతో సహా బిజెపి నాయకులు జవహర్‌లాల్ నెహ్రూను అవమానించారని మండిపడ్డారు. 'వందేమాతరం' మొదటి రెండు చరణాలను మాత్రమే జాతీయ గేయంగా ఉపయోగించాలనే నిర్ణయం మహాత్మా గాంధీ, రవీంద్రనాథ్ ఠాగూర్ వంటి నాయకులందరూ సమిష్టిగా తీసుకున్నారని ఆయన అన్నారు. బంకిమ్ చంద్ర చటోపాధ్యాయ రాసిన పాటను కాంగ్రెస్ విభజించిందని అధికార బిజెపి ఆరోపించడంతో, ఖర్గే అధికార పార్టీని ప్రతిఘటించారు. కాంగ్రెస్ నాయకులు ఎల్లప్పుడూ వందేమాతరం ఆలపిస్తారన్నారు. 'మేము ఎప్పుడూ వందేమాతరం పాడుతున్నాము. కానీ వందేమాతరం పాడని వారు కూడా ఇప్పుడు దానిని పాడటం ప్రారంభించారు. ఇది వందేమాతరానికి ఉన్న శక్తి. ఇది జాతీయ పండుగ, చర్చ కాదు. 1921లో సహాయ నిరాకరణ ఉద్యమం ప్రారంభమైనప్పుడు, కాంగ్రెస్ సభ్యులు వందేమాతరం జపిస్తూ జైలుకు వెళ్తున్నారు... మీరు ఏమి చేస్తున్నారు? మీరు బ్రిటిష్ వారి కోసం పనిచేస్తున్నారు' అని ఖర్గే అధికార బిజెపిపై ధ్వజమెత్తారు. 'మీరు మాకు దేశభక్తిని బోధిస్తున్నారా? మీరు దేశభక్తికి భయపడి బ్రిటిష్ వారికి సేవ చేస్తున్నారు. జవహర్‌లాల్ నెహ్రూను అవమానించడానికి ప్రధాని మోదీ ఎటువంటి అవకాశాన్ని వదిలిపెట్టరు, హోంమంత్రి కూడా... చరణాలను తొలగించినందుకు ప్రధాని నెహ్రూను నిందించడం నేను విన్నాను' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఆ మోదించిన గేయంలోని రెండు చరణాలను మాత్రమే పాడాలనే తీర్మానాన్ని నెహ్రూ ఒంటరిగా చేయలేదని, మహాత్మా గాంధీ, సుభాష్ చంద్రబోస్, మదన్ మోహన్ మాలవ్య, ఆచార్య జె.బి. కృపలానీ వంటి నాయకులు హాజరైనట్లు ఖర్గే అన్నారు. మొదటి రెండు చరణాలను మిగిలిన పాటతో విడదీయడంలో తనకు ఎటువంటి ఇబ్బంది లేదు అని ఠాగూర్ చెప్పారని కాంగ్రెస్ అధ్యక్షుడు ఉటంకించారు.

### 5,371 ఎరువుల సంస్థల

# లైసెన్స్‌లు రద్దు

ఎరువుల శాఖ మంత్రి జగత్ ప్రకాష్



**న్యూఢిల్లీ :** బ్లాక్ మార్కెటింగ్, హోర్డింగ్, నాసిరకం పదార్థాల పంపిణీ చేయడంతో 5,371 ఎరువుల సంస్థల లైసెన్స్‌లను ప్రభుత్వం రద్దు చేసిందని కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి జగత్ ప్రకాష్ నడ్డా మంగళవారం రాజ్యసభలో తెలిపారు. బిజెపి సభ్యుడు కిరణ్ చౌదరి అడిగిన ప్రశ్నకు సమాధానంగా, రాష్ట్రాలకు దుష్ప్రవర్తనలపై చర్యలు తీసుకునే అధికారం ఉన్నప్పటికీ, కేంద్రం 1955 నిత్యావసర వస్తువుల చట్టం, ఎరువుల నియంత్రణ ఉత్తర్వుల కింద మళ్లింపు, హోర్డింగ్, అధిక ధర నిర్ణయించడం వంటి దుష్ప్రవర్తనలను అరికట్టడానికి చర్యలు తీసుకుంటుందని నడ్డా అన్నారు. ఏప్రిల్ 1 నుండి నవంబర్ 28 వరకు, బ్లాక్ మార్కెటింగ్‌లో 5,058 షోకాజ్ నోటీసులు వచ్చాయి, 442 కేసులలో ఎఫ్ఐఆర్‌లు నమోదు అయ్యాయి. 3,732 లైసెన్స్‌లు రద్దు చేయబడ్డాయన్నారు. అదేవిధంగా, హోర్డింగ్‌లో 687 షోకాజ్ నోటీసులు, 202 లైసెన్స్ రద్దులు, 446 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని, నాణ్యత లేని వస్తువులను పంపిణీ చేసిన కేసులో 3,811 సంస్థలకు షోకాజ్ నోటీసులు ఇచ్చామని, 1,437 లైసెన్స్‌లు రద్దు చేశామని, 65 ఎఫ్ఐఆర్‌లు దాఖలు అయినట్లు ఆయన వివరించారు. అక్రమంగా మళ్లింపులో 3,058 షోకాజ్ నోటీసులు, 464 లైసెన్స్ రద్దులు, 96 ఎఫ్ఐఆర్‌లు ఉన్నాయని మంత్రి తెలియజేశారు. కేంద్రం ప్రతి రాష్ట్రానికి ఎరువులను సరఫరా చేసిందని, ఇంటిగ్రేటెడ్ ఫెర్టిలైజర్ మానిటరింగ్ సిస్టమ్ ద్వారా సరఫరాలను రియల్ టైమ్‌లో పర్యవేక్షిస్తుందని మంత్రి చెప్పారు. ఎరువులు దారి మళ్లించబడుతున్నాయని తమకకుతెలిసినప్పటికీ, డీలర్లు నిల్వ చేస్తున్నారని అందరికీ తెలిసిన విషయమేనన్నారు. దీనిని రాష్ట్ర ప్రభుత్వం జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. ఒక రైతు 10 బస్తాలను ఉపయోగించగల సామర్థ్యం కలిగి ఉండవచ్చు కానీ అతను 50 బస్తాలను తీసుకువెళ్తాడని, వీటిని జాగ్రత్తగా చూసుకోవాలని, దానిని నిర్వహించడంలో రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి మద్దతు ఇవ్వాలన్నారు.

## శబరిమల భక్తులు అటువైపు వెళ్లకండి.. అటవీ శాఖ

**తిరువనంతపురం:** అయ్యప్ప స్వామి దర్శనం కోసం శబరిమల వెళ్లే భక్తులకు కేరళ అటవీ శాఖ అధికారులు మంగళవారంనాడు కీలక సూచనలు చేశారు. సన్నిధానానికి సమీపంలోని ఉరుక్కుళి జలపాతాన్ని సందర్శించవద్దని సూచించారు. వన్యప్రాణుల నుంచి ముప్పు పొంచి ఉండటం, తరచు ప్రమాదాలు జరుగుతుండటంతో ఈ సూచనలు చేసింది. ఈ మేరకు సన్నిధానం స్పెషల్ డ్యూటీ రేంజ్ అధికారి అరవింద్ బాలకృష్ణన్ ఒక అడ్వయిజరీ జారీ చేశారు.

# ప్రయాణికుల భద్రతపై రాజీపడం

పౌరవిమానయాన శాఖమంత్రి రామ్మోహన్ నాయుడు



**న్యూఢిల్లీ :** ఎంత పెద్ద విమానయాన సంస్థ అయినా ప్రయాణికులకు అసౌకర్యం కలిగిస్తే సహించేది లేదని పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. ఇండిగో సంక్షోభంపై లోక్‌సభలో మాట్లాడిన ఆయన, దీనికి ఇండిగో బాధ్యత వహించాలని చెప్పారు. సేవలు క్రమంగా సాధారణస్థితికి చేరుతున్నాయని లోక్‌సభకు వెల్లడించారు. రద్దయిన విమానాలకు సంబంధించిన రిఫండ్, లగేజీ విషయాలతో పాటు ఎయిర్‌పోర్టుల్లో రద్దీని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని ఆయన వివరించారు. 'రోస్టరింగ్ అంశంపై ఇండిగోలో సమస్య తలెత్తింది. ఇండిగో సాఫ్ట్‌వేర్ సమస్యపై విచారణకు ఆదేశించాం. ప్రయాణికుల భద్రతపై రాజీపడే ప్రసక్తి లేదు. ప్రయాణికులు ఇబ్బంది పడితే యాజమాన్యాలే బాధ్యత వహించాలి. జవాబుదారీగా వ్యహరించాల్సిన బాధ్యత యాజమాన్యానిదే. ఎంత పెద్ద సంస్థ అయినా, ప్రయాణికులకు ఇబ్బంది కలిగించకూడదు. పైలట్ల కొరత నివారించేందుకు శాస్త్రీయంగా రివైజ్డ్ ఫ్లైట్ టైమ్ లిమిటేషన్ అమలు చేశాం. ప్రయాణికుల భద్రతకు ఈ సంస్కరణలు తప్పనిసరి. వీటిపై రాజీపడే ప్రసక్తే లేదు. ప్రభుత్వం బలమైన, పోటీతత్వ విమానయాన పర్యావరణ వ్యవస్థను నిర్మించాలని నిశ్చయించుకుంది. అంతకుముందు సంబంధిత భాగస్వాములను సంప్రదించిన తర్వాత డిజిసిఎ దశలవారీగా ఆ ప్రణాళికను అమలుచేసింది. ఈ నిబంధనను అమలు చేసేందుకు ఇండిగో సమ్మతి తెలిపింది. శీతాకాల షెడ్యూల్ సన్నద్ధతను నిర్ధారించింది. కానీ అంతర్గత రోస్టరింగ్ అంతరాయాల కారణంగా పెద్దసంఖ్యలో సర్వీసులను రద్దుచేయటం వల్ల వేలాదిమంది ప్రయాణికులు ఇబ్బందిపడ్డారు. పౌర విమానయాన శాఖ సూచన మేరకు డిజిసిఎం దర్యాప్తునకు ఆదేశించింది. ఇండిగో సిఇఒ, సిఒఒలకు షోకాజు నోటీసులు ఇచ్చాం. విమానాల షెడ్యూల్‌ను మార్చాలని, సిబ్బందిని పెంచాలని, ప్రయాణికుల సేవలు మెరుగుపర్చాలని, ఆలస్యం చేయకుండా విమానాల రాకపోకలను సాధారణస్థితి తేవాలని సూచించా' అని స్పష్టం చేశారు.

**దేశవ్యాప్తంగా ఉన్న అన్ని ఎయిర్‌పోర్టుల్లో సాధారణ పరిస్థితులు**

ఇండిగో ఎయిర్‌లైన్స్ సేవలు క్రమంగా సాధారణ స్థితికి చేరుకుంటున్నట్లు పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు లోక్‌సభలో చెప్పారు. 'ఇండిగోలో తలెత్తిన సంక్షోభం వేగంగా సాధారణ పరిస్థితికి చేరుకుంటుంది. డిసెంబర్ 5న కేవలం 706 ఇండిగో విమాన సర్వీసులు నడవగా, సోమవారం దాదాపు 1,800 విమాన సర్వీసులను నడిపింది. ప్రస్తుత ఇండిగో సంక్షోభం క్రమంగా సాధారణ స్థితికి వస్తుంది. దేశవ్యాప్తంగా ఉన్న అన్ని ఎయిర్‌పోర్టుల్లో సాధారణ పరిస్థితులు నెలకొన్నాయి.' అని అన్నారు.

# 8వ రోజూ అంతరాయం

- 422 ఇండిగో విమానాలు రద్దు 'ఇండిగో'
- విమానాల సంస్థలో 5 శాతం తగ్గించిన కేంద్రం

**న్యూఢిల్లీ :** సంక్షోభంలో చిక్కుకున్న ఇండిగో విమానయాన సంస్థలో వరుసగా ఎనిమిదవ రోజు కూడా అంతరాయం కొనసాగింది. దీంతో మంగళవారం ఆరు మెట్రో విమానాశ్రయాల నుండి 422 విమానాలను ఇండిగో రద్దు చేసిందని వర్గాలు తెలిపాయి. రద్దు చేయబడిన 422 విమానాలలో, ఢిల్లీ విమానాశ్రయంలో 152 విమానాలు, బెంగళూరు విమానాశ్రయంలో 121 విమానాలు రద్దు చేసినట్లు వారు తెలిపారు. హైదరాబాద్‌లో 58, ముంబైలో 41 రద్దయినట్లు వర్గాలు పేర్కొన్నాయి. చెన్నై విమానాశ్రయం నుండి కూడా 50కి పైగా విమానాలను ఇండిగో రద్దు చేసిందని వారు గుర్తించారు. అంతకు ముందు ఇండిగో విమానాల సంఖ్యలో 5 శాతం తగ్గిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ప్రకటన చేసింది. ఆమోదించబడిన షెడ్యూల్‌ను ఎయిర్‌లైన్స్ నడపడంలో విఫలమైనందున వాటిని ఇతర విమానాశ్రయాలకు ఇవ్వాలని నిర్ణయించింది. భారతదేశంలోని మొత్తం దేశీయ ట్రాఫిక్‌లో 65 శాతానికి పైగా ఆధీనంలో ఉన్న గురుగ్రామ్ ఆధారిత క్యారియర్ సోమవారం ఆరు మెట్రో విమానాశ్రయాల నుండి మాత్రమే 560కి పైగా విమానాలను రద్దు చేసింది. శీతాకాలపు షెడ్యూల్ 24 (డబ్ల్యుస్24)తో పోలిస్తే ఇండిగో తన నిష్క్రమణలను 9.66 శాతం, వేసవి షెడ్యూల్ 25 (ఎస్ఎస్ 25)తో పోలిస్తే 6.05 శాతం పెంచింది. అయితే, ఈ షెడ్యూల్‌లను సమర్థవంతంగా నిర్వహించే సామర్థ్యాన్ని ఎయిర్‌లైన్ ప్రదర్శించలేదు. అందువల్ల, సెక్టార్లలో షెడ్యూల్‌ను 5 శాతం తగ్గించాలని, ముఖ్యంగా అధిక డిమాండ్ ఉన్న, అధిక ఫ్రీక్వెన్సీ విమానాలపై, ఇండిగో ఒక సెక్టార్‌లో సింగిల్‌ఫ్లైట్ ఆపరేషన్లను నివారించాలని ఆదేశించినట్లు డిజిసిఎ తన ఉత్తర్వులో పేర్కొంది. సవరించిన విమానాల షెడ్యూల్‌ను బుధవారం సాయంత్రం 5 గంటలకల్లా సమర్పించాలని ఇండిగోను ఆదేశించింది. ప్రస్తుతం ఇండిగో ఎయిర్‌లైన్స్ 2వేల 2వందల సర్వీసులను నడుపుతోంది.



**సంక్షోభం ముగిసింది : ఇసిఒ**

మరోవైపు ఇండిగో సంక్షోభం ముగిసిందని, తమ కార్యకలాపాలు అన్నీ ప్రస్తుతం స్థిరంగా కొనసాగుతున్నాయని ఈ సంస్థ సిఇఒ పీటర్ ఎల్బర్స్ మంగళవారం తెలిపారు. ఇండిగో విమాన సర్వీసుల రద్దు వల్ల ఇబ్బందిపడిన ప్రయాణికులు అందరికీ ఆయన మరోసారి క్షమాపణలు చెప్పారు. కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నట్లు తెలిపారు. 'విమాన ప్రయాణానికి ఉన్న గొప్పదనం ఏమిటంటే, అది ప్రజలను, వారి భావోద్వేగాలను, ఆశయాలను, ఆకాంక్షలను గమ్యస్థానాలకు చేర్చుతుంది. మా కస్టమర్లు ఇలా అనేక కారణాలతో ప్రయాణానికి సిద్ధమయ్యారు. కానీ ఫ్లైట్ల రద్దుతో వారు గమ్యస్థానాలకు వెళ్లలేక, రాలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అందుకు మేము చింతిస్తున్నాం. క్షమాపణలు చెబుతున్నాం. ఇప్పుడు మా మొదటి ప్రాధాన్యత ఏమిటంటే, ఫ్లైట్లు లేక చిక్కుకుపోయిన ప్రయాణికులను సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేర్చడమే. ఇందుకోసం మా ఇండిగో బృందం మొత్తం కష్టపడుతోంది' అని ఇండిగో సిఇఒ పీటర్ ఎల్బర్స్ అన్నారు. కాగా, ఇండిగో విమానాల రద్దు వల్ల చాలా మంది టికెట్లు క్యాన్సిల్ అయ్యాయని, వారందరికీ ఇప్పటికే పూర్తిగా రీఫండ్ చేసినట్లు పీటర్ ఎల్బర్స్ తెలిపారు. అంతేకాదు వారి బ్యాగేజీని (సామగ్రి) తిరిగి అప్పగించేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే చాలా బ్యాగులు కస్టమర్ల ఇంటికి పంపించామని, మిగిలిన బ్యాగులను అతి త్వరలో డెలివరీ చేయడానికి తమ బృందం కృషి చేస్తోందన్నారు.

### కేంద్రానికి మాత్రమే

టివికె చీఫ్ విజయ్

# తమిళనాడు, పుదుచ్చేరి వేర్వేరు



**న్యూఢిల్లీ :** కేంద్ర ప్రభుత్వానికి మాత్రమే తమిళనాడు, పుదుచ్చేరి వేర్వేరు అని, తాము మాత్రం అందరం కలిసే ఉన్నామని నటుడు, టీవీకే చీఫ్ విజయ్ అన్నారు. పుదుచ్చేరిలోని ఉప్పాలంలో నిర్వహించిన ఎన్నికల ర్యాలీలో ఆయన ప్రసంగించారు. కరూర్ తొక్కిసలాట అనంతరం జరిగిన ఈ తొలి బహిరంగసభలో ఆయన.. తమిళనాడులోని డిఎంకె సర్కారుపై తీవ్ర విమర్శలు చేశారు. పుదుచ్చేరికి మద్దతు ఇవ్వడం తన బాధ్యత అని విజయ్ పేర్కొన్నారు. సిఎం రంగసామి నేతృత్వంలోని అక్కడి ప్రభుత్వం డిఎంకె ప్రభుత్వం వంటిది కాదని, ప్రతిపక్ష పార్టీలతోనూ నిష్పక్షపాతంగా వ్యవహరిస్తున్నదని మెచ్చుకున్నారు. మాకు ప్రత్యర్థి అయినా మా పార్టీ నిర్వహిస్తున్న ర్యాలీకి అడగగానే భద్రత రంగస్వామి ప్రభుత్వం కల్పించిందని తెలిపారు. తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ రాష్ట్ర పాలనకు సంబంధించిన విషయాలను పుదుచ్చేరి ప్రభుత్వం నుంచి నేర్చుకోవాలని సూచించారు. కానీ ఆయన (స్టాలిన్) ఎప్పటికీ నేర్చుకోరని విజయ్ వ్యాఖ్యానించారు. వచ్చే ఏడాది జరగనున్న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో డిఎంకెకు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. మాజీ సిఎం, దివంగత ఎంజీ రామచంద్రన్‌కు పుదుచ్చేరితో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేస్తూ.. పుదుచ్చేరికి పూర్తి రాష్ట్ర హోదా ఇవ్వాలని పునరుద్ఘాటించారు. తమకు రాష్ట్ర హోదా కల్పించాలని కోరుతూ పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నో సంవత్సరాల నుంచి 16 తీర్మానాలను ప్రవేశపెట్టినా కేంద్రం పట్టించుకోవట్లేదని విమర్శించారు.

# మణిపూర్‌లో నలుగురు ఉగ్రవాదులు అరెస్టు

**ఇంఫాల్ :** మణిపూర్‌లోని ఇంఫాల్ వెస్ట్ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి నలుగురు ఉగ్రవాదులను అరెస్టు చేసినట్లు పోలీసులు మంగళవారం తెలిపారు. సోమవారం అరెస్టులు జరిగాయని, వారందరూ దోపిడీకి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నారని పోలీసులు మంగళవారం తెలిపారు. యుఎన్ఎల్ఎఫ్ (పాంబే)కి చెందిన ఇద్దరు కార్యకర్తలను అవాంగ్ వాబాగై నుండి అరెస్టు చేశారు. వారిని నింగ్‌థౌజామ్ నోంగ్‌పోక్న్‌గంబా మెయిటే (31), కొంథౌజామ్ నెల్సన్ సింగ్ (23)గా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. యుఎన్ఎల్ఎఫ్ (పాంబే) 2023లో కేంద్రంతో శాంతి ఒప్పందంపై సంతకం చేసింది, కానీ ఆ సంస్థ సభ్యులు దోపిడీ, ఇతర నేరాలకు పాల్పడుతూనే ఉన్నారని వారు తెలిపారు. ఎస్ఒఆర్ఇపిఎకి చెందిన ఇద్దరు సభ్యులను కూడా అరెస్టు చేశారు. నింగ్థెంకోల్ నుండి చుంగ్‌ఖామ్ నానావో మచా అలియాస్ మిత్లాంగ్ (24) ను అరెస్టు చేయగా, చంగంగీ నుండి అరంభం తోయితోయ్ సింగ్ (41)ను అరెస్టు చేశారు. వారి వద్ద నుండి లెక్కల్లో చూపని రూ. 3.90 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. సోమవారం జిల్లాలోని నైరాంగ్‌బామ్ మాయై లంబి లౌకాన్ నుండి ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. రెండు సింగిల్‌బారెల్డ్ తుపాకులు, ఒక స్టన్ గ్రెనేడ ఒక స్మోక్ గ్రెనేడ డిటోనేటర్ లేని ఒక 36–హెచ్ఇ గ్రెనేడ్ 54 మందుగుండు సామగ్రి, రెండు రేడియో సెట్‌లు స్వాధీనం చేసుకున్న వస్తువులలో ఉన్నాయి.



### లూథ్రా బ్రదర్స్ కోసం వేట..

# ఇంటర్‌పోల్ బ్లూకార్నర్ నోటీసు



**పనజి:** గోవా నైట్‌క్లబ్‌లో శనివారం రాత్రి భారీ అగ్ని ప్రమాదం జరిగి 25 మంది ప్రాణాలు కోల్పోయిన గంటల్లోనే ఇండియా విడిచి పారిపోయిన లూథ్రా బ్రదర్స్ కోసం గాలింపు మొదలైంది. 'బిర్చ్ బై రోమియా లేన్' యజమానులైన గౌరవ్ లూథ్రా, సౌరబ్ లూథ్రాలపై ఇంటర్‌పోల్ తాజాగా బ్లూకార్నర్ నోటీసులు జారీ చేసింది. పరారీలో ఉన్న సోదరుల జాడను తెలుసుకునేందుకు గోవా పోలీసులు ఇంటర్‌పోల్ సాయం కోరడంతో ఈ నోటీసులు జారీ అయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం, శనివారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో ఐదుగురు టూరిస్టులతో సహా పలువురు అగ్నిప్రమాదంలో మరణించిన కొద్ది గంటలకే లూథ్రా సోదరులు పరారయ్యారు. డిసెంబర్ 7వ తేదీ తెల్లవారుజామున 5.30 గంటలకు పుకెట్ (థాయిలాండ వెళ్లే ఇండిగో ఎయిర్‌లైన్స్ విమానం ఎక్కినట్టు చెబుతున్నారు. కాగా, విచారణలో భాగంగా పోలీసులు లూథ్రా సోదరుల కోసం లూకౌట్ నోటీసులు జారీ చేశారు. ఢిల్లీలోని జిటిబి నగర్ నివాసానికి ఒక టీమ్ వెళ్లింది. అయితే ఆ ఇంటికి తాళం వేసి ఉంది. దీంతో లూథ్రా సోదరుల సన్నిహితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. లూథ్రా బ్రదర్స్‌కు సన్నిహితుడు, మూడో పార్ట్‌నర్‌గా ఉన్న అజయ్ గుప్తా కోసం గాలిస్తున్నారు. ప్రస్తుతం అతని ఆచూకీ కూడా తెలియలేదు. కాగా, మేనేజిమెంట్ టీమ్‌లో కీలకమైన ఆపరేషనల్ స్టాఫ్ మెంబర్ భరత్ కోహ్లిని పోలీసులు అరెస్టు చేశారు. క్లబ్ చీఫ్ జనరల్ మేనేజర్ రాజీవ్ మోదక్, జనరల్ మేనేజర్ వివేక్ సింగ్, బార్ మేనేజర్ రాజీవ్ సంఘానియా, గేట్ మేనేజర్ రియాన్ష్ ఠాకూర్‌లను కూడా అరెస్టు చేశారు. మంగళవారం ఉదయం గోవా పోలీసులు ఢిల్లీలోని లూథ్రా బ్రదర్స్ నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను ప్రశ్నించారు.

# ఓటర్లలో భయాన్ని కలిగించేందుకే సర్ ప్రక్రియ

పశ్చిమ బెంగాల్ సిఎం మమతా బెనర్జీ



**కూచ్‌బెహర్ :** పశ్చిమ బెంగాల్‌లో ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (సర్) కొనసాగుతోంది. అయితే ఈ ప్రక్రియ పూర్తి తరువాత ఫిబ్రవరిలో తుది ఓటరు జాబితా ప్రచురించిన వెంటనే రాష్ట్రంలో ఎన్నికల షెడ్యూల్ ప్రకటిస్తారని, జాబితాపై చట్టసవరణ సవాళ్లను నివారించడానికి దీనిని ఉపయోగించుకుంటున్నారని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పేర్కొన్నారు. మంగళవారం కూచ్ బెహర్‌లోని రాస్ మేళా మైదానంలో జరిగిన బహిరంగ సభలో ఆమె పాల్గొని ప్రసంగించారు. ఓటర్లలో భయాన్ని కలిగించడానికి సర్ ప్రక్రియను ఉపయోగిస్తున్నారని ఆరోపించారు. 100 రోజుల పని పథకం కింద నిధులను నిలిపివేసినట్లు ఆరోపణలు రావడంతో ఆమె కేంద్రంపై మండిపడ్డారు. చెల్లింపులను తిరిగి ప్రారంభించడానికి కేంద్ర ప్రభుత్వం విధించిన అవమానకరమైన పరిస్థితులుగా ఆమె పేర్కొన్న నోట్‌ను వేదికపై చింపేశారు. ఫిబ్రవరిలో సర్‌తుది జాబితాలు విడుదలైన వెంటనే ఎన్నికలను ప్రకటిసారని, తద్వారా ఎవరూ చట్టబద్ధంగా జాబితాపై సవాలు చేసే అవకాశం ఉండదని, ఆ జాబితా ఆధారంగా ఎన్నికలు జరిగేలా జరుగుతాయని బెనర్జీ పేర్కొన్నారు. ఎన్నికల సంఘం నవంబరు 4న సర్‌ను అమలు చేయడం వల్ల ప్రజల్లో 'విస్తృత భయాన్ని' సృష్టించారని, ఓటర్ల జాబితా నుండి తమ పేర్లు ఏకపక్షంగా తొలగిపోతాయని వారు భయపడుతున్నారని ముఖ్యమంత్రి ఆరోపించారు. ఇప్పుడు మనం మన పౌరసత్వాన్ని నిరూపించుకోవాలా? దీనికంటే పెద్ద అవమానం ఏముంటుంది? తరతరాలుగా ఇక్కడ నివసిస్తున్న ప్రజలను తాము ఎవరో నిరూపించుకోవాలని అడుగుతున్నారని మండిపడ్డారు. బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వం 'అరాచక, నిరంకుశ' పాలనను నడుపుతోందని, కాషాయ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వస్తే 'బెంగాల్ సంస్కృతి, భాష, వారసత్వాన్ని నాశనం చేస్తుందని బెనర్జీ ఆరోపించారు. తన ప్రభుత్వం సర్‌ను ప్రక్రియను అడ్డుకుని ఉంటే, కేంద్రంలోని బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వం పశ్చిమ బెంగాల్‌లో రాష్ట్రపతి పాలన విధించి ఉండేదన్నారు. వారు అవకాశం కోసం ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు. కలకత్తా హైకోర్టు, సుప్రీంకోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ, ఒక సంవత్సరం గడిచినా కేంద్రం బకాయిలను విడుదల చేయలేదని, బదులుగా పని పథకం అమలుపై అనేక షరతులు విధిస్తూ ఒక లేఖ పంపిందని బెనర్జీ అన్నారు. తాము ఈ షరతులను అంగీకరించమి తేల్చి చెప్పారు. బెంగాల్ 100 రోజుల పని పథకాన్ని స్వయంగా నిర్వహిస్తుందని, ప్రకటిస్తూ వేదిక నుండి నోట్‌ను ముక్కలుగా చింపివేశారు. గ్రామీణ ఉపాధి పథకం కింద నిధులు నాలుగు సంవత్సరాలుగా నిలిపివేయబడ్డాయని పేర్కొం టూ, గ్రామీణ గృహనిర్మాణం, గ్రామ రహదారి ప్రాజెక్టులు వంటి ఇతర సంక్షేమ కార్యక్రమాలను కూడా కేంద్రం నిలిపివేసిందని బెనర్జీ ఆరోపించారు. 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు తన ప్రభుత్వం రాష్ట్ర ఖజానా నుండి పని అందించడం ద్వారా 'కర్మశ్రీ' అనే ప్రత్యామ్నాయ పథకాన్ని ప్రారంభించిందని, ఈ కార్యక్రమం విజయవంతమైందని ఆమె చెప్పారు. తాము ఎవరి భిక్షనూ కోరుకోవడం లేదని, బెంగాల్ తన సొంత కాళ్ళపై ఎలా నిలబడాలో తెలుసని సిఎం ఉద్ఘాటించారు. కేంద్రం పంపిన నోట్‌ను చదివిన బెనర్జీ కార్మిక శాఖ త్రైమాసిక కార్మిక బడ్జెట్‌లను సమర్పించాల్సిన ఒక షరతును ఉదహరించారు. ఫిబ్రవరిలో ఎన్నికలు ప్రకటిస్తారని, ఇవన్నీ ఎప్పుడు చూపిస్తామని ప్రశ్నించారు.


సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్

"విద్యుత్ అదా చేయడం అంటే విద్యుత్‌ను ఉత్పత్తి చేయడమే"

టెండరు ప్రకటన నెం. 13/25-26

నాణ్యతా ప్రమాణాలతో కూడిన సామాగ్రిని ఉపయోగించి పనులు పూర్తిచేయడంకోసం అర్హులైన కాంట్రాక్టర్ల నుండి సీల్డు టెండర్లకు ఆహ్వానించడమైనది. (ఎ) నాణ్యతా ప్రమాణాలతో స్పెక్.టి-114 (ఎస్‌సి రిజర్వ్‌డ్): ఎస్ఎస్ ఎస్ఎస్, (బి)స్పెక్.టి.-115: మేలారం పెటర్డోర్ 33/1 కెవి వద్ద పిటిఆర్-ఎల్ఎటి పెంపుచేయడం, ఎస్ఎస్, (సి) స్పెక్‌టి-116: కు పిటిఆర్-IIను కందికల్ గేట్ పెటర్డోర్ 33/11/ కెవి వద్ద ఎల్ఎటిని పెంపు చేయడం, ఎస్ఎస్, (డి) స్పెక్.టి-117 శ్రీకృష్ణా నగర్ 33/11/ కెవి వద్ద పిటిఆర్-ఎల్ఎటి పెంపుచేయడం, ఎస్ఎస్, (ఇ) స్పెక్.టి-118కు ఐబిటి మల్లేపల్లి 33/11/కెవి వద్ద పిటిఆర్-II పెంపుచేయడం, ఎస్ఎస్, (ఎఫ్) స్పెక్.టి-119: కె.వి.సంతోష్ నగర్ 33/11/ కెవి వద్ద పిటిఆర్-I పెంపుచేయడం,ఎస్ఎస్(జి) స్పెక్.120 (ఎస్‌టి రిజర్వుడు): అలియాబాద్ 33/11 వద్ద పిటిఆర్-I పెంపుచేయడం, గూడ ఎస్‌డి లైన్స్‌లో ఎఫ్‌డిఆర్ చిలకలగూడ-ఇండస్ట్రియల్ ఏరియా 33 కెవిపై రామ్‌నగర్ వైఎస్ఆర్ పార్కు సమీపంలో 39 మరియు 41 సంఖ్యాల ప్రాంతంలో బి/డబ్ల్యులో ఎస్‌సిఓహెచ్ 33కెవి లైన్ నుండి 33 కెవి యూజి కేబుల్ వరకూ రెండు స్పాన్స్ మార్చిడి. (హెచ్) స్పెక్.టి-121 (ఎస్‌సిలకు రిజర్వుచేయబడినది): ఎస్‌డి, ఆర్ఆర్-II మేడ్చెల్ సర్కిల్‌లో ఎస్ఎస్ ఎస్ 33/11 కెవిలో వివిధ కొత్త బ్రేకర్‌లో 28 నెంబర్లు ఎస్‌సిఎడిఏ సమీకృతం చేయాలి. (ఐ) స్పెక్.టి-122 (ఇ-సేకరణ) (జి): ఆర్ఆర్-II రాజేంద్రనగర్ సర్కిల్ మరియు సైబర్ సిటీలో ఎస్ఎస్ఎస్ 33/11 కెవిలో వివిధ బ్రేకర్‌లో కొత్తగా 69 నెంబర్లు ఎస్‌సిఎడిఎ సమీకృతం చేయాలి. (జె) స్పెక్.టి-123 (ఇ-సేకరణ) (జి): ఎస్‌డి ఎస్‌సిఎడిఎ ఉత్తర హైదరాబాద్ ఎస్ఎస్ఎస్ వివిధ 33/11/కెవిలో కొత్త 55 నెంబర్లు సమీకృతం చేయాలి. (ఇతర వివరాలకు దయచేసి మా వెబ్‌సైటు https://tgsouthernpower.org) చూడగలరు. ఫోన్:040-23431333/1112/1125).

సం/- సూపరింటెండింగ్ ఇంజనీరు/ఎస్‌సిఏడిఏ

DIPR R.O. No. : 11836-PP/CL/ADVT/1/2025-26, Date: 09-12-2025

ప్రజాపక్షం
బుధవారం, 10 డిసెంబరు

# విమానయానంలో కల్లోలం

దేశంలో అంతర్గత విమాన ప్రయాణాల్లో గతవారం ఆకస్మికంగా సంభవించిన కల్లోలం లక్షలాది ప్రయాణీకులను కనీసం వారంరోజులపాటు తీవ్రమైన ఇబ్బందులకు, ఆవేదనకు గురిచేసింది. ఈ మంగళవారానికి పరిస్థితి చాలావరకు కుదుటపడినా పూర్తిగా సాధారణ పరిస్థితుల పునరుద్ధరణకు కనీసం మరో పక్షం రోజులు పట్టవచ్చు. ఒక్క ఇండిగో విమానయాన సంస్థ కాడికింద పడేస్తే ఇంత అల్లకల్లోలం సంభవించటానికి కారణం దాని గుత్తాధిపత్యం. ప్రభుత్వ రంగాన్ని రద్దుచేసి సురక్షిత ప్రయాణానికి గ్యారంటీగా ప్రైవేటు ఎయిర్‌లైన్స్‌కు లైసెన్సులు ఇవ్వటం మొదలుపెట్టాక దాదాపు 10 ప్రైవేటు సంస్థలు దేశీయ విమాన సర్వీసుల నిర్వహణ రంగంలో ప్రవేశించాయి. ప్రతిష్టాత్మకమైన ఎయిర్‌ఇండియా, ఇండియన్ ఎయిర్‌లైన్స్ టాటాల చేతికి వెళ్లింది. రెండోవైపున, దేశంలో విమాన ప్రయాణం అనేకరెట్లు పెరిగింది. దీన్ని అవకాశంగా తీసుకున్న ప్రైవేటు ఎయిర్‌లైన్స్ లాభాపేక్షే ప్రధానంగా విమానాల సంఖ్యను, రూట్లను పెంచారుగాని అందుకు తగినట్లుగా పైలెట్లు, ఇతర సిబ్బందిని పెంపుచేయలేదు. పైలెట్లపై పని గంటల భారం పెరిగింది, విశ్రాంతి తగ్గిపోయింది. ఇది విమాన ప్రయాణ భద్రతకు ప్రమాదకరం. పైలెట్లు పనిగంటల పాటింపు, విశ్రాంతి కోసం ఆందోళన చేశారు. ఎట్టకేలకు మేల్కొన్న కేంద్రప్రభుత్వం, దాని డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డిజిసిఎ) కొత్త ఫ్లయిట్ క్రూ రోస్టరింగ్ రూల్స్ పాటించాలని ఆదేశించింది. పైలెట్లకు విశ్రాంతి గంటలు, వారి రాత్రి డ్యూటీ సమయంపై పరిమితులు పాటించేందుకు తమకు సమయం కావాలని ఇండిగో యాజమాన్యం కోరింది. ఇచ్చిన కాలవ్యవధిలో పైలెట్లను రిక్రూట్ చేసుకోకుండా తమపై ఒత్తిడి తెచ్చే వైఖరిని డిజిసిఎ అనుమతించలేదు. అంతే, ఇండిగో యాజమాన్యం చెప్పాపెట్టకుండా ఆకస్మికంగా విమాన సర్వీసులు నిలుపుచేసింది. దేశీయ విమాన ప్రయాణీకుల్లో 60–70 శాతాన్ని క్యారీచేసే విమానాలు నిలిచిపోతే సంభవించగల కల్లోలాన్ని టివిలద్వారా కళ్లారా చూశాం. నిలిచిపోయిన లక్షలాదిమంది అప్పటికప్పుడు విమానాశ్రయాలకు వచ్చినవారు కాదు. 15రోజులు, నెల–రెండు నెలల ముందు అడ్వాన్సుబుకింగ్ చేసుకున్నవారు. అత్యవసర పనులమీద, ఇంటర్వ్యూలకు, వివాహాలకు హాజరయ్యేందుకు, తమ కుటుంబాలను చేరుకునేందుకు ప్రయాణమై విమానాశ్రయాలకు చేరినవారు. వారికి ముందస్తు సమాచారం ఇవ్వకపోవటం, విమానం బయలుదేరే సమయానికి కొద్దిగా ముందుగా సర్వీసు రద్దు ప్రకటించటం, మళ్లీ ఫ్లయిట్ ఉంటుందో లేదో చెప్పే దిక్కు లేకపోవ టం, లగేజి తీసుకుని బోర్డింగ్ పాస్ ఇచ్చాక రద్దు సమాచారం ఇవ్వటం ఇండిగో సంస్థ బాధ్యతారాహిత్యం. ఇది ప్రయాణీకులను నరకయాతనకు గురిచేసింది. లగేజీ బ్యాగులతో నిండిపోయిన విమానాశ్రయ దృశ్యాలు, పిల్లాపాపలతో, వృద్ధులతో, నేలమీదే రోజుల తరబడి పరుండటం, సరైన ఆహారం, వసతి చూపని విమానయాన సంస్థ నిర్లక్ష్యం హృదయవిదారక దృశ్యాలను కళ్లకు కట్టాయి.

ఇందుకు ఎవరిది బాధ్యత: ఇండిగో ఎయిర్‌లైన్స్‌ది, కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖది. ఇండిగో అనేక సంవత్సరాలుగా మార్కెట్‌ను, ప్రభుత్వాన్ని, డిజిసిఎను తమ చెప్పుచేతల్లో పెట్టుకుని ఆపరేషన్స్‌పై దాదాపు గుత్తాధిపత్యం సంపాదించిందనే ఆరోపణలున్నాయి. తక్కువ చార్జీలు, ఎక్కువ విమానాలతో ప్రత్యర్థులను నష్టాల పాల్జేసింది. స్పైస్ జెట్, జెట్ ఎయిర్‌వేస్‌లాంటివి తలవంచక తప్పలేదు. ఆ విధంగా హై మార్కెట్ రూట్లలో దాదాపు గుత్తాధిపత్యం సంపాదించింది. ఇదంతా ప్రభుత్వం కనుసన్నల్లోనే జరిగింది. రెగ్యులేటర్ డిజిసిఎ కళ్లప్పగించి చూస్తూ ఉండిపోయింది. అంటే ఉన్నతాధికారవర్గం ఇండిగో ప్రలోభాలకు గురై ఉండవచ్చు, పౌర విమానయానశాఖ చారిత్రకంగానే అవినీతికి ప్రసిద్ధి చెందిన ప్రభుత్వ విభాగం. పైలెట్ల నుంచి, ప్రయాణ భద్రత విషయంలో ఒత్తిడి పెరిగాక అది నవంబర్ నుంచి కొత్త ఎఫ్‌డిటిఎల్ రూల్సు అమలులోకి తెచ్చింది. ఇండిగో ఉల్లంఘించింది. ఒక్కసారి వెయ్యికిపైగా సర్వీసులు రద్దు చేసి ఒకరకంగా బ్లాక్ మెయిల్‌కు పాల్పడింది. డిజిసిఎ వెనువెంటనే 10 ఫిబ్రవరి 2026 వరకు తాత్కాలిక ఉపశమనలు ప్రకటించింది. ఇతర డొమెస్టిక్ ఎయిర్‌లైన్స్ డిజిసిఎ రూల్సు పాటిస్తున్నాయి.

ఇండిగో సృష్టించిన కల్లోలంతో గంగవెర్రులెత్తిన ప్రభుత్వం ఆదరాబాదరా కొన్ని ఆదేశాలు జారీ చేసింది. ఆ ప్రకారం ఇండిగో రూ.810కోట్లు ప్రయాణీకులకు రిఫండ్ చేసింది. ప్రభుత్వం దర్యాప్తు సంఘాన్ని నియమించింది. తప్పు చేసిన బాధ్యులకు శిక్షలు తప్పవంటోంది. పార్లమెంటులో ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని నిలదీశాయి. ప్రైవేటు సంస్థల గుత్తాధిపత్యాన్ని బద్దలు కొట్టగల ధైర్యం ఉంటేనే ఇటువంటి బ్లాక్ మెయిల్ పరిస్థితుల పునరావృతాన్ని అరికట్టటం సాధ్యం.

# మోదీ పాలనలో శ్రమకు విలువ, కార్మికునికి రక్షణ లేదు



వియస్.బోస్
ఎఐటియుసి మాజీ ప్రధాన కార్యదర్శి
9391356527

భారతదేశంలో మోదీ అహంకారపూరితమైన నియంతృత్వ పాలన కొనసాగిస్తున్నాడు. దానిలో భాగమే 29 కార్మిక చట్టాలను కుదించి 4 కోడ్‌లుగా మార్చి కార్మికులకు అన్యాయం, కార్పొరేట్ శక్తులకు కావాల్సిన లాభం చేకూర్చుతున్నాడు. చట్టాల పేరు తీసివేసి కోడ్‌లని పేరు పెట్టాడంటేనే అసలు మోదీ నీతి బయటపడుతుంది. చట్టమంటే అగ్రిమెంట్. కోడ్ అంటే కోరలు లేనిది. అగ్రిమెంట్ స్థానంలో ఉన్న 29 చట్టాలను మార్చి 4 కోడ్‌లుగా తెచ్చాడంటే కేంద్ర ప్రభుత్వం అసలురంగు బయటపడుతున్నది. ప్రతి కార్మిక చట్టం వెనుక అనేక పోరాటాలు, త్యాగాలు, కమీషన్లు కమిటీలు సంబంధిత వర్గాలతో చర్చోపచర్చలు జరిపి అంతిమంగా చేసిన నిర్ణయాలను తరువాత చట్టాల రూపం దాల్చటం జరిగింది. ఇప్పుడు ఎలాంటి సంప్రదింపులు లేకుండా ప్రధానిమోదీ అంత:పురంలో పారిశ్రామిక వేత్తలు చెప్పింది కోడ్‌ల రూపంలో తీసుకొచ్చి కార్మిక హక్కులను హరించటం జరుగుతున్నది. కార్మిక సంబంధాల విషయం ఉమ్మడి జాబితాలో ఉంటే అనేక రాష్ట్రాలు వ్యతిరేకించినప్పటికీ కేంద్ర ప్రభుత్వం నియంతృత్వంతో 4 కోడ్‌లను బలవంతంగా రుద్దటం జరిగింది. దీనిమూలంగా రాజ్యాంగబద్ధమైన కార్మిక హక్కులు అదే సందర్భంలో రాష్ట్రాల హక్కులను కేంద్రప్రభుత్వం హరించి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసింది.

ఏదైన ఉత్పత్తి జరగాలంటే అది కర్మాగారంలో జరుగుతుంది. పెట్టుబడి ఉన్నా కార్మికులు లేకుండా ఉత్పత్తి జరగదని చరిత్ర చెప్పిన సత్యం. అలాంటి సత్యాన్ని గతంలో బుద్ధుడు, వివేకనందుడు, మహాత్మాగాంధీ లాంటి ప్రముఖులు కూడా చెప్పటం జరిగింది. మోదీ మాత్రం కార్మికులు లేకుండానే పెట్టుబడి ఉంటే ఉత్పత్తి జరుగుతుందని వాస్తవ విరుద్ధంగా చెపుతూ దోపిడీదారుల పక్షాన ప్రచారం చేస్తున్నాడు. మోదీ చెప్పిందే నిజమైతే తొలినాటి నుండి ఉత్పత్తి కేంద్రాలను కర్మాగారాలుగా ఎందుకు నామకరణం చేశారు. పెట్టుబడి ఆరాలుగా ఎందుకు అనలేదు. ప్రజలంతా వారు వారి తల్లిదండ్రులకు పుట్టామని ప్రకటించుకుంటుంటే మోదీ మాత్రం తాను ప్రత్యక్షంగా దేవదూతగా వచ్చానని చెప్పటం ఎంతనిజమో, ఉత్పత్తిపై మోదీ చేస్తున్న ప్రచారం కూడా అంతే నిజమని తెలియజేస్తున్నాము.

బ్రిటీష్ వారి దోపిడీపాలనలో వచ్చిన పాత కార్మిక చట్టాలను బూజుదులిపి కొత్త చట్టాలు ప్రవేశపెడుతానని విషప్రచారం చేసిన మోదీ కార్మికుల దుమ్ముదులిపి కార్పొరేట్ సంస్థలకు కనకవర్షం కురిసే విధంగా 4 కోడ్‌లు తీసుకొచ్చాడు. 1926 బ్రిటీష్ కాలంలో తెచ్చిన చట్టంలో యూనియన్ పెట్టుకోవటానికి 7గురు సభ్యులు సరిపోతారని ఉంటే కొత్త కోడ్‌లలో 10శాతం లేక 100 మంది సభ్యుల సమ్మతితోనే యూనియన్ పెట్టుకోవాలని చెప్పటం దేనికి నిదర్శనమో విజ్ఞులు ఆలోచించాలి. కార్మిక సంఘంలో ఒక వ్యక్తి సంస్థలోని కార్మికుల ఆమోదంతో ఎన్నిసార్లయినా ఆఫీసు బేరర్‌గా ఉండవచ్చునని ఉంటే కొత్త కోడ్‌లలో ఒక వ్యక్తి కార్మికుల ఆమోదం ఉన్నప్పటికీ 2 సార్లు కన్నా ఎక్కువసార్లు ఉండకూడదని చెప్పబడింది. అలాగే యూనియన్ ఆఫీసు బేరర్స్‌లో 25శాతం బయటవారు ఉండవచ్చునని గత చట్టంలో ఉంటే ప్రస్తుతం కోడ్‌లలో దానిని రద్దు చేశారు. దీని మూలంగా కార్మికులు అనుభవం కల్గిన కార్మిక నాయకులను పొందే అవకాశం లేకుండా చేసి కార్మికులకు మోదీ ద్రోహం చేశాడు. అలాగే 1936లో వేతనాలపై సంప్రదింపుల హక్కులతో కూడిన చట్టం బ్రిటీష్ కాలంలో సాధించుకుంటే ప్రస్తుతం కోడ్‌లలో మోదీ దాన్ని మింగేశాడు. వేతనాల కోసం సమ్మెలు చేయకూడదు, వేతనాల పై డిమాండ్ చేయరాదు, కష్టాలు చెప్పుకోవటానికి ప్రస్తుతం ఉన్న లేబర్ కమీషన్ వ్యవస్థను మోదీ రద్దుచేసి సంఘాలకు ఉన్న హక్కులను తొలగించాడు. కార్మికునికి కర్మాగారంలో ప్రమాదాలు జరిగినప్పుడు నష్టపరిహారం చెల్లించే చట్టాన్ని బ్రిటీష్ కాలంలో 1923లోనే సాధించుకోవటం జరిగింది. కానీ నేటి కోడ్‌లలో నష్టపరిహారం కోసం ప్రమాదాన్ని పరిశీలించి సిఫార్సు చేసే ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ వ్యవస్థను రద్దు చేయటం ఎవరికి లాభం చేయటానికో సులువుగానే అర్థమవుతుంది.

కాంట్రాక్టు కార్మికులను శాశ్వత తరహా ఉద్యోగాల్లో నియమించరాదని చట్టంలో ఉంటే మోదీ ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లాయ్‌మెంట్ అనే కొత్త తరహా విధానం ప్రవేశపెట్టి యాజమాన్యాల దోపిడీకి మరింత బలం చేకూర్చాడు. గతంలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, క్యాజువల్ విధానాలకు ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లాయ్‌మెంట్ అదనంగా చేర్చి పారిశ్రామిక వేత్తల అదనపు దోపిడీకి మోదీ సహకరించాడు. 1970లో ఆనాటి ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టంలో సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని ఉన్నప్పటికీ 2014 నుండి దాని అమలుకు మోదీ ప్రభుత్వం ఎలాంటి ప్రయత్నం చేయలేదు. 2016లో సుప్రీంకోర్టు దీనిపై అనుకూలమైన తీర్పుతో సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని చెప్పినప్పటికీ మోదీ ప్రభుత్వం మొండిగా ప్రవర్తించి ఆ తీర్పును అమలు చేయలేదు. అలాంటి మోదీ తాను తెచ్చిన కోడ్‌ల మూలంగా కార్మికులకు సంక్షేమం మరియు లాభం జరుగుతుందని తన కార్పొరేట్ శిష్యులతో ప్రచారం చేయించటం మరింత ద్రోహం. కార్మికులు తాత్కాలికంగా కాకుండా పర్మినెంట్ ఉద్యోగాల్లో ఉంటే కార్మికుడు పనిదొంగగా మారుతాడని దోపిడీదారులు చేస్తున్న ప్రచారానికి మోదీ కూడా వంతపాడుతున్నాడు. మేడే స్ఫూర్తితో రక్తతర్పణతో కార్మికులు 8గంటల పనిదినాన్ని సాధించుకుంటే మోదీ 10 గంటలు లేక 12 గంటలు రోజుకు పనిచేయించుకోవచ్చు అని కోడ్‌ల ద్వారా దోపిడీదారులకు వజ్రాయుధాన్ని అందించాడు.

ప్రస్తుతం ఉన్న ఫ్యాక్టరీ యాక్ట్ ద్వారా కర్మాగారంలో కార్మికునికి కల్పించవల్సిన మౌలిక సౌకర్యాలైన నీరు, వెలుతురు, మరుగుదొడ్లు, భద్రతా సౌకర్యాలు లాంటి వాటిని పరిశీలించే ఇన్‌స్పెక్టర్ వ్యవస్థను తొలగించి యాజమాన్యాలకు కార్మికున్ని కొత్తతరం బానిసలుగా అందించాడు. అదే రకంగా కర్మాగారాల్లో కార్మికుడు పొందవల్సిన ఇయస్ఐ, పిఎఫ్, బోనస్, కనీస వేతనాలు లాంటి వాటి అమలు కొరకు పరిశీలించే వ్యవస్థను కూడా మోదీ ప్రభుత్వం కోడ్‌ల ద్వారా హరించి వేయటం జరిగింది.

కార్మికుడు తనకు యాజమాన్యం నష్టం చేసినప్పుడు లేక కష్టానికి గురిచేసినప్పుడు నేరుగా కోర్టును ఆశ్రయించే విధానాన్ని రద్దుచేసి కార్మికులను దిక్కులేనివారిగా కోడ్‌ల ద్వారా చేయటం జరిగింది. ఇలాంటి పరిస్థితుల్లో కార్మికుడు న్యాయం పొందాలంటే వైకుంఠపాళి ఆట చవిచూడాల్సివస్తుంది. ప్రస్తుతం ఉన్న చట్టాల ప్రకారం 100మంది కార్మికులు పనిచేస్తున్న కర్మాగారం మూసివేయాలంటే యజమాని తప్పనిసరిగా ప్రభుత్వ అనుమతి పొందాలి. దానిని కోడ్‌లలో ఆ సంఖ్యను 300కు పెంచటం జరిగింది. కర్మాగారాల్లో కాంట్రాక్టు వ్యవస్థ మరియు ఫిక్స్‌డ్‌టర్మ్ ఎంప్లాయ్‌మెంట్ లాంటి వ్యవస్థలు ఉంటే యజమాని 300ల కన్నా ఎక్కువ కార్మికులను నియమించుకుంటాడనేది కలలో మాట. 95 శాతం పరిశ్రమలు నేటికి 300లు కన్నా తక్కువ కార్మికులనే కల్గివున్నాయనేది వాస్తవం. ఇప్పుడున్న పారిశ్రామిక వివాదాల చట్టంలో కార్మికున్ని తొలగించాలంటే యాజమాన్యం అనేక నిబంధనలు పాటించాలి. కానీ ప్రస్తుతం ప్రవేశపెట్టిన 4 కోడ్‌ల ప్రకారం కార్మికున్ని తీసివేయటానికి యాజమాన్యానికి ఎలాంటి అడ్డంకులు లేవు. కూరలోని కరివేపాకులా తీసిపడేయటానికి యాజమాన్యానికి మోదీ హక్కు కల్పించాడు. పరిశ్రమల మూసివేతకు మోదీ ప్రభుత్వం యాజమాన్యాలకు ఎలాంటి అడ్డంకులు లేకుండా కోడ్‌లు తెచ్చింది. కార్మికులు కష్టాలు, బాధలు పడుతుంటే యాజమాన్యాలు లాభాలతో ఆనందపడటం భవిష్యత్తులో జరిగేది వాస్తవం. ఇలాంటి పరిస్థితి రావటానికి పూర్తిగా కోడ్‌ల ప్రభావం అనేది తేలికగానే అర్థం చేసుకోవచ్చు. కార్మికులపై కోడ్‌ల మూలంగా పడుతున్న వ్యతిరేక ప్రభావాన్ని కాదని కోడ్‌లు మూలంగా కార్మికులకు న్యాయం జరుగుతుందని, వేతనాలు పెరుగుతాయని, కొత్త ఉద్యోగాలు ఏర్పడతాయని వక్రబుద్ధితో ప్రచారం చేస్తున్న వారిని దోపిడీదారుల తొత్తులుగా భావించాలి.

ఉన్న చట్టాలను సక్రమంగా అమలు చేయలేనివాడు కొత్త కోడ్‌ల తెచ్చి కార్మికులకు మేలు చేస్తానని చెప్పటం నక్క నీతి వచనాలను గుర్తు చేస్తున్నాయి. అంతిమంగా కోడ్‌లు అమలుచేస్తే కార్మికులు బానిసలుగా మారటం తప్పనిసరి. బానిసకాలంలో బానిసలు తిరుగుబాటు చేసి ఆనాడు యంత్రాలే వారి కష్టాలకు కారణమని భావించి ఆ యంత్రాలను పగలగొట్టారు. అప్పుడు యజమానులే దిగివచ్చి కార్మికుల డిమాండ్లను పరిష్కరించారు. నేటి కార్మికుడు తమకు కష్టాలకు యాజమాన్యాలే కారణం అని తెలుసుకాబట్టి వారి ఆవేశం యాజమాన్యాలపై సారించి తిరుగుబాటు చేసే అవకాశాలు నిండుగా ఉన్నాయి. ఇలాంటి సంఘటనలు గతంలో అనేక రాష్ట్రాల్లో జరిగిన సందర్భాలు కూడా ఉన్నాయని ప్రభుత్వం తెలుసుకోవాలి. కెనడా దేశ ప్రధాని "మా దేశం అమ్మకానికి లేదని" ప్రకటించినట్లుగానే మన దేశ కార్మికులు మేము బానిసలము కాదు అనే ఉద్యమం భారతదేశంలో తప్పనిసరిగా తీసుకువస్తారని ప్రభుత్వాలు గర్తించాలి. భారతదేశంలో కార్మికులను బానిసలుగా దోచుకోవటానికి ప్రభుత్వాన్ని లోబరుచుకొని కార్మికుల హక్కులను హరించి ఈ దేశంలో పెట్టుబడులు పెడితే వారు ఊహించినట్లు పారిశ్రామిక శాంతి కాకుండా పారిశ్రామిక విప్లవం వస్తుందని వారు తెలుసుకోవాల్సిన చారిత్రక సత్యాలు చాలా ఉన్నాయి. కార్మికుల ఆవేశాన్ని ప్రక్కదోవ పట్టించటానికి మోదీ ప్రభుత్వం కొత్త నాటకానికి తెరలేపటం జరిగింది. అదే "కార్మిక శక్తి నీతి 2025" పేరుతో చట్టం తెచ్చి ప్రచారం చేస్తున్నది. దాని ప్రకారం కార్మికుడు పనిచేయటానికే పుట్టాడు అది ప్రకృతి ధర్మం, కావున కార్మికుడు తన ధర్మాన్ని తాను నెరవేరిస్తే యజమాని తన ధర్మాన్ని నిర్వహిస్తాడని తప్పుడు ప్రచారం చేయటం మనువాద కాలంలో ప్రజలు అనుభవించిన పరిస్థితులను గుర్తుచేస్తున్నది.

ఉట్టికి ఎగరలేనమ్మ, స్వర్గానికి ఎగిరినట్టుగా ఉన్నచట్టాలను అమలు చేయని మోదీ ప్రభుత్వం యాప్ ఆధారిత రంగంలో పనిచేస్తున్న కార్మికులకు న్యాయంచేస్తానని ప్రచారం చేయటం పెద్ద బూటకం. భవన నిర్మాణ కార్మికులకు ఉన్న చట్టాన్ని న్యాయపరంగా అమలు చేయటంలో విఫలమైన ప్రభుత్వం వారు దాచుకున్న డబ్బును ప్రైవేటు వ్యక్తులకు దారాదత్తం చేయటంపై ఆ రంగంలోని కార్మికులు పోరాటం చేస్తున్నా పరిష్కారం లేదు. అలాంటిది యజమాని అనే వాడు లేని యాప్ ఆధారిత రంగంలో పనిచేస్తున్న కార్మికులకు గుర్తింపు కార్డు ఇస్తామని, ఇయస్ఐ, పిఎఫ్ కలుగజేస్తామని ఇంకా అనేక సౌకర్యాలు ఇస్తామని చెప్పటంలో నీతిలేదు అనేది అర్థం చేసుకోవాలి. ప్రస్తుతం దేశంలో పనిచేస్తున్న లక్షలాది మంది కాంట్రాక్టు కార్మికులకు, అనేక లక్షలమంది పనిచేస్తున్న ప్రైవేటు కర్మాగారాల్లో ఏ చట్టం అమలు కాకపోతే కేంద్ర ప్రభుత్వం కుంభకర్ణునిలాగా నిద్రపోతున్నది. అలాగే దేశంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్కీం వర్కర్స్(ఆశా, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజనం, సాక్షర భారతిలాంటి) అనేక రంగాల్లో ఎన్నో సంవత్సరాల నుంచి పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు, సెలవులు, ఇయస్ఐ, పిఎఫ్, గ్రాట్యుటీ లాంటి ఎలాంటి సౌకర్యం లేక చాలీచాలని వేతనాలతో పనిచేయటం కేంద్ర ప్రభుత్వానికి కనపడటం లేదా? మోదీ తెచ్చిన కోడ్‌లతో సంభవించిన బానిస విధానాన్ని, యజమానుల దోపిడిని ఎదిరించటం కార్మికుల ముందున్న జీవన్మరణ సమస్య. ఎవరు అడ్డుపడినా గత చరిత్ర ప్రకారం కార్మికుల తిరుగుబాటు తప్పదనే సూచనలు కనపడుతున్నాయి. దోపిడీ చరిత్రను అంతం చేయాల్సిన కర్తవ్యం కార్మికుల ముందు ఉన్నదని ప్రస్తుత పరిస్థితులు తెలియజేస్తున్నాయి.

# ఓటరు చైతన్యమే గ్రామాభివృద్ధికి మూలం



ఉజ్జిని రత్నాకర్ రావు
9490952646

భారతీయ ప్రజాస్వామ్యంలో అత్యంత బలమైన పునాది గ్రామం. గ్రామం బలపడితేనే దేశం బలపడుతుంది. గ్రామ అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యం. ఈ గ్రామ పాలనలో అత్యంత ప్రధానమైనవి గ్రామపంచాయతీ ఎన్నికలు. చట్టసభల ఎన్నికల కంటే సాధారణంగా చిన్నవి అనుకున్నా, నిజంగా చూసుకుంటే మన దైనందిన జీవితంపై ప్రతిరోజూ ప్రభావం చూపేది గ్రామస్థాయి పరిపాలనే.గ్రామాల అభివృద్ధిలో ప్రథమ పౌరుడు సర్పంచితో పాటు వార్డు సభ్యులే క్రియాశీలక పాత్ర. వారు సమర్థంగా వ్యవహరిస్తే. ప్రజలు ఆదరించి, పదవులు కట్టబెడతారు. గ్రామపంచాయతీలు, పంచాయతీ సమితులు, జిల్లా పరిషత్తులతో కూడిన మూడంచెల గ్రామీణ స్థానిక ప్రభుత్వ సంస్థల వ్యవస్థను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం చేత నియమించబడిన బలవంతరాయ్ మెహత కమిటీ 1957లో సిఫార్స్ చేయడం జరిగింది. ఈ సిఫార్సులను అనుసరించి రాజస్థాన్ ప్రభుత్వం 1957 అక్టోబర్ 2న మొట్టమొదటిసారిగా పంచాయతీరాజ్ వ్యవస్థను ప్రవేశపెట్టింది.ఆ తర్వాత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 1959 అక్టోబర్ 11 తేదీన తేదీన పంచాయతీ రాజ్ వ్యవస్థను ప్రవేశపెట్టింది. ఆ తరువాత అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత రాష్ట్రాలు పంచాయతీరాజ్ వ్యవస్థను ప్రవేశపెట్టాయి.

**73 వ రాజ్యాంగ సవరణతో రాజ్యాంగ ప్రతిపత్తి..**

భారత రాజ్యాంగంలోని మూడంచెల వ్యవస్థలో ప్రజలకు దగ్గరగా పనిచేస్తున్న సంస్థలు గ్రామపంచాయతీలను బలోపేతం చేయడానికి పంచాయత్ రాజ్ అంశం రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలలో చేర్చడం జరిగింది. ఆదేశిక సూత్రాలలోని అంశాలను ప్రభుత్వాలు విధిగా పాటించాలన్న నియమం లేదు. ఈ కారణంగా మన దేశంలో పంచాయతీరాజ్ వ్యవస్థ కొంత నిరాదరణ కు గురైంది.1992 సంవత్సరంలో అమలులోకి వచ్చిన 73 వ రాజ్యాంగ సవరణ పంచాయతీరాజ్ సంస్థలకు రాజ్యాంగ ప్రతిపత్తిని కల్పించి జవసత్వాలను ఇచ్చింది. 73వ రాజ్యాంగ సవరణను అనుసరించి ప్రతి గ్రామపంచాయతీలో అనివార్యంగా గ్రామసభ సమావేశాలను ప్రతి సంవత్సరంలో కనీసం రెండుసార్లు నిర్వహించాలి. గ్రామంలోని ఓటర్లందరూ గ్రామసభలో సభ్యులు. గ్రామసభ గ్రామస్థాయి శాసనసభ వలే పని చేయాలి. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల లబ్ధిదారుల ఎంపికలో ఈ సభ ప్రధాన పాత్రను పోషిస్తుంది. అయితే దురదృష్టవశాత్తు ఈ గ్రామసభ సమావేశాలు మొక్కుబడిగా మారాయి అన్న విమర్శ ఉంది.

గ్రామపంచాయతీలకు రాజ్యాంగ భద్రత లభించింది. రాజ్యాంగం అధికరణ 243 జి గ్రామపంచాయతీలను బలోపేతం చేయాలని ఆదేశాలు ఇచ్చింది. 11వ షెడ్యూల్‌లో చెప్పిన విధంగా రాష్ట్ర ప్రభుత్వాలు 29 శాఖలను సంబంధించిన పనులు గ్రామపంచాయతీలకు బదలాయింపులు చేయాలని చెప్పడం జరిగింది.

పార్లమెంటుకు, రాష్ట్ర శాసనసభకు క్రమం తప్పకుండా ఎన్నికలు ఎలా జరుగుతాయో అలాగే పంచాయతీలకు, మున్సిపాలిటీల కూడా వాటి పదవి కాలం ముగిసే ముందే ఎన్నికలు జరపాలి. కొత్త పాలకవర్గం పాత వారి పదవీకాలం ముగిసేనాటికి సిద్ధంగా ఉండాలి.

**తెలంగాణలో 20 నెలలు ఆలస్యంగా ఎన్నికలు:**

తెలంగాణ రాష్ట్రంలోని12,769 పంచాయతీలతో పాటు 539 మండల ప్రజా పరిషత్తుల పాలకవర్గ గడువు 2024 ఫిబ్రవరి 1 తో ముగిసినా స్థానిక సంస్థల్లో బీసీల కు 42 శాతం రిజర్వేషన్ అంశం పెండింగ్ లో ఉన్న కారణంగా పంచాయతీ ఎన్నికల అంశం కొంత గందరగోళానికి గురైంది. నేడు రాష్ట్ర హైకోర్టు ఆదేశాలతో 20 నెలలు ఆలస్యంగా ఈనెల 11, 14, 17 తేదీలలో మూడు దశలలో రాష్ట్రంలో12769 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగుతున్నాయి. సర్పంచులకు, వార్డు సభ్యులకు నామినేషన్ల పర్వం ముగిసింది. పార్టీల ప్రమేయం లేకుండా స్వతంత్ర గుర్తులతో ఎన్నికలు నిర్వహణ జరుగుతున్నందున సర్పంచులకు, వార్డు సభ్యులకు పోటీలు పడి నామినేషన్లు వేసి ప్రచారం ఊపు అందుకుంది.

**అభివృద్ధికి పాటుపడే వ్యక్తులను ఎన్నుకోవాలి :**

ఎన్నికల ముందు అభ్యర్థులు హామీల వరద పారిస్తారు. వారి మాయమాటలకు లోనుకాకుండా ఓటర్లు ఒక విషయాన్ని గుర్తుంచుకోవాలి.' ఇప్పటి వరకు అభ్యర్థి ఏం చేశారు', అని ప్రశ్న అత్యంత ప్రధానమైనది. గతంలో పదవిలో ఉన్న అభ్యర్థి అయితే అతని పనులు పరిశీలించాలి. కొత్త అభ్యర్థి అయితే గ్రామం కోసం చేసిన సామాజిక సేవలు చూసుకోవాలి. వాగ్దానాల జాబితా పొడవుండొచ్చు. కానీ హామీలను సాధించే, నెరవేర్చే కృతనిశ్చయం అభ్యర్థి కలిగి ఉండాలి. అభ్యర్థి వ్యక్తిత్వం అత్యంత కీలకం. నిజాయితీగా ఉన్నవాడై, ప్రజల మాట వినగలడా, వివాదాలను శాంతితో పరిష్కరించగలడా? గ్రామ రాజకీయాలకు తావివ్వకుండా.. ప్రజలతో మమేకమై అన్ని వర్గాలను కలుపుకునే వాడుగా ఉంటు గ్రామాభివృద్ధిపై దృష్టి పెట్టే అభ్యర్థిని సర్పంచ్ గా ఎన్నుకోవాలి.

**ఓటర్స్ డబ్బు,బహుమతులకు లోనుకాగూడదు:**

ఎన్నికల సమయంలో డబ్బు ఉన్నటువంటి వారు అనేక భ్రమలు కల్పిస్తారు. ముఖ్యంగా డబ్బు, బహుమతులు,త్రాగుడు, విందులు ఇవ్వడం సాధారణం. అవి తీసుకొని ఓటు వేయడం మన వ్యక్తిగత ప్రయోజనం అనిపించగా, గ్రామ భవిష్యత్తుకు అది పెద్ద నష్టం. డబ్బు ఇచ్చే నాయకుడు పదవిలోకి వెళ్లాక మరింత డబ్బు సంపాదించడానికి ప్రయత్నిస్తాడు. అందువల్ల ఓటర్సు 'ఈరోజు ప్రయోజనం' కన్నా 5 సంవత్సరాల అభివృద్ధి గురించి ఆలోచించాలి. గ్రామాభివృద్ధికి ఆలోచించాలి. గ్రామాన్ని ముందుకు నడిపేది సర్పంచ్ మాత్రమే. మంచి నాయకుడు ఉంటే గ్రామం అద్భుత మార్పులు చూడగలదు. చెడు నాయకుడు ఉంటే గ్రామం సంవత్సరాలపాటు వెనుకబడిపోవచ్చు. అందుకే ఓటు వేయడానికి ముందు ఓటరు నిశితంగా ఆలోచించాలి.ఓటర్ డబ్బు, విందు, వినోదానికి, భ్రమలకు దూరంగా ఉండాలి. గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఓటు వేయడం అంటే.. గ్రామ భవిష్యత్తుకు నిర్ణయం తీసుకోవడం. గ్రామ అభివృద్ధికి బాటలు వేయటం. గ్రామ అభివృద్ధి చెందితేనే రాష్ట్ర అభివృద్ధి చెందుతుంది. రాష్ట్రం అభివృద్ధి చెందితేనే దేశం బలపడుతుంది. ఆ బలం మన చేతుల్లో మన ఓటుతో ప్రారంభమవుతుంది.

# సమష్టి బాధ్యతతోనే మానవ హక్కులకు రక్షణ

భూమిపై పుట్టిన ప్రతి మనిషికి స్వతంత్రంగా జీవించేందుకు కొన్ని హక్కులుంటాయి. కానీ అనేక సందర్భాల్లో ఆ హక్కులను ఎవరూ గౌరవించడం లేదు. సాటి మనిషిని మనిషిగా కూడా చూడడం లేదు. కొన్ని సందర్భాల్లో సమాజం కూడా ఈ హక్కులను హరించివేస్తోంది. ఈ అనంత విశ్వంలోని జీవులలోకెల్లా ప్రత్యేకమైన జాతి మానవజాతి. సృష్టిలోని అనేక జీవులలో మనిషిని ఉన్నత స్థాయిలో నిలబెట్టేది అతని ఆలోచనాశక్తి, వివేచన, సృజనాత్మకత మరియు పరస్పర సహకార భావనలు. మానవజాతి యావత్తూ ఏకతాటిపై నిలబడే సందర్భమే ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం. ఈరోజు మనిషి పట్ల సాటి మనిషి వ్యవహరించాల్సిన తీరును బోధించి, మానవత్వం, సమానత్వం వంటి విలువలను గుర్తుచేసేందుకుగాను ప్రతి సంవత్సరం డిసెంబర్ 10వ తేదీన ప్రపంచ మానవ హక్కుల దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం.

మానవుని జీవితాన్ని గౌరవప్రదంగా, భద్రంగా, స్వేచ్ఛగా జీవించగలిగే పరిస్థితుల్ని కల్పించడానికి, అందరికీ సమాన అవకాశాలు కల్పించడానికి, ఒక మెరుగైన సమాజస్థాపనకు ఐక్యరాజ్య సమితి 1948, డిసెంబర్ 10న 'సార్వత్రిక మానవ హక్కుల ప్రకటన'ను ఆమోదించింది. కుల, జాతి, వర్ణ, దేశ, లింగ బేధాలు లేకుండా అందరికీ వర్తించేలా 30 హక్కులను ఈ ప్రకటనలో పొందుపర్చారు. జీవించే హక్కు, సమానత్వ హక్కు, స్వేచ్ఛ హక్కు, విద్యా హక్కు, వ్యక్తిగత గౌరవం, మత స్వేచ్ఛ, ఉద్యోగ భద్రత, సమాన ఉద్యోగావకాశాలు,చట్టం ముందు సమానత్వం, బానిసత్వ వ్యతిరేక హక్కులు,అభిప్రాయ స్వేచ్ఛ. ప్రజాస్వామ్య పాలనలో పాల్గొనే హక్కు, చట్ట ఉల్లంఘనలకు చట్టపరమైన పరిష్కార హక్కు, నిర్దోషిగా భావింపబడడం మరియు శిక్షాహక్కు, ఆస్తిస్వామ్య హక్కు, దేశంలో స్వేచ్ఛ, ప్రయాణ హక్కు, వివాహం మరియు కుటుంబ స్థాపన హక్కు, విద్యాహక్కు మొదలైనవి ఈ ప్రకటనలో పేర్కొన్న కొన్ని హక్కులు. ఇవి ప్రపంచ వ్యాప్తంగా ఉన్న వ్యక్తులందరికీ వర్తిస్తాయి. ప్రపంచ దేశాల రాజ్యాంగాలు, న్యాయ వ్యవస్థలు కూడా ఈ హక్కులను అనుసరిస్తున్నాయి.

1950, డిసెంబర్ 4న జనరల్ అసెంబ్లీ యొక్క ప్లీనరీ సమావేశంలో మానవ హక్కుల దినోత్సవాన్ని అధికారికంగా ప్రకటించారు. అన్ని ఐక్యరాజ్య సమితి సభ్యదేశాలు మరియు ఆసక్తిగల ఇతర సంస్థలు ఈ దినోత్సవాన్ని జరుపుకోవాలని నిర్ణయించాయి. మానవ హక్కుల రంగంలో నిర్విరామ కృషిచేస్తు న్న ప్రభుత్వ మరియు ప్రభుత్వేతర సంస్థలు కూడా ఈ దినోత్సవాన్ని స్మరించుకోవడానికి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తాయి. 2025 సంవత్సరానికి గాను ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం అధికారిక ఇతివృత్తం మన రోజువారీ అమూల్య వస్తువులు'. ఈ అమూల్య వస్తువులు 'సురక్షిత జీవితం, గౌరవం, స్వేచ్ఛ, సమానత్వం మొదలైనవి మన రోజువారీ దినచర్యలో భాగంగా పరిగణించాలని గుర్తుచేస్తున్నాయి. మనిషి మనిషిగా జీవించడానికి హక్కులు అత్యవసరం. కానీ అనేక సందర్భాల్లో అవి ఉల్లంఘనలకు గురవుతున్నా యి. భారతదేశంలో అనాదిగా పాతుకుపోయిన కుల వ్యవస్థ, అస్పృశ్యత, అంటరానితనం వల్ల బడుగు బలహీన వర్గాలు వివక్షకు గురైనాయి. కులం ఆధారంగా మనుషులపై వివక్ష చూపడం భారతదేశంలో శతాబ్దాలుగా కొనసాగింది. ఇప్పటికీ జైల్లో కూడా కుల వివక్షత కొనసాగుతుంది. ఈ విషయాన్ని ఇటీవల సుప్రీం కోర్టు తప్పుపట్టింది. షెడ్యూల్ కులాల ఖైదీల చేతనే మరుగుదొడ్లు కడిగించడం,ట్యాంకులు శుభ్రం చేయించడం వంటి పనులు చేయించడంపై ఉన్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. అగ్ర కులాల ఖైదీలకు సులభమైన వంట పనులు అప్పగించడం ముమ్మాటికీ వివక్షే అవుతుందని పేర్కొన్నది. అలాగే అనేక సంఘటనల్లో అమాయకులైన దళిత, గిరిజనులనే నేరస్థులుగా చూపిస్తున్నారు.

మానవ హక్కుల దినోత్సవాలు ఎన్ని జరుపుకుంటున్నా ఇప్పటికీ చాలా దేశాల్లో మానవ హక్కుల ఉల్లంఘనలు యథేచ్ఛగా జరుగుతుండడం శోచనీయం. ప్రభుత్వ విధానాలు, వాటి అమలు, వాటిపై ప్రజల అవగాహన మొదలైనవి మానవ హక్కులపై ప్రభావం చూపుతాయి.

(డిసెంబర్ 10 అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా)

సుధాకర్ ఏవి, 9000674747

# సర్పంచ్ ఎన్నికలలో వలస ఓటర్ల కోసం వేట

రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కుతోనే తమలాంటి వలస ఓటర్లకు తమ సొంత ప్రాంతంలో గౌరవ, మర్యాదలు దక్కుతున్నాయని వలస ఓటర్లు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇది ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత రాజ్యాంగం యొక్క గొప్పతనం అని వారు ప్రజాస్వామ్య స్ఫూర్తిని, రాజ్యాంగ గొప్పతనాన్ని గుర్తు చేశారు. తెలంగాణలో సర్పంచు ఎన్నికలు వచ్చాయంటే గ్రామాలన్నీ ఒక కొత్త ఉల్లాసంతో కదలికలోకి వస్తాయి. అయితే గత ఐదేళ్లలో పెద్ద సంఖ్యలో యువత, మధ్య వయస్సు వారు హైదరాబాదులో పనికోసం స్థిరపడి ఉండటంతో, ఇప్పుడు గ్రామాల ఓటు సమీకరణాలు మారిపోయాయి.

**గెలుపును నిర్ణయించేది వలస ఓటర్లే**

ఎన్నికల్లో నిజంగా ఎవరిది బలం? గ్రామాల్లో ఉన్న ఓటర్లదా? లేదా హైదరాబాదులో ఉన్న వలస ఓటర్లదా? అసలు ఫలితాలను తేల్చేది నగరాల్లో పనిచేస్తున్న ఈ ఓటర్లేనని రాజకీయ నాయకులు అర్థం చేసుకున్నారు. అందుకే ఇప్పుడు గ్రామాలు హైదరాబాద్ రూట్‌లో పొలిటికల్ ట్రాఫిక్ గరిష్ట స్థాయిలో ఉంది. వలస ఓటర్ల కోసం ఆపరేషన్ హైదరాబాద్ సర్పంచ్ అభ్యర్థులు, వారి అనుచరులు, మద్దతు దారులు ఎవరు చూసినా హైదరాబాదులోనే తిరుగుతున్న దృశ్యం కనిపిస్తుంది. హయత్‌నగర్, పటాన్ చెరువు, కూకట్‌పల్లి, బోర్లగూడ, చింతల్, అల్వాల్ ఇలా కార్మికులు పెద్ద సంఖ్యలో ఉండే ఏ ప్రాంతంలో చూసినా రెండు రోజులుగా అద్దె బస్సులు, ట్రావెల్స్ వాహనాలు వరుసగా కనిపిస్తున్నాయి. ఒక్క గ్రామం నుంచే 12 బస్సులు ప్రతి బస్సులో 40నుండి 50 ఓటర్లు ప్రతి ఓటరుకి వసతి, భోజనం భరోసా ఇది సాధారణ విషయం కాదు. ఇది రాజకీయ పెట్టుబడి. ఓటు వేయటానికి గ్రామాలకు వెళ్లాలంటే రెండు రోజులు వేతనం పోతుంది. హైదరాబాద్‌లోని పనిచేసే కార్మిక కుటుంబాలు ఈ విషయాన్ని స్పష్టంగా చెబుతున్నారు. మీ లాస్ మేము చూసుకుంటాం అన్నయ్యా... అక్కా, మీరువస్తే సరిపోతుంది, సర్ చూసుకుంటాడు. అంటూ నచ్చజెప్పి, బస్సులో ఎక్కిస్తున్నారు. కొన్నిచోట్ల, కాంట్రాక్టర్లు కూడా అభ్యర్థుల దగ్గరే ప్యాకేజ్ తీసుకుని కార్మికుల సెలవు చూసుకుంటున్నారు.

**గ్రామాల్లో స్వాగత వాతావరణం :** హైదరాబాద్ నుండి ఓటర్లు గ్రామాలకు చేరడం మొదలైతే అక్కడే పండుగ మూడ్ ప్రారంభమవుతుంది. వసతిభోజన ఏర్పాట్లు, బడి భవనాల్లో గదులు, కమ్యూనిటీ హాళ్లలో పడకలు, రాత్రి భోజనం, ఉదయం టిఫిన్లు వంటచేసే ప్రత్యేక బృందాలు, ఒక్కో అభ్యర్థి కింద 200 నుండి 500 మంది వలస ఓటర్లు ఇలా ప్రత్యేక అతిథ్యం పొందుతున్నారు.

**సాంప్రదాయ స్వాగతం :** కొన్ని గ్రామాల్లో వలస ఓటర్లకు గంగిరెద్దుల ఆడింతలు, బొమ్మలాట ప్రదర్శనలు కూడా ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, యువకులు, ఎవరైనా వచ్చారంటే అందరూ ఆనవాయి తీగా కలిసి మాట్లాడుతున్నారు.

కేవలం గ్రామాల్లో కాకుండా హైదరాబాదులోనే ప్రచారం పెరిగింది.మార్కెట్ ప్రాంతాల్లో ప్రచారం బీర్ల తయారీ గోదాములు, కర్మాగారాలు, నిర్మాణ సైట్లు, షాప్‌లతో నిండిన సెంటర్లు ఇక్కడే అభ్యర్థులు స్వయంగా వచ్చి వారిని ఒప్పించడం మొదలుపెట్టారు. అన్న ఈసారి ఓటు చాలా ముఖ్యం మనకొక అవకాశం ఇవ్వండి. అంటూ చేతులు కలుపుతున్నారు.

**వలస ఓటర్ల లెక్క :** భారీ సంఖ్యలో వలస వచ్చిన వారి వల్ల మొత్తం ఓట్లలో 20 నుండి 40 % ఓటర్లు హైదరాబాదులోనే ఉన్నారని లెక్కలు చెబుతున్నాయి. ఒక్క గ్రామంలో 300 నుండి 800 మంది వరకు నగరాల్లో ఉండటం సాధారణం అయిపోయింది. వలస వచ్చిన యువత ఎక్కువగా కొత్త అభ్యర్థుల పట్ల ఆకర్షితులు. పెద్ద వారు మాత్రం సంప్రదాయం ప్రకారం పాత నేతలకు మొగ్గు. మహిళలు అభ్యర్థుల ఆత్మీయత, భద్రత హామీలను చూసుకుని నిర్ణయం. ఈ భిన్నతలు ఓటు బ్యాంకులను చీల్చేస్తున్నాయి. పెద్ద గ్రామాల్లో అభ్యర్థులు వలస ఓటర్ల డేటాను పూర్తిగా సేకరించి, చిరునామా కుటుంబ సభ్యుల పేర్లు ఓటింగ్ బూత్ నెంబర్లు ఇలా వివరాలను తయారు చేసి, వచ్చేవారు, రానివారు అనే రెండు జాబితాలు తయారు చేసుకున్నారు. ఓటర్లను పంపించేందుకు వాడే యాప్‌లు కొంతమంది యువకులు వాట్సాప్ గ్రూపులు, ఎక్సెల్ షీట్లు, గూగుల్ మ్యాప్స్ పిన్‌లోకేషన్లతో డిజిటల్ పద్ధతిలో మొత్తం ప్రక్రియను పర్యవేక్షిస్తున్నారు.




ఇది నిజంగా చిన్న ఎన్నికల ఆపరేషన్ కమాండ్ రూం లాంటి దే.

**గ్రామాల్లో పోటీ తీరు :** పాత నాయకులు, గ్రామంలోని వృద్ధులు మన కుటుంబం, మన వంశం చేసిన సేవలు అంటూ ఓటర్లను ఒప్పిస్తున్నారు. అభివృద్ధి కావాలంటే కొత్త వాళ్లే పట్టణాల్లో ఉన్న యువత గ్రామాల్లో రోడ్లు, స్ట్రీట్ లైట్లు, నీటి సమస్యలు, డిజిటల్ సదుపాయాలు, వ్యర్థాల నిర్వహణ వంటి అంశాలను ఎత్తిచూపుతూ కొత్త అభ్యర్థులలకు మద్దతు ఇస్తున్నారు. ఎన్నికల రోజు... ఎన్నికల రోజు గ్రామం మొత్తం పండుగలా మారిపోతుంది. ఉదయం నుంచే ట్రాఫిక్ బస్సులు వరుసగా గ్రామాలకి చేరుతుండగా, టెంట్ల వద్ద చాయ్, బూత్ దగ్గర నీళ్ల బాటిళ్లు, ఓటర్లకు ఆఖరి నచ్చజెప్పుట ఇతర కార్యక్రమాలు జరుగుతూనే ఉంటాయి.

ప్రజాపక్షం ప్రతినిధి, వనపర్తి



# జనరల్
STATE & REGIONAL NEWS



సకల జనుల సామూహిక స్వప్నాన్ని సాకారం చేసిన సోనియా గాంధీ జన్మదిన సందర్భంగా మినిస్టర్స్ క్వార్టర్స్‌లో మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరిలు కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్న దృశ్యం.

## సోనియా గాంధీకి జన్మదినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన మధుయాష్కీ గౌడ్



ప్రజాపక్షం/హైదరాబాద్ : కాంగ్రెస్ పార్టీ అగ్రనేత సోనియా గాంధీకి జన్మదినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతున్న టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపి మధుయాష్కీ గౌడ్. సోనియా గాంధీ నిండు నూరేళ్లు ఆయు ఆరోగ్యాలతో దేశానికి సేవలు అందించాలని మధుయాష్కీ గౌడ్ ఆకాంక్షించారు.

## హైదరాబాద్ ఔటర్ రీజినల్ రింగ్ రైల్ ప్రాజెక్ట్‌ను వేగవంతం చేయాలి

లోక్‌సభలో కేంద్ర రైల్వే మంత్రికి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి విజ్ఞప్తి

ప్రజాపక్షం/హైదరాబాద్: భారతదేశంలోనే మొట్టమొదటి ఔటర్ రీజినల్ రింగ్ రైల్వే లైన్ ప్రాజెక్టును వేగవంతం చేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని మంగళవారం లోక్‌సభలో రూల్ 377 ద్వారా కేంద్ర రైల్వే మంత్రికి భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ ప్రాజెక్ట్ హైదరాబాద్ చుట్టూ దాదాపు 400 కిలోమీటర్లు విస్తరించి, సుమారు 8 జిల్లాలతో పాటు 14 మండలాలను కవర్ చేస్తూ, రాబోయే ఔటర్ రీజినల్ రింగ్ రోడ్డుకు సమాంతరంగా హైదరాబాద్ నగరాన్ని విస్తరిస్తుందని చెప్పారు. ఇందులో దాదాపు 5 రైల్వే ఓవర్ బ్రిడ్జిలు, రైల్వే ఫ్లై ఓవర్లు ఉన్నాయని, దీని అంచనా వ్యయం సుమారు రూ.12 వేల కోట్లు ఉంటుందని వివరించారు. ఈ ప్రాజెక్ట్‌ను ఉత్తర భాగం, దక్షిణ భాగం సర్వే పూర్తి అయిందని, హైదరాబాద్ యొక్క ప్రాముఖ్యత, అభివృద్ధిని పరిగణనలోకి తీసుకుని, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ ప్రాజెక్టును ప్రతిష్ఠాత్మకమైనదిగా స్వీకరించారని వెల్లడించారు. తెలంగాణ 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్న నేపథ్యంలో ఈ రింగ్ రైల్ ప్రాజెక్ట్ ఆర్థిక కార్యకలాపాలను, ఐటీ హబ్‌లను, ఫార్మాస్యూటికల్ క్లస్టర్లను, లాజిస్టిక్ పార్కులను, అభివృద్ధి చెందుతున్న పట్టణ వృద్ధి కేంద్రాలను సృష్టిస్తుందని, రాష్ట్రవ్యాప్తంగా కొత్త వృద్ధి కారిడార్లను ఏర్పాటు చేయడానికి ఉపయోగపడుతుందని వివరించారు. ఇది తెలంగాణ యొక్క లాజిస్టిక్స్, మొబిలిటీ పర్యావరణ వ్యవస్థను పెంచడానికి, భవిష్యత్తు అవసరాలను తీర్చడానికి రాష్ట్రంలో దాదాపు 60 శాతం పట్టణీకరణకు దారితీస్తుందని, తద్వారా ఉద్యోగ సృష్టిని, పారిశ్రామిక వృద్ధిని వేగవంతం చేసి వికసిత్ భారత్ 2047 లక్ష్యాన్ని సాధించడంలో సహాయపడుతుందని ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

## వజ్రాయుధం లాంటి ఓటును అగ్రకులాలకు వేసి మోసపోవద్దు

బిసి శ్రేణులకు బిసి జెఎసి చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ పిలుపు



ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగి ఉండి కూడా, ఎంగిలి మెతుకుల కోసం ఆశపడి వజ్రాయుధం లాంటి ఓటును అగ్రకులాలకు వేసి మోసపోవద్దని బిసి జెఎసి చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. బిసిల తలరాతలు మారాలంటే బిసిల ఓటు బిసిలకే వేసుకుని 'ఓటు మనదే సీటు మనదే' అనే స్ఫూర్తితో ఎన్నికల్లో బిసిలంతా వ్యవహరించాలని ఆయన కోరారు. ప్రస్తుతం జరిగే గ్రామ పంచాయతీ ఎన్నికలలో రాజకీయ పార్టీలకతీతంగా జనరల్ స్థానాల్లో పోటీ చేస్తున్న బిసి అభ్యర్థులను ఐక్యమత్యంతో గెలిపించుకోవాలని రాష్ట్రంలోని బిసిలకు పిలుపునిచ్చారు. బిసిలను మోసం చేసిన రాజకీయ పార్టీలకు బుద్ధి చెప్పాలంటే, బిసిలకు రాజకీయ అధికారం దక్కాలంటే, బిసిల రాజకీయ చైతన్యాన్ని చాటి చెప్పాలని 'బిసిల ఓటు బిసిలకే' అనే నినాదంతో ముందుకెళ్లాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జివో నెంబర్ 9 ద్వారా బిసిలకు రాజకీయరంగంలో రిజర్వేషన్లు అమలు చేస్తే, రాష్ట్రవ్యాప్తంగా బిసిలకు 5380 సర్పంచ్ స్థానాలు దక్కేవని, అలా కాకుండా జివో నెంబర్ 46 ద్వారా బిసి రిజర్వేషన్లను 17 శాతంకు తగ్గించి మోసం చేశారని మండిపడ్డారు. బిసిలకు రావలసిన 3,400 బిసి రిజర్వ్ స్థానాలను జనరల్ స్థానాలుగా మార్చారని, దీనితో జనరల్ స్థానాలు అంటే అగ్రకులాలవే అని భ్రమలలో ఉండి అక్రమంగా కూడబెట్టిన డబ్బుతో బిసిల ఓట్లను తమ నోట్లతో కొనుగోలు చేసి బిసి అభ్యర్థులని ఓడించాలని కుట్రలు చేస్తున్నారన్నారు. గ్రామీణ ప్రాంతాలలో 90 శాతం నివసించేది బిసి, ఎస్సి, ఎస్టిలేనని, 90 శాతం జనాభా ఉన్న బహుజనులు 9 శాతం ఉన్న అగ్రకులాలకు ఓటు వేయవద్దని, జనరల్ స్థానాలలో నిలబడిన బిసి అభ్యర్థులకు ఎస్సి, ఎస్టి, మైనార్టీలు కూడా అండగా నిలబడి సహకరించాలని, అంతిమంగా తెలంగాణ రాష్ట్రంలో పల్లె నుండి పట్నం వరకు బహుజన రాజ్యాధికారానికి బాటలు వేయాలని జాజుల శ్రీనివాస్ గౌడ్ విజ్ఞప్తి చేశారు.

## తెలంగాణ ఔనత్యాన్ని.. చాటి చేప్పే తెలంగాణ తల్లి విగ్రహం: అదనపు కలెక్టర్

ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణ తల్లి విగ్రహం యొక్క ప్రాముఖ్యతను నలుమూలలను విస్తరింపచేసేందుకు రాష్ట్ర ప్రభుత్వము ప్రత్యేక కృషి చేస్తుందని అదనపు కలెక్టర్ కదిరవన్ పలని అన్నారు. ప్రజాపాలన ఉత్సవాల్లో భాగంగా మంగళవారం హైదరాబాద్ కలెక్టరేట్ వద్ద ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి అదనపు కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజల్లో ఐకత్య, ఆత్మగౌరవం, ప్రతిష్టను, ఔనత్యాన్ని పెంపొందించేందుకు తెలంగాణ తల్లి విగ్రహం నిలువడంతో పాటు గుర్తిండిపోతుందన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో పాత్ర, ప్రోత్సాహకం చాలా ముఖ్యమని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇందులో భాగంగానే తెలంగాణ రైజింగ్ 2047 అనే సంకల్పంతో సిద్దమైందని, ఈ విజన్ తెలంగాణ అభివృద్ధికి ఎంతో ఉపకరిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సి కార్పొరేషన్ ఈడి రమేష్, జిల్లా సర్వే అధికారి శ్రీరామ్, కలెక్టరేట్ ఇన్‌చార్జ్ పరిపాలన అధికారి విజయలక్ష్మి, వివిధ విభాగల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## అనిల్ అంబానీ కుమారుడిపై సిబిఐ కేసులు,ఇంట్లో సోదాలు

న్యూఢిల్లీ: యూనియన్ బ్యాంకును మోసం చేశారన్న ఆరోపణలపై పారిశ్రామికవేత్త అనిల్ అంబానీ కుమారుడు జై అన్మోల్ అనిల్ అంబానీపై సిబిఐ రెండు కేసులు నమోదు చేసింది. రూ.14,852 కోట్ల మేరకు రుణాలను ఎగవేసి బ్యాంకులను మోసం చేసినందుకుగాను వేరు వేరు రెండు కేసులలో జై అన్మోల్ అనిల్ అంబానీకి వ్యతిరేకంగా సిబిఐ ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేసింది. అనిల్ ధీరూభాయ్ అంబానీ (ఎడిఎ) గ్రూపు కంపెనీలు రిలయెన్స్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఆర్‌హెచ్‌ఎఫ్‌ఎల్), రిలయెన్స్ కమర్షియల్ ఫైనాన్స్ లిమిటెడ్‌కు సంబంధించిన కేసులలో ఆయనపై ఈ ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేశారు. ముంబయిలోని కఫ్ఫె పరేడ్‌లో ఉన్న అనిల్ అంబానీ నివాసం సీ విండ్ బిల్డింగ్‌లో ఉన్న ఏడవ అంతస్తులో సిబిఐ అధికారులబృందం సోదాలు చేసింది. ఆర్‌హెచ్‌ఎఫ్‌ఎల్‌కు గతలో జై అన్మోల్ అంబానీ డైరెక్టర్‌గా పనిచేశారు. మాజీ సిఇఓ రవీంద్ర శరద్ సుధాకర్, ఇతర మాజీ డైరెక్టర్లపై కేసులు నమోదు చేశారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాను రూ.228 కోట్ల మేరకు మోసం చేశారన్న ఆరోపణలపై ఈ కేసులు నమోదయ్యాయి. అదేవిధంగా ఆర్‌సిఎఫ్‌ఎల్ పై కూడా కేసు నమోదైంది.బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రను రూ.57 కోట్ల మేరకు జై అన్మోల్ మోసం చేశారన్న ఆరోపణలపై ఈ కంపెనీ మాజీ డైరెక్టర్లపై కేసులు నమోదయ్యాయి. ఐతే ఈ కేసులో అనిల్ అంబానీ కుమారుడి పేరు ప్రస్తావించలేదు.

# ఫ్యాక్టరీ మేనేజిమెంట్ ఎదుట కార్మికులు గొంతెత్తలేరు

సిగాచి ఫ్యాక్టరీ పేలుళ్ల ఘటనపై హైకోర్టు వ్యాఖ్య



ప్రజాపక్షం/హైదరాబాద్: సంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని సిగాచి ఫ్యాక్టరీకి చెందిన బలమైన యాజమాన్యం ముందు కార్మికులు గొంతెత్తి తమ గోడు చెప్పుకోలేని దుస్థితి ఉందని హైకోర్టు ఘాటు వ్యాఖ్య చేసింది. సిగాచీ దారుణ ఘటన ఒక రోజులో జరిగిన లోపం కారణం కాదంది. రాత్రికి రాత్రి జరిగిన దారుణ ఘటన కాదంది. అధికారుల నిర్లక్ష్యం వల్ల జరిగిదని వ్యాఖ్యానించింది. రెడ్ జోన్లో ఉన్న సిగాచి పరిశ్రమలో ప్రమాదం జరిగితే పది పన్నెండు డిపార్ట్మెంట్స్ ఆఫీసర్లు దర్యాప్తు చేయాల్సివుంటే, ఫ్యాక్టరీ శాఖ మాత్రమే దర్యాప్తు చేయడంపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసింది, కార్మిక శాఖ, పరిశ్రమల శాఖ, పర్యావరణ శాఖ, కాలుష్య శాఖ మొదలైన శాఖల అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించింది. అధికారులు తనిఖీలు నిర్వహించి ఉంటే 54మంది ప్రాణాలు పోయేవి కావని అభిప్రాయపడింది. పరిమితికి మించి పేలుడు పదార్థాలు ఉన్నా పట్టించుకోలేదని, 90 మంది పనిచేయాల్సిన చోట 50మందే పని చేశారంది. అధికారుల నిర్లక్ష్యం కనబడుతోందని, ఇలాంటి వాళ్లపై వేటు వేస్తేనే పరిస్థితి దారికి వస్తుందని చెప్పింది. ఇతర అధికారులకు కూడా సరైన సంకేతం పంపినట్లు అవుతుందని కూడా చెప్పింది. అధికారులు కొందరిపై వేటు వేస్తేగానీ మిగతావాళ్లు దారికి రారంది. అధికారులు ఇచ్చిన జవాబులతో అసంతృప్తిని వ్యక్తం చేసింది. ఈనెల 30న జరిగే విచారణ సమయంలో హైకోర్టు లేవనెత్తే ప్రశ్నలకు జవాబులతో రావాలని ఆదేశించింది. ఫ్యాక్టరీ మేనేజిమెంట్ ప్రకటించిన పరిహారం చెల్లింపు వివరాలు సమర్పించేందుకు కొంత సమయం కావాలని సిగాచీ కంపెనీ కోరింది. ఇందుకు హైకోర్టు అనుమతిచ్చింది. పటాన్చెరు మండలం పాశమైలారం పారిశ్రామికవాడలోని సిగాచి పరిశ్రమలో జూన్ 30న సంభవించిన ఘోర పేలుడు ప్రమాదంలో 54 మంది మతి చెందగా, 28మంది గాయపడ్డారని, 8 మంది ఆచూకీ ఇంకా లభించాల్సి ఉందని హైదరాబాద్ స్నేహపురి కాలనీకి చెందిన రిటైర్డ్ సైంటిస్ట్ కె బాబురావు దాఖలు చేసిన పిల్ను చీఫ్ జస్టిస్ అపరేశ్కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ డివిజన్ బెంచ్ మంగళవారం మరోసారి విచారించింది. గతంలో హైకోర్టు ఆదేశించిన మేరకు విచారణకు. డీఎస్పీ ప్రభాకర్, ఇన్స్పెక్టర్ విజయ్కృష్ణ, పరిశ్రమలశాఖ డిప్యూటీ ఇన్స్పెక్టర్ గౌరీ శంకర్ కోర్టుకు హాజరయ్యారు. బాధితులు, ప్రత్యక్ష సాక్షులతో పాటు, ఫ్యాక్టరీల శాఖ, రెవెన్యూ, అగ్నిమాపక, మున్సిపల్, విద్యుత్, పిసిబి, కార్మిక, ఎఫ్ఎస్ఎల్ నిపుణుల ఘటనా స్థలాన్ని పరిశీలించారని ప్రభుత్వం తరపున ఏఏజీ టి.రజనీకాంత్రెడ్డి చెప్పారు. హైకోర్టు కల్పించుకుని అధికారుల తనిఖీలపై డీఎస్పీని ప్రశ్నించింది. గత డిసెంబర్లో పరిశ్రమల శాఖ ఇన్స్పెక్టర్ తనిఖీలు నిర్వహించినట్లు రెడ్డి జవాబు చెప్పగా, ఇతర శాఖలు ఏం చేస్తున్నాయని ప్రశ్నించింది. ప్రమాదకర రెడ్ జోన్లోని పరిశ్రమల్లో పదుల సంఖ్యలో శాఖలు ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలన్న నిబంధన అమలు కాలేదని అభిప్రాయపడింది. మార్గదర్శకాలు, చట్టాలు అనేకమున్నా అధికారులు వాటిని పాటించని తప్పుపట్టింది. ఈ కారణంగానే అమాయక కార్మికుల ప్రాణాలు పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేసింది. ఫ్యాక్టరీ మేనేజిమెంప్ట చార్జిషీట్ దాఖలు చేస్తారని, నిర్లక్ష్యం వహించిన అధికారులపై ఏం చర్యలు తీసుకుంటారని ప్రశ్నించింది. కోర్టుకు సహకరించడానికి అమికస్ క్యూరీగా డొమినిక్ ఫెర్నాండేజ్ను నియమించింది. ఘటనకు సంబంధించిన వివరాలు, పత్రాలను ఆయనకు సమర్పించాలని రిజిస్ట్రీని ఆదేశిస్తూ, విచారణను డిసెంబర్ 30కి వాయిదా వేసింది.

# ఉచిత ప్రయాణం పథకానికి రెండేళ్లు పూర్తి

పథకం ప్రారంభం నుంచి ఇప్పటీ వరకు 251.11 కోట్ల ఉచిత ప్రయాణాలు
మహిళలకు రూ.8497.52 కోట్ల రవాణా ఛార్జీల ఆదా

ప్రజాపక్షం/హైదరాబాద్ : మహాలక్ష్మి పథకం కింద ఆర్‌టిసిలో మహిళలకు ఉచిత ప్రయాణం పథకం విజయవంతంగా 2 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. ఈ పథకాన్ని సిఎం ఎ.రేవంత్‌రెడ్డి 2023 డిసెంబర్ 9వ తేదీన అసెంబ్లీ ప్రాంగణంలో మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభించగా, సంస్థ ఈ పథకాన్ని 48 గంటల్లోనే అమలు చేసింది. ఈ పథకం ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటి వరకు 251.11 కోట్ల మహిళా ప్రయాణికులు ఈ పథకాన్ని వినియోగించుకున్నారు. రూ.8497.52 కోట్ల రవాణా ఛార్జీలను ఆదా చేసుకున్నారు. ఈ మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం సంస్థకు తిరిగి చెల్లిస్తుంది. ఈ పథకం కింద సంస్థలోని మొత్తం బస్సులలో 81 శాతం ఉన్న పల్లెవెలుగు (3255), ఎక్స్‌ప్రెస్, (1865), సిటీ ఆర్డినరీ(1818),సిటీమెట్రో ఎక్స్‌ప్రెస్,(1031) బస్సులలోని మొత్తం (7969) బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని అందిస్తోంది. మహాలక్ష్మి పథకానికి ముందు, రోజుకు వరకు ప్రయాణికుల సంఖ్య 45.49లక్షలు ఉండగా పథకం ప్రారంభమైననాటి నుంచి రోజువారిగా 14.98 లక్షల (33 శాతానికి)కు పెరిగి రోజుకు సగటున 60.47లక్షలకు చేరింది. గతంలో బస్సుల్లో మొత్తం ప్రయాణికులలో మహిళా ప్రయాణికుల శాతం సుమారు 40శాతం ఉండగా, పథకం అమలుతో ఇప్పుడు అది 67.35 శాతానికి పెరిగింది. మహాలక్ష్మి ఉచిత బస్సు పథకం అమలు కారణంగా యాదాద్రి వంటి ప్రధాన ఆలయాలు వృద్ధిలో ముందున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దేవాలయాలకు యాత్రికుల సంఖ్య 80 శాతం పెరగడమే కాకుండ ఆలయ ఆదాయం 40శాతం పెరిగింది. తెలంగాణ దేవాదాయ శాఖ ఆదాయం 2023లో దాదాపు రూ.370 కోట్ల ఉండగా 2024 లో రూ.544 కోట్లకు పెరిగింది. అదేవిధంగా ఉచిత ప్రయాణం కారణంగా మహిళలు ఇప్పుడు మెరుగైన ప్రభుత్వ ఆరోగ్య సేవలను అందుకుంటున్నారు. గ్రామీణ బాలికలు ఇప్పుడు బస్సులలో ఉచితంగా ప్రయాణించడం ద్వారా తమకు నచ్చిన విద్యా సంస్థలలో చదువుకుంటున్నారు. మహిళలు పట్టణాలు, నగరాల్లో కూరగాయలు, పండ్లను లాభదాయకమైన ధరలకు అమ్ముకునే ఆవకాశం కల్గడంతోబస్సులలో ఉచిత ప్రయాణానికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

మహాలక్ష్మి పథకం

| కాలం | ప్రయాణికులు (కోట్లు) | జీరో టిక్కెట్ల |
|---|---|---|
| డిసెంబర్'23నుండి మార్చి 24 | 33.54 | 1163.07 |
| ఏప్రిల్'24 నుండి మార్చి'25 | 124.79 | 4122.79 |
| ఏప్రిల్ 25 నుండి 08.12.2025 | 92.78 | 3211.66 |
| **మొత్తం** | **251.11** | **8497.520** |

## నేడు నుంచి హైదరాబాద్ రోడ్లపైకి 65 ఎలక్ట్రిక్ బస్సులు

రాణిగంజ్ డిపోలో ప్రారంభించనున్న టిజిఎస్‌ఆర్‌టిసి



ప్రజాపక్షం/హైదరాబాద్ : హైదరాబాద్ రోడ్లపై నేటి నుంచి 65 కొత్త ఎలక్ట్రిక్ బస్సులు పరుగులు పెట్టనున్నాయి. ఈవీట్రాన్స్ సంస్థ నిర్వహణలో నడిచే ఈ బస్సులను రాణిగంజ్ డిపోలో కేంద్ర మంత్రి జి కిషన్ రెడ్డి, రవాణా శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్‌లు మంగళవారం ఉదయం 10 గంటలకు ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి, ఆర్‌టిసి సిఎండి వై.నాగిరెడ్డి, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు అనధికార ప్రజా ప్రతినిధులు పాల్గొనున్నారు. నగరంలో రోజు రోజుకు పెరిగిపోతున్న కాలుష్యాన్ని తగ్గించాలనే లక్ష్యంతో ఆర్‌టిసి వివిధ రూట్లలో ఎలక్ట్రిక్ బస్సులను నడుపుతోంది. ఇందులో భాగంగానే మరో 65 ఎలక్ట్రిక్ బస్సులను అందుబాటులోకి తీసుకువస్తున్నారు.

## కెసిఆర్ అంటే పోరాటం..

బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు



ప్రజాపక్షం/హైదరాబాద్ : కెసిఆర్ దీక్ష ఫలితంగానే డిసెంబర్ 9 ప్రకటన వచ్చిందని బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే టి. హరీశ్ రావు అన్నారు. కెసిఆర్ దీక్షనే లేకపోతే డిసెంబర్ 9 అర్ధరాత్రి చిదంబరం ప్రకటన వచ్చేదా? అని ప్రశ్నించారు. కెసిఆర్ దీక్ష, అమరుల త్యాగ ఫలితమే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావమన్నారు. బిఆర్‌ఎస్ పార్టీ కార్యాలయం తెలంగాణ భవన్‌లో మంగళవారం విజయ్ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హరీశ్ రావు తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాలకు పూలమాలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం హరీశ్ రావు మాట్లాడుతూ కెసిఆర్ అంటే పోరాటం, కెసిఆర్ అంటే త్యాగం అన్నారు. రేవంత్ అంటే వెన్నుపోటు, రేవంత్ అంటే ద్రోహం అని విమర్శించారు. డిసెంబర్ 9 అనేది చరిత్ర పుటల్లో సువర్ణాక్షరాలతో లిఖించదగిన రోజు అన్నారు. నవంబర్ 29న దీక్షా దివస్ జరిపామని, నవంబర్ 29 లేకపోతే డిసెంబర్ 9 తెలంగాణ ప్రకటన లేదన్నారు. డిసెంబర్ 9 లేకపోతే జూన్ 2 రాష్ట్ర అవతరణ దినోత్సవం లేదన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఈ 3 రోజులు చాలా కీలకమైనవని తెలిపారు. నిమ్స్‌లో కెసిఆర్ 11 రోజులు ఆమరణ దీక్ష చేశారని, కెసిఆర్ దీక్ష ఫలితం డిసెంబర్ 9న ప్రకటన వచ్చిందన్నారు. తెలంగాణ ఉద్యమం, భావోద్వేగాల మధ్య పుట్టిన తల్లి తెలంగాణ తల్లి అన్నారు. తెలంగాణ తల్లిని ఊరూరా ప్రజలే పెట్టుకున్నారన్నారు. తెలంగాణ ఉద్యమంలో పుట్టిన తల్లిని మార్చే హక్కు రేవంత్‌కు లేదన్నారు. తెలుగు పిల్లలను జైళ్లలో వేసినందు ట్రంప్ పేరు పెడతావా?, మన దేశాన్ని ఇబ్బంది పెట్టి వ్యాపార సంస్థలు మూతపడి, పిల్లల ఉద్యోగాలు ఊడగొట్టినందుకు ట్రంప్ పేరు పెడుతావా? అని ప్రశ్నల వర్షం కురిపించారు. హైదరాబాద్ పిల్లలు ఉద్యోగాలు రాక అమెరికాలో నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యార్థులకు ట్రంప్ ఫీజులు పెంచారని హరీశ్ రావు అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపి బోయినపల్లి వినోద్ కుమార్, ఎమ్మెల్సీ బండ ప్రకాష్, మాజీమంత్రి మహమూద్ అలీ, మాజీ ఎమ్మెల్యే క్రాంతి, రావుల చంద్రశేఖర్ రెడ్డి, నాయకులు కిషోర్ గౌడ్, బాల్‌రాజ్ తదితరులు ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## మెస్సీ ఫుట్ బాల్ మ్యాచ్ ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి వాకిటి



ప్రజాపక్షం/హైదరాబాద్: ఈ నెల 13న ఉప్పల్ స్టేడియంలో మెస్సీ ఫుట్ బాల్ మ్యాచ్ నేపథ్యంలో మంత్రి వాకిటి శ్రీహరి ఎస్‌ఎటిజి ఛైర్మన్ శివసేనా రెడ్డి ఏర్పాట్లను మంగళవారం పరిశీలించారు.స్టేడియం మొత్తం తిరిగి పరిశీలించి అధికారులకు మంత్రి పలు సూచనలు చేశారు. పోలీసు అధికారులతో భద్రత ఏర్పాట్లపై చర్చించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిజి చారుసిన్హా,జాయింట్ కమీషనర్ జోయేల్ డేవిస్ స్పోర్ట్స్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## దేవాదాయ శాఖ సిబ్బందిని అభినందించిన మంత్రి కొండాసురేఖ



ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025లో దేవాదాయ శాఖ తరఫున పని చేసి... సేవలు అందించిన స్టేట్ ఎండోమెంట్ డిపార్టుమెంట్ సిబ్బందిని రాష్ట్ర మంత్రి కొండా సురేఖ అభినందించారు. ఎండోమెంటు కమిషనర్ హరీష్ నేతృత్వంలోని పని చేసిన సిబ్బందిని మంగళవారం ప్యానెల్ డిస్కషన్ తర్వాత ప్రత్యేకంగా అభినందించారు. రానున్న రోజుల్లో సైతం ఇదే విధంగా బాగా పని చేసి డిపార్టుమెంటుకు మంచి పేరు తీసుకు రావాలని మంత్రి సురేఖ సూచించారు. అయితే, మంత్రి ఆత్మీయతకి... ఎండోమెంట్ కమిషనర్ హరీష్‌తో పాటు సిబ్బందికి మంత్రి కృతజ్ఞతలు తెలిపారు.

# ఆరేళ్ళలో 29 మంది మావోయిస్టు అగ్రనేతల నిర్మూలన

ఈ ఒక్క ఏడాదిలోనే 14 మంది కాల్చివేత
దేశంలో 11 జిల్లాల్లోనే వామపక్ష తీవ్రవాదం
లోక్‌సభలో ప్రభుత్వం ప్రకటన

న్యూఢిల్లీ: దేశంలో 2019 నుండి 29 మంది మావోయిస్టుపార్టీ అగ్రనాయకులను తటస్థీకరించి వారి నుండి ఎలాంటి బెడదా లేకుండా నిర్మూలించినట్లు కేంద్ర ప్రభుత్వం మంగళవారం లోక్‌సభకు తెలియజేసింది. దేశంలో 126 జిల్లాలకు విస్తరించిన మావోయిస్టుల తీవ్రవాద కార్యకలాపాలను నిర్మూలించి ప్రస్తుతం 11 జిల్లాలకు మాత్రమే పరిమితం చేశామని హోంశాఖ సహాయమంత్ర నిత్యానంద్ రాయ్ లోక్‌సభ ప్రశ్నోత్తరాల సమయంలో చెప్పారు. ప్రస్తుతం దేశంలో కేవలం మూడే మూడు జిల్లాలో చాలా ఉద్ధృతంగా వామపక్ష తీవ్రవాద కార్యకలాపాలు జరుగుతున్నాయన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో హోంమంత్రి అమిత్ షా విజయవంతమైన మార్గదర్శకత్వంలో దేశంలో వామపక్ష తీవ్రవాదాన్ని 2026 మార్చి నాటికి సంపూర్ణంగా నిర్మూలిస్తామని అన్నారు. 2014 నుండి 2025 అక్టోబరు నెల వరకూ దేశంలో మావోయిస్టుల తీవ్రవాద కార్యకలాపాలు 50 శాతం మేరకు తగ్గాయన్నారు. వారి కార్యకలాపాలను పది రాష్ట్రాల నుండి ఐదు రాష్ట్రాలకు పరిమితం చేసినట్లు చెప్పారు. దీంతో రాష్ట్రాలలో 91 శాతం మేరకు వామపక్ష తీవ్రవాదం తగ్గుముఖం పట్టిందని చెప్పారు. దేశవ్యాప్తంగా ఈ ఒక్క ఏడాదిలోనే మావోయిస్టు కేంద్ర కమిటీ నాయకులను, పొలిట్ బ్యూరో సభ్యులను 14 మందిని నిర్మూలించామని లోక్‌సభకు తెలియజేశారు. దేశంలో 2018 ఏప్రిల్ నాటికి 126 జిల్లాలలో వామపక్ష తీవ్రవాద కార్యకలాపాలు జరిగేవని, 2021 జులై నాటికి అరికట్టి ఈ జిల్లాల సంఖ్యను 90 కి తీసుకు వచ్చామని, 2024 ఏప్రిల్ నాటికి మరిన్ని చర్యలు తీసుకోవడం ద్వారా మావోయిస్టు తీవ్రవాదుల కార్యకలాపాలను 70 జిల్లాలకు మాత్రమే పరిమితం చేశామని, ఈ ఏడాది ఏప్రిల్ నాటికి వారి కార్యకలాపాలు కేవలం 38 జిల్లాలకు మాత్రమే పరిమితం చేశామని కేంద్రమంత్రి చెప్పారు. తదుపరి ఆరునెలల్లో అంటే 2025 అక్టోబరు నాటికి మావోయిస్టు తీవ్రవాదుల కార్యకలాపాలు 11 జిల్లాలకు మాత్రమే పరిమితమయ్యాయని చెప్పారు. ఐతే ఇటీవలికాలంలో మావోయిస్టుల తీవ్రవాదం నుండి విముక్తి చేసిన ప్రాంతాలలో తిరిగి వారు తలెత్తకుండా నివారణ చర్యలు కూడా తీసుకుంటున్నామన్నారు. ఈ చర్యల్లో భాగంగా 27 జిల్లాలను భద్రతకు సంబంధించిన వ్యయాల పథకం (ఎస్‌ఆర్‌ఇ) కిందకు తీసుకువచ్చామని, ఈ జిల్లాల్లో ఎప్పటికప్పుడు తనిఖీ, పర్యవేక్షణలు జరుగుతూ ఉంటాయన్నారు. ''గతంలో ప్రభుత్వాలు వామపక్ష తీవ్రవాదాన్ని రాష్ట్రాల సమస్యగా చెప్పేవి, ఎందుకంటే కేంద్రంలోని గత ప్రభుత్వాలు ఈ తీవ్రవాదాన్ని నిర్మూలించడానికి ఎలాంటి సమగ్ర ఏకీకృత నిర్మాణాత్మక విధానాన్నీ రూపొందించలేదు, కానీ మోదీ ప్రభుత్వం మాత్రం ఒక సమగ్ర, సమర్థవంతమైన విధానం రూపొందించింది, ఈ తీవ్రవాదాన్ని నిర్మూలించాలని కేంద్ర ప్రభుత్వంకృతనిశ్చయం తీసుకుని ఈవిధానం రూపొందించింది, రాష్ట్రాలలో ఉన్న ప్రభుత్వాలసహాయంతో చాలా విజయవంతంగా దీనిని అమలు చేస్తున్నాం'' అని మంత్రి నిత్యానంద్ రాయ్ చెప్పారు.

## పార్లమెంటు సెంట్రల్ హాలులో టిఎంసి మౌన నిరసన

న్యూఢిల్లీ: 'వందేమాతరం'పై చర్చ సందర్భంగా బెంగాల్ స్వాతంత్ర్య సమరయోధులకు బిజెపి చేసిన అవమానాన్ని వ్యతిరేకిస్తూ తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి చెందిన లోక్‌సభ–రాజ్యసభ ఎంపీలు మంగళవారం పార్లమెంటు సెంట్రల్ హాలులో మౌన నిరసన ప్రదర్శన చేశారు. బెంగాలీ స్వాతంత్ర్య సమరయోధులు రవీంద్రనాథ్ టాగోర్, బంకించంద్ర ఛటర్జీలకు బిజెపి సోమవారంనాడు 'వందేమాతరం' గేయంపై చర్చ సందర్భంగా అవమానం చేసినందుకు వారు నిరసన తెలియజేశారు. సంవిధాన్ సదన్ సెంట్రల్ హాలులో టాగోర్, బంకించంద్ర ఛటర్జీల చిత్రపటాలవద్ద నిలబడి టిఎంసి ఎంపీలు మౌనంగా నిరసన తెలియజేశారు. ఆ తర్వాత వారు సంవిధాన్ సదన్ గేటు వద్ద నిలబడి నిరసన తెలియజేశారు. 'వందేమాతర గీతం' 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా లోక్‌సభలో సోమవారం రోజంతా చర్చ జరిగింది. ఈ చర్చ సందర్భంగా బిజెపి నాయకులు బెంగాలీ యోధులపట్ల అగౌరవంగా మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ చర్చను ప్రారంభించారు. బెంగాలీ యోధుల కీర్తి ప్రతిష్ఠలకు భంగం కలిగించేందుకు బిజెపి నాయకులు పార్లమెంటులో ప్రయత్నం చేశారని టిఎంసి రాజ్యసభ ఉపనాయకుడు సాగరిక ఘోష్ అన్నారు. బెంగాలీ సంస్కృతిని, బెంగాలీ నాయకులను బిజెపి అవమానించిందని విమర్శించారు.

# అదంతా యూరప్ 'మూర్ఖత్వం' పుతిన్ కార్యాలయం విమర్శ

మాస్కో: పూర్వపు సోవియట్ యూనియన్‌ను పునరుద్ధరించేందుకు రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రయత్నం చేస్తున్నారని యూరోపియన్ యూనియన్ చేసిన ఆరోపణలను క్రెమ్లిన్ కార్యాలయం తోసిపుచ్చింది. ఈ మేరకు ద్మిత్రీ పెస్కోవ్ ఒక ప్రకటన చేశారు. ఈ ఆరోపణలపై ఆయన తీవ్రంగా స్పందిస్తూ, అదంతా యూరోపియన్ యూనియన్ ''సంపూర్ణ మూర్ఖత్వం'' అని కొట్టిపారేశారు. పూర్వపు సోవియట్ యూనియన్‌లోని రిపబ్లిక్స్ అన్నీ వేరు వేరు దేశాలుగా విడిపోయి స్వాతంత్ర్య పొందాయి. ఉక్రేన్ కూడా ఈ రిపబ్లిక్‌లలో ఒకటి. ఉక్రేన్‌లో రష్యా సాంస్కృతిక, చారిత్రక, భాషాపరమైన వారసత్వ మూలాలు ఉన్నాయని పుతిన్ వాదిస్తున్నారు. ఈ చారిత్రక మూలాలు ఉన్న ప్రాంతాలలో నివసించే ప్రజలు తిరిగి రష్యాతో మమేకం అవ్వాలని కోరుకుంటున్నారని, ఆ ప్రాంతాలు రష్యాకు చెందుతాయన్న పుతిన్ వాదనలను ప్రస్తుతం 'ట్రంప్ ప్రతిపాదించిన శాంతి ఒప్పందం'పై జరుగుతున్న సంవాదానికి ముడిపెట్టి యూరోపియన్ యూనియన్ ఈ ఆరోపణలు చేసింది. 1991లో జరిగిన సోవియట్ యూనియన్ పతనం 20వ శతాబ్దపు అతిపెద్ద వినాశకరమైన చర్య అని పుతిన్ తొలుత అన్నారు. ఆయన పాలనాకాలం చివరిలో ఈ పరిస్థితి వచ్చింది. ఇదంతా పూర్తిగా ఆర్థిక స్తబ్ధతకు, ఆయన వైఫల్యాలకు చిహ్నంగా ఉంటుందని ప్రత్యర్థులు విమర్శలు చేశారు. ఉక్రేన్‌పై పుతిన్ ఒకవేళ విజయం సాధిస్తే అది ఏదో ఒకరోజు నాటో సభ్యదేశంపై కూడా దాడులకు దారితీస్తుందని యూరోపియన్ యూనియన్ ఆరోపించింది. ఈ ఆరోపణలను ద్మిత్రీ పెస్కోవ్ తోసిపుచ్చారు.

## బిఆర్ఎస్ పాలనలోనే గ్రామాల అభివృద్ధి

### మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి

**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్ :** బిఆర్ఎస్ పాలనలోనే గ్రామాల అభివృద్ధి జరిగిందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని తాళ్ళఖమ్మంపహాడ్ గ్రామంలో సర్పంచ్ అభ్యర్థిగా పార్టీ బలపర్చిన మండవ వీరాంజనేయులను గెలిపించాలని కోరుతూ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ హయాంలోనే గ్రామాల అభివృద్ధి జరిగిన అభివృద్ధి తప్ప కొత్తగా చేసిందేమి లేదన్నారు. కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేల వల్లనే ఏ అభివృద్ధి జరగడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో తిరిగి బిఆర్ఎస్ పార్టీయే అధికారంలోకి రానున్నదని జోస్యం చెప్పారు. అందుకే గ్రామ పంచాయితీ ఎన్నికల్లో బిఆర్ఎస్ బలపర్చిన సర్పంచ్, వార్డు సభ్యులను ప్రజలు గెలిపించుకోవాలని కోరారు. స్థానిక ఎన్నికల్లో అంతా ఏకమై కాంగ్రెస్‌కు కర్రుకాల్చి వాత పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్‌పిటిసి జీడి బిక్షం, రఫీతోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## మరణించిన వ్యక్తి అవయవాల దానం

**ప్రజాపక్షం/మోటకొండూరు :** ఈనెల 4న కాటేపల్లి గ్రామానికి చెందిన పల్లపు ప్రశాంత్ (27) రాయగిరి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో వైద్యులు బ్రెయిన్ డెడ్ అయినట్లు ప్రకటించారు. మానవతా విలువలను నిలబెట్టుతూ ప్రశాంత్ కుటుంబ సభ్యులు ఆయన అవయవాలను జీవందాన్ సంస్థకు అందజేశారు. ఈ మహోన్నత నిర్ణయం మరో కొంత మందికి కొత్త జీవితం అందించింది. మృతుడికి భార్యతో పాటు ముగ్గురు





చిన్న పిల్లలు ఉన్నారు.

## మనస్తాపంతో విద్యార్థిని ఆత్మహత్య



**ప్రజాపక్షం/నలగొండ టౌన్ :** పట్టణంలోని రవీందర్ నగర్ బిసి ఈ హాస్టల్‌లో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థిని శృతి ఇంట్లో పెళ్లిచూపులు జరుగుతున్న నేపథ్యంలో తీవ్రమైన మనస్తాపం చెంది ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన నల్లగొండ పట్టణంలో చోటు చేసుకుంది. మృతురాలు కొత్తల మర్రిగూడెం గ్రామానికి చెందిన శృతిగా గుర్తించారు. ఉన్నత చదువులు కొనసాగించాలని కోరుకున్న శృతికి పెద్దలు పెళ్లి నిర్ణయంతో మనస్థాపానికి గురి అయ్యిందని స్థానికులు ఆరోపణలు చేస్తున్నారు. శృతి హాస్టల్లో స్నానానికి వెళ్లి బాత్రూంలో చాలా సేపు బయటికి రాకపోవడంతో తోటి విద్యార్థులకు అనుమానంతో తలుపు తెరిచిన హాస్టల్ విద్యార్థులు విషాద దృశ్యం చూసి హాస్టల్ సిబ్బంది, తోటి విద్యార్థులు షాక్ అయ్యారు. సమాచారం అందుకున్న టూ టౌన్ ఎస్ఐ సైదులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## భారీ శబ్దంతో పేలిన ట్యాంక్



**ప్రజాపక్షం/చివ్వేంల :** భారీ శబ్ధంతో ట్యాంక్ పేలిన సంఘటన చివ్వేంల మండలంలోని బీబీగూడెం శివారులో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బీబీగూడెం సమీపంలోని బాలాజీ లైటేవెయిట్ బ్రిక్స్ కంపెనీలో పీడన ఫోమ్ తయారీ ట్యాంక్ ఒక్కసారిగా భారీ శబ్ధంతో పేలిపోయిందని తెలిపారు. దాంతో దాని చుట్టూ ఉన్న కంపెనీకి సంబంధించిన నిర్మాణాలు దెబ్బతిన్నాయి. ఆ సమయంలో కార్మికులు గాని, చుట్టు పక్కల జనాలు గాని ఆ ప్రాంతంలో లేకపోవడంతో ఎటువంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. ఇటువంటి ప్రమాదకరమైన యూనిట్లు జనావాసాల మధ్య ఉండడం ఎప్పటికైనా ప్రమాదమేనని ఈ ప్రాంతం నుండి కంపెనీని తరలించాలని ప్రజలు కోరుతున్నారు.

## ఇంట్లో చోరీ... మూడు తులాల బంగారం అపహరణ



**ప్రజాపక్షం/మునుగోడు:** ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని దొంగలు ఇంట్లోకి దూరి మూడు తులాల బంగారం పదివేల రూపాయలు దొంగలించిన సంఘటన మంగళవారం మునుగోడు మండల కేంద్రంలో శివాలయం పక్కన చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన దొమ్మటి రామకృష్ణ పని నిమిత్తం ఇద్దరు భార్యాభర్తలు వ్యవసాయ పనులకు వెళ్ళగా తిరిగి మూడు గంటల ప్రాంతంలో ఇంటికి వచ్చేసరికి ఇంట్లో వస్తువులు చిందరవందరగా పడి ఉండడానికి గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలాన్ని స్థానిక ఎస్సై ఇరుగు రవి పరిశీలించారు. అనంతరం క్లూస్ టీం ఆధారాలను సేకరించారు.. ఇట్టి విషయంపై కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన పొనుగోడు గ్రామ శివారులో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని అప్పన్నపేట గ్రామానికి చెందిన జలగం సిద్దయ్య (45) అనే వ్యక్తి మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కల్టివేటర్ తగిలి తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన సిద్దయ్యను 108 సాయంతో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయినట్లు తెలిపారు. చీకట్లో ట్రాక్టర్ డ్రైవర్ ఆజాగ్రత్తగా నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని పలువురు ఆరోపిస్తున్నారు. సిద్దయ్య అప్పన్నపేట గ్రామ పంచాయతీ ఎన్నికల్లో 7వ వార్డు సభ్యుడి అభ్యర్థిగా పోటీ చేస్తున్నాడు. ఊహించని విధంగా రోడ్డు ప్రమాదంలో సిద్దయ్య చనిపోవడంతో గ్రామస్తులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

## అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం



**ప్రజాపక్షం/నార్కట్ పల్లి :** గ్రామల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమౌతుందని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా మంగళవారం నార్కెట్‌పల్లి మండలంలోని ఏనుగుల దోరీ గ్రామ కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి రేగట్టె రజితవెంకట్ గోపాల్ రెడ్డి, బ్రాహ్మణవెల్లంల గ్రామ సర్పంచ్ అభ్యర్థి చిరుమర్తి ధర్మయ్య,చౌడంపల్లి గ్రామ సర్పంచ్ అభ్యర్థి దామెర సుధ నవీన్, కొండపాకగూడెం గ్రామ సర్పంచ్ అభ్యర్థి తిరుగుడు నాగేశ్, చిన్ననారయణపురం గ్రామ సర్పంచ్ అభ్యర్థి మోరుగు అనిత సత్తయ్యలకు, వార్డు సభ్యులకు మద్దతుగా ప్రచారాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పున్న కైలాష్ నేత,మండల పార్టీ అధ్యక్షులు బత్తుల ఉషయ్య,జిల్లా నాయకులు బండ సాగర్ రెడ్డి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా విజయ్ దివస్

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** విజయ్ దివాస్ సందర్భంగా బిఆర్ఎస్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి చౌరస్తా నుండి అమరవీరుల స్తూపం వరకు ర్యాలీగా వెళ్లి అమరవీరులకు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో భువనగిరి మాజీ శాసనసభ్యులు పైళ్ల శేఖర్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ చరిత్రలో డిసెంబర్ 9 ఎంతో ప్రాముఖ్యత కలిగిన రోజు అని కెసిఆర్ ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి అప్పటి ప్రభుత్వం మెడలు వంచి తెలంగాణను ప్రత్యేక రాష్ట్రంగా ప్రకటింప చేసుకొని విజయం సాధించిన సందర్భంగా ఈ రోజున విజయ్ దివాస్‌గా చేసుకుంటున్నామని, అదేవిధంగా ఈ రాష్ట్ర సాధన కోసం అసువులు బాసిన అమరవీరులందరినీ స్మరించుకొని వారికి నివాళులర్పించడం మన బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ నాయకులు, బిఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# పకడ్బందీగా పంచాయతీ ఎన్నికలు

### కలెక్టర్ ఇలా త్రిపాఠి

**ప్రజాపక్షం/నలగొండ :** గ్రామపంచాయతీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మంగళవారం ఆమె కనగల్ మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల సామాగ్రిని, బ్యాలెట్ పేపర్లను, పోలింగ్ బాక్సులను పరిశీలించారు. అలాగే సాయిరాం ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను సందర్శించి అక్కడ కావలసిన పోలింగ్ మెటీరియల్ పంపిణీ ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో కావాల్సిన సామాగ్రిని పోలింగ్ కేంద్రం వారిగా వేరు చేసి సిద్ధంగా ఉంచాలన్నారు. ఓటరు జాబితా వివరాలు సరిగా ఉన్నాయో లేదో తనిఖీ చేసుకోవాలన్నారు. బ్యాలెట్ పత్రాలు జాగ్రత్తగా చెక్ చేసి ప్యాక్ చేయాలని తెలిపారు. బ్యాలెట్ బాక్స్‌లు అన్ని ఓపెన్ అవుతున్నాయో లేదో చెక్ చేసుకోవాలని, డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుండి పోలింగ్ కేంద్రం చేరుకొని ఓటింగ్ నిర్వహణ ఏర్పాట్లను మరోసారి నిర్ధారణ చేసుకోవాలన్నారు. సిబ్బంది రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, వారికి ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం కల్పించాలని, చివరిగా ఉన్న పోలింగ్ కేంద్రాలకు ముందుగా బస్సులను పంపించాలని చెప్పారు. జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య, జడ్‌పి సీఈఓ శ్రీనివాసరావు, ఆర్‌డిఓ వై.అశోక్ రెడ్డి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శేఖర్ రెడ్డి, తహసిల్దార్ పద్మ, ఎంపీడీవో వేద రక్షిత, ఎంఈఓ పద్మ కలెక్టర్ వెంట ఉన్నారు.

**మూడవ విడత ర్యాండమైజేషన్**

మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్న పోలింగ్ కేంద్రాలలో విధులు నిర్వహించే సిబ్బందికి సంబంధించిన మూడవ విడత



ర్యాండమైజేషన్ కార్యక్రమాన్ని మంగళవారం జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో గ్రామపంచాయతీ ఎన్నికల జిల్లా సాధారణ పరిశీలకురాలు, కొర్రా లక్ష్మీ సమక్షంలో, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించడం జరిగింది. నల్లగొండ, చండూరు డివిజన్లలోని 14 మండలాలలో మొదటి విడతగా 2870 పోలింగ్ కేంద్రాలలో మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. ఇందుకుగాను పిఓ, ఓపిఓలు రెండవ ఓపిఓ మొత్తం కలుపుకొని 7892 మందిని విధులు నిర్వహించే విధంగా రాండమైజేషన్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఇందులో పిఓలు 3444, ఓపిఓలు 4448 మంది ఈ ర్యాండమైజేషన్‌లో ఆయా పోలింగ్ కేంద్రాలకు సిబ్బందిని కేటాయించారు. ఈ కార్యక్రమానికి స్థానిక సంస్థల ఇంచార్జి అదనపు కలెక్టర్ నారాయణ అమిత్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య, జెడ్‌పి సీఈఓ శ్రీనివాసరావు, ఆర్‌డిఓ వై.అశోక్ రెడ్డి, కలెక్టర్ కార్యాలయ ఏఓ మోతిలాల్, ఈడియం దుర్గారావు, ఎన్ఐసి అధికారులు ప్రేమ్, తదితరులు హాజరయ్యారు.

# నెహ్రూ చరిత్రను చెరిపేయడం అసాధ్యం

### పార్లమెంట్‌లో తెలుగులో మాట్లాడుతూ అందరిని ఆకట్టుకున్న ఎంపి చామల




**ప్రజాపక్షం/యాదాద్రి భువనగిరి :** లోక్‌సభ శీతాకాల సమావేశాల సందర్భంగా 'వందేమాతరం' జాతీయ గేయంపై జరిగిన చర్చను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజా సమస్యల నుండి ప్రజల దృష్టిని మరల్చడానికి వాడుకుంటోందని భువనగిరి కాంగ్రెస్ ఎంపి చామల కిరణ్ కుమార్‌రెడ్డి తీవ్రంగా ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలపై, ముఖ్యంగా ప్రజా సమస్యలను విస్మరించడంపై ఆయన తెలుగులో మాట్లాడుతూ విమర్శలు గుప్పించారు. 'వందేమాతరం' గీతాన్ని రచించి 150 ఏళ్లు అవుతున్న సందర్భంగా రాబోయే తరాలకు స్ఫూర్తిని అందించడానికి బదులు, ఈ చర్చను ప్రతిపక్షాలను నిందించడానికి కేంద్రం వినియోగిస్తోందని ఎంపీ విమర్శించారు. దేశ ప్రథమ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చరిత్రను చెరిపివేయాలని చూడటం అసాధ్యమని కిరణ్‌కుమార్‌రెడ్డి గట్టిగా చెప్పారు. 'నెహ్రూ దేశానికి మొదటి ప్రధాని ఆయన పంచవర్ష ప్రణాళికలు, ఐఐటీలు, ఐఐఎంలు, స్టీల్ ప్లాంట్లు, బీహెచ్‌ఈఎల్, ఇక్రిశాట్, ఎల్ఐసీ లాంటి సంస్థలు నెలకొల్పారు. రైతుల కోసం భాక్రానంగల్, నాగార్జున సాగర్ లాంటి ప్రాజెక్టులను కట్టిన నెహ్రూ చరిత్రను చెరిపివేయగలరా?' అని ఆయన ప్రశ్నించారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 'తెలంగాణ రైజింగ్'లో భాగంగా గ్లోబల్ సమ్మిట్ ఏర్పాటు చేశారని, త్రీ ట్రిలియన్ ఎకానమీ లక్ష్యంగా ముందుకు వెళ్తున్నారని తెలిపారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వాలు ఉన్న రాష్ట్రాలకే కాకుండా, అన్ని రాష్ట్రాలకు నిధులు, ప్రాజెక్టులు కేటాయించాలని కేంద్రాన్ని సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీకి వచ్చి ప్రధానమంత్రి మోదీని, కేంద్ర మంత్రులను కలిసి ట్రిపుల్ ఆర్, మెట్రో రెండవ పేజ్, మూసీ పునరుజ్జీవం గురించి చర్చించారని వెల్లడించారు. వికసిత్ భారత్‌తో పాటు తెలంగాణ రైజింగ్‌ను కలిపి ముందుకు తీసుకువెళ్లాలని ఆయన ఆకాంక్షించారు. రాజకీయాలు, కులాలు, మతాల మధ్య చిచ్చు పెట్టడం ద్వారా దేశానికి నష్టం జరుగుతుందని కిరణ్ కుమార్ రెడ్డి హెచ్చరించారు.

# పోస్టల్ బ్యాలెట్ సద్వినియోగం

### కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** గ్రామ పంచాయితీ ఎన్నికల్లో భాగంగా రెండు, మూడు విడతలలో విధులకు నియమించబడిన ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి తేజస్ నందలాల్ పవార్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. రెండవ విడత అనంతగిరి, చిలుకూరు, చివ్వెంల, కోదాడ, మోతె, మునగాల, నడిగూడెం, పెన్‌పహాడ్ మండలాల్లో ఎన్నికలు జరగనున్నాయని తెలిపారు. ఇందుకు సంబంధించి అక్కడ విధులు నిర్వహించేందుకు నియమించబడిన ఉద్యోగులు ఈనెల 7 నుండి 10 వరకు ఆయా మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రాలలో పోస్టల్ బ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు. అలాగే మూడవ విడత ఎన్నికలు జరిగే చింతలపాలెం, గరిడేపల్లి, హుజూర్‌నగర్, మఠంపల్లి, మేళ్ళచెర్వు, నేరేడుచర్ల, పాలకీడు మండలాలలో విధులు నిర్వహించేందుకు నియమించబడిన ఉద్యోగులు ఈనెల 10, 12, 13, 15 తేదీలలో పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. ఎన్నికలకు నియమించబడిన ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం ఉపయోగించుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు.

# వలిగొండలో స్వీప్ -2025 ఓటర్‌పై అవగాహన




కలెక్టర్ హనుమంతరావు

**ప్రజాపక్షం/వలిగొండ :** ఓటర్లు తమ ఓటు హక్కును డబ్బుకు, మద్యానికి, తదితర వసతులకు లోబడకుండా సరైన నాయకులను ఎంచుకోవాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు ఓటర్లకు సూచించారు. మంగళవారం గ్రామ పంచాయితీ ఎన్నికల్లో భాగంగా రెండవ విడత ఎన్నికలు జరగనున్న వలిగొండ మండల కేంద్రంలో గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో స్వీప్ 2025 ఓటర్ అవగాహన, చైతన్య కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ హనుమంతరావు ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఎన్నికలు డబ్బులు, మద్యానికి, బిర్యాని ప్యాకెట్లకు, ఇతర కానుకలకి కాకుండా స్వచ్ఛందంగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఇటీవల బొమ్మలరామారం మండలంలో ఈ అవగాహన కార్యక్రమం చేపట్టిన తర్వాత జలాల్ పూర్ గ్రామస్థులు స్వచ్ఛంధంగా వాళ్ళ ఇండ్ల ముందు మద్యానికి, డబ్బులకు ఓటును అమ్ముకోము అని బోర్డులు ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ మార్పు అనేది ఎవరో ఒకరి దగ్గర నుండి అని కాకుండా నా ఇంటి నుండి మొదలు అవ్వాలని అనుకోవాలని తెలిపారు. ఒక మంచి నాయకులను ఎన్నుకుంటే రానున్న 5 సంవత్సరాలలో మీ గ్రామ అభివృద్ధి ఆధారపడి ఉంటుందని తెలిపారు. గ్రామ ఓటర్లు అవగాహన కార్యక్రమాలకు స్పందించి తమ ఓటును గ్రామాల అభివృద్ధి కొరకు కృషి చేసే నాయకులను ఎంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# మొదటి విడత ఎన్నికల నిర్వహణకు సంసిద్ధం

### జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు రవి నాయక్

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** సూర్యాపేట జిల్లాలో మొదటి విడత గ్రామ పంచాయితీ ఎన్నికల నిర్వహణకు సంసిద్ధంగా ఉన్నట్లు గ్రామ పంచాయితీ ఎన్నికల జిల్లా సాధారణ పరిశీలకులు రవి నాయక్ రాష్ట్ర ఎన్నికల కమీషనర్ రాణికుమిదినికి తెలిపారు. మంగళవారం రాష్ట్ర ఎన్నికల కమీషనర్ రాణికుముదిని హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్‌పిలు, గ్రామ పంచాయితీ ఎన్నికల పరిశీలకులతో గ్రామ పంచాయితీ ఎన్నికలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యాపేట జిల్లా సాధారణ ఎన్నికల పరిశీలకులు రవి నాయక్ మాట్లాడుతూ సూర్యాపేట జిల్లాలో మొదటి విడతన ఎన్నికలకు సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రతిరోజు తాను నామినేషన్ కేంద్రాలను, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను పరిశీలించానని, ఎన్నికల సందర్భంగా అవసరమైన సమావేశాల నిర్వహణ, ప్రవర్తన నియమావళి అమలు, రూట్స్ అన్నింటిని పరిశీలించినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి తేజస్ నందలాల్ పవార్ మాట్లాడుతూ మొదటి విడతన సూర్యాపేట జిల్లాలో 8 మండలాల్లో, 152 గ్రామ పంచాయితీలకు ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎన్నికల ఏర్పాట్లలో భాగంగా ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాలు, రిసెప్షన్ కేంద్రాలను పర్యవేక్షించడం జరిగిందన్నారు. పోలింగ్ సిబ్బందిని నియమించి ఉత్తర్వులు జారీ చేశామని, ఈనెల 10న మరోసారి డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను తనిఖీ చేస్తామని వివరించారు. పోలింగ్ రోజున రిపోర్టులు పంపించేందుకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బృందాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పోలింగ్ తర్వాత కౌంటింగ్‌కు అవసరమైన ఏర్పాట్లు, ఉపసర్పంచ్ ఎన్నికలకు సైతం



ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. జిల్లా ఎస్‌పి నరసింహ మాట్లాడుతూ మొదటి విడత గ్రామ పంచాయితీ ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేశామని వెల్లడించారు. గ్రామ పంచాయితీ ఎన్నికల జిల్లా వ్యయ పరిశీలకులు హుస్సేన్, జిల్లా పంచాయితీ అధికారి యాదగిరి, జడ్‌పి సిఈఓ వివి అప్పారావు, ఎక్సైజ్ సూపరింటిండెంట్ లక్ష్మ ణ్ నాయక్ ఉన్నారు.

## ఎన్నికల నిర్వహణకు పటిష్ఠ భద్రత

### ఎస్‌సి శరత్ చంద్ర పవార్



**ప్రజాపక్షం/నలగొండ టౌన్:** జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా సాగేలా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా జిల్లా పోలీసు యంత్రాంగం పటిష్ఠ బందోబస్తు ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా ఎస్‌సి శరత్ చంద్ర పవార్ వెల్లడించారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా పరిధిలో మూడు దశల్లో 869 గ్రామ పంచాయతీల్లో జరిగే ఎన్నికలకు ఒక అడిషనల్ యస్పి, ఆరుగురు డియస్పిలు, 23 మంది సీఐలు 84 మంది ఎస్ఐలతో కలిపి 1680 మందితో పటిష్ఠ భద్రత ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. ముఖ్యంగా జిల్లా వ్యాప్తంగా 442 గ్రామపంచాయతీలను సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి ప్రతీ పోలింగ్ స్టేషన్ పరిధిలో అదనపు బలగాలు, స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్, రూట్ మొబైల్ పార్టీ అదనంగా పర్యవేక్షిస్తుంది. ఎలాంటి ఇబ్బంది లేదా సమస్య తలెత్తినా అక్కడికక్కడే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నాం అన్నారు. ఓటర్లను ప్రలోభ పెట్టే విధంగా ఎవరైనా నగదు, మద్యం, ఇతరత్రా వస్తువులను ఎవరైనా పంపిణీ చేస్తున్నట్లు తెలిస్తే వెంటనే డయల్ 100కి సమాచారం అందజేయాలని కోరారు. ఎన్నికల నియమావళి ప్రకారం పోలీసులు చేపట్టే చర్యలను అతిక్రమిస్తే అట్టి వారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

## కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి



ఎమ్మెల్యే మందుల సామేల్


**ప్రజాపక్షం/అర్వపల్లి :** కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులను ప్రజలు ఆశీర్వదించి గెలిపించాలని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ ఓటర్లను కోరారు. మొదటి విడత ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని అర్వపల్లి, జాజిరెడ్డిగూడెం, తిమ్మాపురం, అడివెంల, కాసర్లపాడు గ్రామాల్లో ప్రచార కార్యక్రమాలలో పాల్గొని మాట్లాడారు. గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని నన్ను ఆదరించినట్లు ప్రజలు పార్టీ సర్పంచ్‌లను, వార్డు సభ్యులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి మాజీ చైర్మన్ వీరవల్లి సోమిరెడ్డి, సామ అభిషేక్‌రెడ్డి, గుడిపల్లి మధుకర్ రెడ్డి, ఇందుర్తి వెంకటరెడ్డి, జీడి వీరస్వామి, కొరపిడత అవిలయ్య, బైరబోయిన మహారాజు ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు, అభ్యర్థులు పాల్గొన్నారు.

## పల్లె ప్రగతి కాంగ్రెస్‌తోనే సాధ్యం



**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్ :** కాంగ్రెస్ పార్టీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. మండలంలోని యర్కారం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థి కుంటిగొర్ల శ్రీనివాస్ యాదవ్ గెలుపును కాంక్షిస్తూ గ్రామంలో నిర్వహించిన ప్రచారంలో వారు పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్‌తోనే పల్లె ప్రగతి సాధ్యమవుతుందని, గ్రామాల్లో మౌళిక సదుపాయాలతోపాటు అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ పార్టీ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థులను గెలిపించుకోవాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుండి గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తుందని గుర్తు చేశారు. దేశంలో ఎక్కడలేని విధంగా ప్రజలకు సన్నబియ్యం అందిస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందన్నారు. కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులను గెలిపించేందుకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ




**ప్రజాపక్షం/యాదాద్రి :** జిల్లా కలెక్టరేట్ కార్యాలయాల ఆవరణంలో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని మంగళవారం జిల్లా అటవీశాఖాధికారి పద్మజారాణి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జేపీసీ చైర్మన్ మందడి ఉపేందర్ రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ అధికారి జగన్మోహన్ ప్రసాద్, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సూర్యాపేట సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయ ప్రాంగణంలో మంగళవారం తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జయ జయహే తెలంగాణ గీతాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, మెప్మా మహిళలు, ఆశా వర్కర్లు, జిల్లా అధికారులు పాల్గొని తెలంగాణ తల్లి విగ్రహానికి పుష్పాలు వెదజల్లారు.

## దూసుకుపోతున్న సిపిఐ సర్పంచ్ అభ్యర్థి ప్రచారం

**ప్రజాపక్షం/వలిగొండ :** వలిగొండ మండల పరిధిలోని గోపురాజ్‌పల్లి సిపిఐ, బిఆర్ఎస్ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి సలిగంజి వీరస్వామి బ్యాట్ గుర్తుకి ఓటు వేసి గ్రామ అభివృద్ధికి సహకరించాలని అంతేకాకుండా గ్రామ అభివృద్ధికి నా వంతు కృషి చేస్తానని గ్రామంలోని సమస్యలను ప్రతి ఒకటి పరిష్కరిస్తానని అన్నారు. ప్రజలు బ్యాట్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు కీసర సత్తిరెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు పోలేపల్లి రమేష్, సంగిశెట్టి ప్రభాకర్, మండిపల్లి వెంకన్న, పాలకూర్ల తదితరులు పాల్గొన్నారు.



# క్రీడ



పృథ్వీ షా, సర్ఫ రాజ్ ఖాన్.. 75 లక్షల బేస్ ప్రైజ్‌పై వేలంలో నిలిచారు. ఇక ఆసీస్ ప్లేయర్ కెమరూన్ గ్రీన్, జేక్ ఫ్రేజర్ మెక్‌గార్క్, కివీస్ ప్లేయర్ డేవాన్ కాన్వే, సౌతాఫ్రికా బ్యాటర్ డేవిడ్ మిల్లర్ 2 కోట్ల బేస్‌ప్రైజ్‌పై లిస్టులో ఉన్నారు. తాజాగా జరిగిన సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 ట్రోఫీలో అత్యధిక రన్స్ చేసిన కునాల్ చండేలా, వికెట్లు తీసిన అశోక్ కుమార్ 2 కోట్ల బేస్‌ప్రైజ్‌లో ఉన్నారు. కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టు ఈసారి

## 2026 ఐపిఎల్ కోసం

# ఆటగాళ్ల వేలం..

**తుది జాబితాలో 350 మంది క్రికెటర్లు**

2026 ఐపిఎల్ సీజన్‌కు ఈ నెల 16వ తేదీన ఆటగాళ్ల వేలం జరగనున్నది. ఆ వేలంలో సుమారు 350 క్రికెటర్లు పాల్గొననున్నారు. దాంట్లో 240 మంది భారతీయ క్రికెటర్లు ఉన్నారు. టీ20 క్రికెట్ లీగ్ కోసం అబుదాబిలో వేలం జరగనున్నది. సౌతాఫ్రికా బ్యాటర్ క్వింటన్ డీకాక్.. వేలం తుది లిస్టులో చేరాడు. వన్డే రిటైర్మెంట్ నుంచి వెనక్కి వచ్చిన అతను.. తాజా భారత్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో పాల్గొన్న విషయం తెలిసిందే. కోటి బేస్‌ప్రైజ్‌పై అతను అందుబాటులో ఉన్నాడు. ఆసీస్ బ్యాటర్ స్టీవ్ స్మిత్ కూడా 2 కోట్ల బేస్‌ప్రైజ్‌పై వేలానికి రెఢీ అయ్యాడు. 2021లో చివరి సారి స్టీవ్ స్మిత్ ఐపీఎల్ ఆడాడు. వాస్తవానికి ఐపిఎల్ ప్లేయర్ ఆక్షన్ కోసం 1390 మంది రిజిస్టర్ చేసుకున్నారు. దాంట్లో నుంచి 350 మందిని షార్ట్‌లిస్ట్ చేశారు. తొలి సెట్‌లో భారత బ్యాటర్ల ప్లేయర్ల కోసం 64.3 కోట్లతో వేలంలో పాల్గొననున్నది. అయిదు సార్లు టోర్నీ గెలిచిన చెన్నై జట్టు 43.4 కోట్లతో , సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు 25.5 కోట్ల పర్స్‌మనీతో వేలంలో పాల్గొననున్నాయి. ఈసారి వేలం కోసం 21 మంది ఇంగ్లాండ్ క్రికెటర్లు పోటీపడుతున్నారు. వికెట్ కీపర్, బ్యాటర్ జేమీ స్మిత్, గస్ అట్కిన్‌సన్, లివింగ్‌స్టోన్, బెన్ డక్కెట్ రేసులో ఉన్నారు.

ఆస్ట్రేలియాకు చెందిన 19 మంది ఆటగాళ్లకు వేలంలో పాల్గొంటున్నారు. దాంట్లో గ్రీన్ టాప్ లిస్టులో ఉన్నారు. జోష్ ఇంగ్లిష్, షార్ట్, కూపర్ కొన్నలీ, వెబ్‌స్టర్ కూడా ఉన్నారు. 15 మంది దక్షిణాఫ్రికా ఆటగాళ్లలో డీకాక్, మిల్లర్ ఉన్నారు. ఫాస్ట్ బౌలర్లు నోర్జే, లుంగి ఎంగిడి, గెరాల్డ్ కోయిట్జ్, ముల్డర్ ఉన్నారు. వెస్టిండీస్‌కు చెందిన అల్జారీ జోసెఫ్, షామర్ జోసెఫ్, అకీమ్ అగస్టీ, షాయ్ హోప్, రోస్టన్ చేజ్‌తో పాటు 9 మంది ఉన్నారు. శ్రీలంక క్రికెటర్లలో హసరంగ, దునిత్ వెల్లలగే, తీక్షణ, ట్రావీన్ మాథ్యూ, నిషాంక, కుశాల్ మెండిస్, పెరీరా ఉన్నారు.

కాన్వే, రవీంద్రతో పాటు 16 మంది కివీస్ క్రికెటర్లు వేలంలో ఉన్నారు. ఆఫ్ఘనిస్తాన్‌కు చెందిన గుర్బాస్, నవీన్ ఉల్ హక్‌తో పాటు మొత్తం 19మంది ప్లేయర్లు వేలం జాబితాలో ఉన్నారు.

# భారత్ ఘన విజయం



వన్డే సిరీస్ విజయోత్సాహాన్ని టీ20లోనూ కొనసాగిస్తూ ఘనంగా బోణీ కొట్టింది భారత్. బరాబతి స్టేడియంలో దక్షిణాఫ్రికాను 101 పరుగుల తేడాతో చిత్తుచిత్తుగా ఓడించింది. హార్దిక్ పాండ్యా(59 నాటౌట్, 1–16) ఆల్‌రౌండ్ షోకు.. అక్షర్ పటేల్(23, 2–7) మెరుపులు తోడవ్వగా సఫారీ టీమ్ 74కే ఆలౌటయ్యింది. పొట్టి క్రికెట్‌లో ప్రొటీస్‌కు ఇదే అత్యల్ప స్కోర్ కావడం విశేషం. టీ20ల్లో తమకు తిరుగులేదని నిరూపించిన సూర్య కుయార్ బృందం ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 1–0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. టీ20 ప్రపంచకప్ ఛాంపియన్ భారత జట్టు జోరు కొనసాగుతోంది. ఇటీవలే ఆస్ట్రేలియా గడ్డపై సిరీస్ గెలుపొందిన సూర్యకుమార్ సేన.. స్వదేశంలోనూ వేట మొదలెట్టింది. మంగళవారం బరాబతి స్టేడియంలో దక్షిణాఫ్రికాను బెంబేలెత్తించిన టీమిండియా 101 పరుగుల తేడాతో జయకేతనం ఎగురవేసింది. ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టిన భారత్.. 12.3 ఓవర్లలోనే మ్యాచ్ ముగించి సిరీస్‌లో ముందంజ వేసింది.

### అర్షదీప్ మొదలెట్టగా..

కటక్ బరాబతి స్టేడియంలో భారీ స్కోర్ చేసిన భారత జట్టు.. ప్రత్యర్థిని వణికించింది. తొలి ఓవర్లోనే వికెట్ తీసిన పేసర్ అర్షదీప్ సింగ్(2–14).. తన రెండో ఓవర్లోనూ వికెట్ అందించాడు. ఫామ్‌లో ఉన్న క్వింటన్ డికాక్(0)ను డకౌట్ చేశాడు అర్షదీప్. డికాక్ ఆడిన బంతి ఎడ్జ్ తీసుకోగా స్లిప్‌లో అభిషేక్ క్యాచ్ అందుకున్నాడు. అనంతరం రెండు ఫోర్లు బాదిన ట్రిస్టన్ స్టబ్స్(14)ను సైతం ఔట్ చేసి సఫారీలను దెబ్బతీశాడీ యంగ్‌స్టర్. దాంతో.. 16 పరుగులకే రెండు బిగ్ వికెట్లు కోల్పోయింది సఫారీ జట్టు. అంతకుముందు బుమ్రా ఓవర్లో మర్క్‌రమ్(14)కు లైఫ్ లభించింది. అతడు సిక్సర్ కొట్టాలనుకున్న బంతిని బౌండరీ వద్ద శివం దూబే పైకెగిరి అందుకొని.. రోప్ తగిలేలోపు బయటకు విసిరేశాడు.

స్టబ్స్ వికెట్ పడడంతో క్రీజులోకి వచ్చిన డెవాల్డ్ బ్రెవిస్ (22).. తనస్టయిల్లో చెలరేగాడు. వరుణ్ చక్రవర్తి ఓవర్లో 4,6 బాదిన బ్రెవిస్ స్కోర్ 40 దాటించాడు. అయితే.. ఆరో ఓవర్లో తొలి బంతికే మర్క్‌రమ్ లెగ్ స్టంప్‌ను ఎగరేశాడు అక్షర్ పటేల్. అంతే.. 40కే మూడు వికెట్లు పడ్డాయి. పవర్ ప్లేలో 3 వికెట్ల నష్టానికి సఫారీ టీమ్ 45 రన్స్ చేసింది. పాండ్యా మొదటి బంతికే డెవిడ్ మిల్లర్(1)ను.. డేంజరస్ డొనోవాన్ ఫెరీరా(5)ను వరుణ్ ఔట్ చేయగా 50కే ఐదు వికెట్లు కోల్పోయింది. తన ఓవరలో సిక్సర్ బాదిన మార్కో యాన్సెన్‌ను వరుణ్ బౌల్డ్ చేయగా మ్యాచ్ పూర్తిగా టీమిండియా చేతుల్లోకి వచ్చింది. బుమ్రా ఓవర్లో బ్రెవిస్ మిడాన్‌లో సూర్యకు దొరికిపోగా.. సఫారీల ఓటమి ఖాయమైంది. చివరి బ్యాటర్ మహరాజ్()ను దూబే ఔట్ చేయగా సఫారీ టీమ్ 74కే కుప్పకూలింది.

### పాండ్యా హాఫ్ సెంచరీ

పునరాగమనం మ్యాచ్‌లో హార్దిక్ పాండ్యా(59 నాటౌట్) రెచ్చిపోయాడు. ఇటీవలే స్మాట్‌లో మెరుపులు మెరిపించిన పాండ్యా.. తొలి టీ20లో దక్షిణాఫ్రికాపైనే చెలరేగాడు. క్రీజులోకి వచ్చీరాగానే ఈ ఆల్‌రౌండర్ ఫోర్లు, సిక్సర్లు బాదేయగా టీమిండియా భారీస్కోర్ చేసింది. పవర్ ప్లేలో లుంగి ఎంగిడి(3–31) విజృంభణతో కష్టాల్లో పడిన జట్టును ఓపెనర్ అభిషేక్ శర్మ(17), తిలక్ వర్మ(26)లు ఆదుకున్నారు. వీరిద్దరి తర్వాత అక్షర్ పటేల్(23) జతగా పాండ్యా చితక్కొట్టాడు. చివరి ఓవర్లో 12 రన్స్ పిండుకోవడంతో ప్రత్యర్థికి 176 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది టీమిండియా.

# ఫోకస్ మహిళ



తీవ్రమైన మానసిక వ్యథ 'ట్రామా' కేసులు ఇటీవల కాలంలో పెరుగుతున్నాయని, ముఖ్యంగా మహిళల్లో ఈ సమస్య ఎక్కువగా ఉందని వివిధ నివేదికలు, గణాంకాలు పేర్కొంటున్నాయి. వెలుగులోకి వస్తున్న కేసుల కంటే, తాము ట్రామాతో బాధపడుతున్నామని తెలియకుండానే కుంగిపోతున్న మహిళలు ఎక్కువగా ఉన్నారన్న అభిప్రాయం కూడా ప్రచారంలో ఉంది. మానసిక ఆందోళన, భావోద్వేగాలతో కూడుకున్న ట్రామా గురించిన అవగాహన ఉంటే, దాని పరిష్కారం సాధ్యమవుతుంది. జీవితం మెరుగుపడుతుంది. వైద్య శాస్త్ర నిపుణులను అనుసరించి, చాలా మంది మహిళలు చిన్ననాటి లోతైన భావోద్వేగ గాయాలు గుర్తించరు. మరో రకంగా చెప్పాలంటే, నిర్లక్ష్యం చేస్తారు. అయితే, అవి దశాబ్దాల పాటు వారి జీవితాలను ప్రభావితం చేస్తూనే ఉంటాయి. ఎక్కువ కాలం చికిత్స చేయించుకోకుండానే, జీవితాలు గడిచిపోతుంటాయి. ఏదైనా ఒక సంఘటన లేదా బలమైన ఒత్తిడే 'ట్రామా'కు కారణమవుతుందనే అభిప్రాయం చాలా మందిలో ఉంది.

# పెరుగుతున్న ట్రామా సమస్య!

కానీ, అన్ని సందర్భాల్లోనూ ఈ సూత్రం వర్తించదు. ఆదరణ లభించకపోవడం, తాను ఉంటున్న ప్రాంతం సురక్షితమైనది కాదనే అభిప్రాయం, ప్రేమను పొందలేకపోవడం వంటి అనేకానేక అంశాలు ట్రామాను ప్రేరేపించే అవకాశం ఉంది. అందుకే చాలామంది మహిళలు బయట ప్రపంచంలో సమర్థులుగా కనిపిస్తున్నా, తమతమ రంగాల్లో రాణిస్తున్నా, అంతర్గతంగా ఆందోళనలు, ఒంటరితనం, అభద్రతా భావం వంటి సమస్యలతో సతమతమవుతుంటారు. ఈ విధంగా బయటపడని ఐదు రకాల రహస్య ట్రామా నమూనాలు ఉన్నాయని నిపుణులు పేర్కొంటున్నారు.

### 1. భావోద్వేగ మూర్ఛ

భావోద్వేగ మూర్ఛలో ఉన్న వ్యక్తులు బయటికి ఎలాంటి సమస్యలు లేనివారిగా కనిపించినా, లోపల ఒక ఖాళీ గోడలా అనుభూతి చెందుతారు. ఇది చిన్ననాట భావాలను వ్యక్తం చేయడం సురక్షితం కాకపోవడం వల్ల ఏర్పడుతుంది. బాధను వ్యక్తం చేయకపోవడం వల్ల అది మాత్రమే కాదు, ఆనందం, ప్రేమ, తృప్తి కూడా కోల్పోతారు.

### 2. బలహీనత భయం

చిన్నతనంలో అకారణంగా నిందలకు, శిక్షలకు లేదా నిర్లక్ష్యానికి గురైన వారు పెద్దయ్యాక కూడా అవే భావాలను దాచుకుంటారు. దీని వల్ల ఇతరులతో వారి సంబంధాలు లోతైనవిగా కాకుండా, నామమాత్రంగా మాత్రమే ఉంటాయి. చాలా మంది ఈ స్వభావాన్ని సిగ్గుగా భ్రమపడుతుంటారు. కానీ, ఇతి అంతర్గతంగా అత్యంత తీవ్రమైన అభద్రతా భావానికి, చిన్నతనంలో ఎదురైన అనుభవాలకు దర్పణం.

### 3. బరువు–బాధ్యతలు

చాలా మంది మహిళలు చిన్నతనం నుంచే ఏదో ఒక విధానంలో బరువుబాధ్యతలు మోస్తూ ఉంటారు. తల్లికి ఇంటి పనిలో సాయం చేయడం నుంచి కుటుంబాన్ని పోషించడానికి ఏదో ఒక ఆదాయ మార్గాన్ని ఎంచుకోవడం వరకూ ఎన్నో రకాలుగా శ్రమిస్తుంటారు. ఒక రకంగా చెప్పాలంటే, వీరే తల్లిదండ్రులు నిర్వర్తించాల్సిన బాధ్యతలను తన భుజాలపై వేసుకుంటారు. అందరికీ సాయం చేస్తారు. కానీ, తమకు ఎవరైనా సాయం చేయడానికి ముందుకొస్తే ఒప్పుకోరు. దీనిని కారుణ్యం.. ఆత్మాభిమానం కలగలసిన గుణంగా భావించడం సహజం. కానీ, ఈ రకంగా వ్యవహరిస్తున్న వారు చిన్నతనం నుంచి అలాంటి పరిస్థితులను ఎదుర్కొన్న వారే. ఆలోచనలను మార్చుకోకపోతే, జీవితమంతా బాధ్యతలతోనే గడుస్తుంది.. బాధ్యలతోనే ముగుస్తుంది.

### 4. పరిపూర్ణతావాదం

కొంతమంది మహిళలు 'పర్‌ఫెక్షనిస్ట్' అనిపించుకునే ప్రయత్నంలో మునిగిపోతారు. ప్రతి పనీ పరిపూర్ణంగా ఉండాలన్నది వారి అభిప్రాయంగా అంతా భావిస్తారు. కానీ, నిజానికి వారు ఎక్కువగా అభద్రతాభావానికి గురవుతూ ఉంటారు. రక్షణ యంత్రాంగాన్ని సిద్ధం చేసుకునే ప్రయత్నంలో, పనులను అత్యంత జాగ్రత్తగా చేయాలనే తపన మొదలవుతుంది. తప్పులు అంగీకరించని లేదా షరతులు నచ్చని గుణం ఇలాంటి వారిలో ఎక్కువ. తీవ్రమైన కట్టుబాట్ల మధ్య పెరిగిన వారికి ఈ గుణం ఉంటుంది. ఫలితంగా వీరిలో విమర్శనాత్మక స్వభావం, విపరీతమైన జాప్యం, మానసిక అలసట వంటి లక్షణాలు పెరుగుతాయి.

### 5.భయం.. ఆందోళన

ప్రతి విషయానికీ భయపడడం, ఆందోళన చెందడం వంటి లక్షణాలు కూడా చిన్ననాటి నుంచి అంతర్గతంలో గూడుకట్టుకున్న ఫోబియాల కారణంగా ఉత్పన్నమైనవే. అప్పట్లో ఎదురైన అనుభవాలు వారి మస్తిష్కంలో నిక్షిప్తమై ఉంటాయి. వాటి ప్రభావం వారి ఆలోచనలపై ఉంటుంది. వారి ప్రవర్తనను నియంత్రిస్తుంది. అభద్రతాభావమే ఆందోళనకు మూలం. ట్రామా ఎలాంటిదైనా, నిపుణుల పర్యవేక్షణలో, సరైన వైద్య విధానం ద్వారా నయం చేసుకోవచ్చని వివిధ అధ్యయనాలు చెప్తున్నాయి. వ్యక్తిగతంగా ఉన్న దాచుకున్న ట్రామా నమూనాను గుర్తించడం ద్వారా చికిత్స ప్రారంభం అవుతుంది. చాలా మంది మహిళలు నిక్షిప్తమై ఉన్న ఐదు లక్షణాల్లో ఒకటి కంటే ఎక్కువ లక్షణాలను కలిగి ఉంటారు. ఒకసారి తమ సమస్యను అర్థం చేసుకోగలిగితే, ఎన్నో ఏళ్లుగా కూడిన భారాలు తగ్గిపోతాయి, భద్రత, అనుబంధం, స్వీయ అంగీకారం తిరిగి లభిస్తాయి. సోమాటిక్ థెరపిస్ట్ లేదా ట్రామాఇన్ఫార్మ్‌డ్ కోచ్‌ని సంప్రదించి, వారు సూచించే పద్ధతులను అవలంభించి చాలా వరకు సమస్యల నుంచి బయటపడవచ్చు. వ్యక్తిగత ట్రామా ప్యాటర్న్‌ను గుర్తించి, గతాన్ని తిరిగి అనుభవించకుండానే, చికిత్సకు ఒక స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ను సూచించే నిపుణులు కూడా అందుబాటులో ఉంటారు. వారిని సంప్రదించడం అవసరం.

## 23 నుంచి ఎఐఎస్ఎఫ్

# పెద్దపల్లి జిల్లా 4వ మహాసభలు

**కరపత్రాన్ని ఆవిష్కరించిన సదానందం, ప్రీతం**



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** ఎఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా సమితి ఆధ్వర్యంలో ఈనెల 23,24,25 తేదీలలో జరగబోయే ఎఐఎస్ఎఫ్ పెద్దపెల్లి జిల్లా నాలుగోవ మహాసభలను విజయవంతం చేయాలని మహాసభల కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమానికి సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎఐఎస్ఎఫ్ జిల్లా నిర్మాణ బాధ్యులు తాండ్ర సదానందం, ఎఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం హాజరై మాట్లాడారు. ఉద్యమాలే ఊపిరిగా పోరాటాలే ప్రాణంగా విద్యారంగ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా చదువుతూ పోరాడుతాం చదువుకై పోరాడుతాం అంటూ అలుపెరుగని పోరాటాలు నిర్వహిస్తూ దేశంలోనే అతిపెద్ద విద్యార్థి నిర్మాణాత్మక సంఘంగా ఎఐఎస్ఎఫ్ ఉన్నదన్నారు. విద్యారంగాన్ని విస్మరిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విద్యార్థి లోకం సరైన బుద్ధి చెప్పాలని, రానున్న రోజుల్లో ఎఐఎస్ఎఫ్ ఇచ్చే పిలుపులకు విద్యార్థి లోకం తరలి రావాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సాయి ఆజాద్, నాయకులు మాతంగి సాగర్, పల్లె హర్ష, అనిల్, శివ ,శ్రీరామ్, రాజు పాల్గొన్నారు.

# ధాన్యం సేకరణలో రైతులను నిలువు దోపిడీ చేస్తున్న మిల్లు వ్యాపారులు

**సప్తగిరి ఇండస్ట్రీస్ మిల్లు అవకతవకలపై విచారణ**

**సిపిఐ కరీంనగర్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ డిమాండ్**



**ప్రజాపక్షం/జమ్మికుంట :** రైతుల నుంచి ధాన్యం సేకరణలో జమ్మికుంట సప్తగిరి మిల్లులో చేస్తున్న నిలువు దోపిడీ, అవకతవకలపై ఉన్నతస్థాయిలో విచారణ జరపాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం జమ్మికుంట పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పంజాల శ్రీనివాస్ మాట్లాడారు. ప్రభుత్వ ధాన్యం కొనుగోళ్లలో భాగంగా రైతుల ద్వారా ఐకెపి కేంద్రాల నుంచి సేకరించిన వడ్లను అలాట్ మెంట్ చేసిన జమ్మికుంట సప్తగిరి ఇండస్ట్రీస్ మిల్లులో దోపిడీకి పాల్పడుతూ, సదరు మిల్లు వ్యాపారి లబ్దిపొందుతున్నాడని ఆరోపించారు. ఒక్కో రైతుల నుంచి 10, 20, 30 ఇలా క్వింటాళ్ల వ్యత్యాసం చూపించి సదరు మిల్లు వ్యాపారి దోపిడీకి పాల్పడ్డారన్నారు. రైస్ మిల్లుల వ్యాపారులు ప్రభుత్వాన్ని, అధికారులను శాసించే విధంగా వ్యవహరించినా చర్యలు లేకపోవడం దురదృష్టకరమన్నారు. సప్తగిరి ఇండస్ట్రీస్ రైస్‌మిల్లు వ్యాపారి ధాన్యం కేటాయింపుల విషయంలో అధికారులకు సరైన పూచీకత్తులు ఇవ్వకున్నా దందా యథేచ్ఛగా సాగించాడని, వందలాది మంది రైతుల వద్ద నుంచి పెద్దమొత్తంలో జరిగిన ఈదోపిడీని రికవరీ చేయాలని, ఈ విషయమై అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఐ జమ్మికుంట మండల కార్యదర్శి గజ్జి ఐలయ్య, వీణవంక మండల కార్యదర్శి రాంగోపాల్, సమ్మయ్య పాల్గొన్నారు.

# శాసనసభ ఫలితాలు పునరావృతం కావాలి

**ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**

**పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం**

**ప్రజాపక్షం/పాల్వంచ :** గ్రామ పంచాయితీ ఎన్నికలలో శాసన ఎన్నికల ఫలితాలు పునరావృతమయ్యే విధంగా ప్రజలు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సిపిఐ రాష్ట కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కోరారు. భద్రాద్రి జిల్లా పాల్వంచ మండల పరిధి నాగారం, రంగాపురం, నాగారం కాలనీ, తోగ్గూడెం, జగన్నాధపురం, బసవతారక కాలని, లక్ష్మీదేవిపల్లి, కొత్త సూరారం, పాత సూరారం, పాండురంగాపురం తండా, ప్రభాత్‌నగర్ తదితర పంచాయతీలలో మంగళవారం కూనంనేని ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సర్పంచ్, వార్డు సభ్యులు , సిపిఐ నాయకుల సమావేశాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్, వార్డు సభ్యులకు మద్దతుగా జరిగిన సభల్లో కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి జరగాలంటే సిపిఐ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులు, వార్డు సభులను గెలిపించాలని కోరారు. ఓటర్లు ప్రలోభావాలకు లొంగకుండా, నిత్యం ప్రజాక్షేత్రంలో ఉండి ప్రజా సమస్యల పట్ల పోరాటం చేస్తున్న సిపిఐ బలపరిచిన అభ్యర్థులను గెలిపించి మరింత అభివృద్ధికి తోడ్పాటునందించాలన్నారు. ప్రచార కార్యక్రమాల్లో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, జిల్లా కార్యవర్గ సబ్యులు, మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, సర్పంచ్ అభ్యర్థులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



**నిజాయితీపరులను ఎన్నుకుంటే గ్రామం అభివృద్ధి : ఎమ్మెల్సీ సత్యం**

**మర్రిగూడ:** నిజాయితీపరులను ఎన్నుకుంటే గ్రామం అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. మంగళవారం నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలో గ్రామపంచాయతీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కుదాబక్షిపల్లి తమ్మడపల్లి గ్రామాల్లో సిపిఐ అభ్యర్థులు చెల్లం పాండురంగారావు, ఎలగలగూడెం గ్రామ పంచాయతీ సిపిఐ అభ్యర్థి సూరిగి యల్లమ్మ, కొరటికల్ గ్రామ సిపిఐ సర్పంచ్ అభ్యర్థి దండు వెంకటరమణ గెలుపు కోసం ప్రచారం నిర్వహించి మాట్లాడుతూ నిత్యం గ్రామంలో ఉంటూ ప్రజలతో మమేకమై ప్రజల సమస్యలు తెలుసుకుంటూ ప్రజల మధ్య ఉంటున్న వారిని ఎన్నుకుంటే గ్రామం అభివృద్ధితో పాటు సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. ప్రచార కార్యక్రమాల్లో మాజీఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు, నాయకులు బూడిద సురేష్, కొట్టం యాదయ్య, బుర్ర శేఖర్, ఈదుల బిక్షంరెడ్డి. ఆకుల రఘుమయ్య, రమేష్, కళ్లెం యాది రెడ్డి, కొట్టం రాజయ్య, నారాయణ, నరసింహ, ఎల్లయ్య, యాదయ్య, రాములు, వెంకటేష్, వెంకన్న, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తీర్పురి వెంకటేశ్వర్లు, మందుల పాండు, ఈదులకంటి కైలాస్, తీర్పారి కృష్ణయ్య, మునుగోటి దయాకర్, కట్కూరి మల్లయ్య, గజ్జల కిషన్, కట్కూరి వెంకన్న, తీర్పారి రామచంద్రం, గోపగోని సైదులు, కట్కూరి లింగస్వామి, మాధగోని విజయ్, ఈదుల కంటి నాగరాజు, శేఖర్, సురిగి పరమేశం, తీర్పారి నరసింహ తదితరులు పాల్గొన్నారు

**సిపిఐతోనే సమస్యలు పరిష్కారం**


**మహబూబాబాద్ :** సిపిఐ బలపరిచిన ముడుపుగల్ గ్రామపంచాయతీ అభ్యర్థి తండా సందీప్ గెలుపు కోరుతూ మంగళవారం గ్రామంలో భారీర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎన్నికల ప్రచారం ముగింపు సభకు సిపిఐ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి బి.విజయ సారథి హాజరై మాట్లాడుతూ సిపిఐ అభ్యర్థులతోనే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. యువకుడైన తండా సందీప్‌ను సర్పంచ్‌గా గెలిపిస్తే గ్రామం అభివృద్ధి జరుగుతుందన్నారు. ప్రచారం కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బి.అజయ్‌సారధిరెడ్డి, పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మి, వీరవెల్లి రవి, వెలుగు శ్రావణ్, మేక వీరన్న, ఆబోతు అశోక్, వంకాయలపాటి చిరంజీవి, కేదాసు రమేష్, వార్డు అభ్యర్థులు అరుణ్ కుమార్, తండా శ్రీనాథ్, తేజావాత్ వినయ్, నేతలు పోలగాని శ్రీను, తండ సతీష్, గుణగంటి శేఖర్, విజయ్ సాయి, గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

**గ్రామ అభివృద్ధి ధ్యేయం**

**ఎల్కతుర్తి:** గ్రామ అభివృద్ధి ధ్యేయంగా, నిజాయితీ లక్ష్యంగా సేవచేయడానికి గోపాల్‌పూర్ ఓటర్లు కర్రె లక్ష్మి బిక్షపతి కత్తెర గుర్తుపై అత్యధిక ఓట్లు వేసి గెలిపించాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి పిలుపునిచ్చారు. మంగళవారం ఎల్కతుర్తి మండలం గోపాలపురం గ్రామంలో కర్రె లక్ష్మి బిక్షపతి విజయం కోసం ప్రచారం చేశారు. మహిళలు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కర్రె లక్ష్మి, కర్రె బిక్షపతి, నేదునూరి రాజమౌళి, మెట్టు శ్యాంసుందర్‌రెడ్డి, కర్రె లక్ష్మణ్, ఊట్కూరి రాములు, ఊట్కూరి ప్రణీత్, కొట్టెపాక రవి, మనోహర్, అల్వాల రాజు, సొం దర్య, ఈశ్వరమ్మ, సంధ్య, బుచ్చమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.







## సర్పంచ్‌లుగా ఏడుగురు

# సిపిఐ అభ్యర్థులు ఏకగ్రీవం

**ప్రజాప్రక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** కొత్తగూడెం నియోజకవర్గ పరిధిలో మొత్తం ఏడు సర్పంచ్ స్థానాలతో పాటు 2–ఇంక్లైన్‌కు చెందిన 8 వార్డుల్లో సిపిఐ అభ్యర్థులు ఏకగ్రీవం అయ్యారు. ఈ ఏడు పంచాయితీల్లో సర్పంచ్‌లు, 2–ఇంక్లైన్ 8 వార్డుల్లో పోటీలో ఉన్న వారు ఉపసంహరించుకోవడంతో ఈ స్థానాలను సిపిఐ దక్కించుకుంది. సుజాతనగర్ మండలం 2–ఇంక్లైన్ గ్రామపంచాయతీ నుండి గుగులోత్ అరుణ, లక్ష్మీదేవిపల్లి మండలం అనిశెట్టిపల్లి గ్రామ పంచాయతీ నుండి కొర్సా వీరబాబు, చుంచుపల్లి మండలం విద్యానగర్ గ్రామ పంచాయతీ నుండి భూక్యా శాంతిశ్రీ, పాల్వంచ మండలం బిక్కు తండా గ్రామపంచాయతీ నుండి భూక్యా ఝాన్సీ, తవిశెలగూడెం గ్రామ పంచాయతీ నుండి జి రమేష్, సంగెం గ్రామ పంచాయతీ నుండి బానోత్ రవి, ఇల్లందుపాటు గ్రామపంచాయతీ నుండి తేజావత్ లక్ష్మి లు సర్పంచ్‌లుగా ఎన్నికయ్యారు.

**2–ఇంక్లై జిపి, వార్డులు క్లీన్ స్వీప్ :** సుజాతనగర్ మండలం పరిధిలోని 2–ఇంక్లైన్ గ్రామపంచాయతీ సర్పంచ్ స్థానంతో పాటు 8 వార్డుల్లో సిపిఐ అభ్యర్థులు ఏకగ్రీవం అయ్యారు. పోటీదారులు తప్పుకోవడంతో సిపిఐ 2–ఇంక్లైన్ గ్రామపంచాయతీలో విజయకేతనం ఎగురవేసింది. ఏకగ్రీవ సర్పంచ్‌లు, వార్డుసభ్యులకు సిపిఐ రాష్టకార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా శుభాకాంక్షలు తెలిపారు.













# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## కాలనీ ప్రాంతాలన్నీ అభివృద్ధి చేస్తున్నా : కార్పొరేటర్



ప్రజాపక్షం/మల్కాజిగిరి : మచ్చ బొల్లారం డివిజన్‌లోని అన్నికాలనీ ప్రాంతాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నానని డివిజన్ కార్పొరేటర్ రాజ్ జితేందర్ తెలిపారు. డివిజన్‌లోని సంజీవరెడ్డి గార్డెన్ సమీపంలోని లక్ష్మి ఎన్‌క్లేవ్ ఫేస్ 2 వద్ద రూ.25 లక్షల వ్యయంతో సిసి రోడ్డు, సెలెక్ట్ టాకీస్ సమీపంలోని అంజనాపూరి కాలనీలో రూ. 23 లక్షల వ్యయంతో సిసి రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ రహదారులు స్థానికులకే కాకుండా నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డు మీదుగా వాహనదారులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు మధుసుధన్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలు, తదితరులు పాల్గొన్నారు.



## వైశ్య సంఘ భవనానికి స్థలమివ్వండి

ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి : ఆర్య వైశ్య సంఘ భవనానికి స్థలం కేటాయించాలని కుత్బుల్లాపూర్ చింతల్ ఆర్య వైశ్య సంఘం కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం వినతిపత్రం సమర్పించింది. చింతల్‌లోని ప్రభుత్వ సర్వే నంబర్ 259లో ఉన్న 40 గుంటల భూమిలో 1500 గజాల స్థలాన్ని కేటాయించాలని జిల్లా కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్ రాధికా గుప్తాను కల్సి కోరిన వారిలో సంఘ అధ్యక్షుడు జూలూరి విజయ్ గుప్తా, ప్రధాన కార్యదర్శి మహంకాళి ప్రభురాజ్‌గుప్తా, కోశాధికారి ఇల్లెందుల కృష్ణకుమార్ గుప్తా, గౌరవ సలహాదారుడు ఇడుకుల కృష్ణకుమార్ గుప్తా, నేతి జగన్నాథం గుప్తా, వీరేందర్ గుప్తా, నారాయణ ప్రసాద్ గుప్తా, తదితరులు ఉన్నారు.

## పోలింగ్ నాడు సెలవు ప్రకటించాలి

జిహెచ్ఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కిషన్



ప్రజాపక్షం/హైదరాబాద్ : గ్రామపంచాయతీ ఎన్నికలలో ఓటు హక్కు ఉన్న ఉద్యోగులు, కార్మికులకు పోలింగ్ రోజు వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలని జిహెచ్ఎంసి కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి కిషన్ మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో కోరారు. ఈనెల 11, 14, 17 తేదీలలో మూడు విడతల్లో గ్రామపంచాయతీ ఎన్నికల పోలింగ్ ఉందన్నారు. ఇప్పటివరకు సెలవుపై రాష్ట్ర ఎన్నికల కమిషన్ కానీ, రాష్ట్ర ప్రభుత్వం కానీ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. జిహెచ్ఎంసితో పాటు నగరంలో వివిధ ప్రభుత్వ శాఖలలో పనిచేస్తున్న వేలాది మందికి గ్రామాలలో ఓటు హక్కు ఉందని తెలిపారు. వారందరికీ సెలవు మంజూరు చేసి, తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎన్నికల కమిషన్ ఆదేశించాలని కోరారు. పౌరులందరూ తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.



## చావునోట్లో తలపెట్టి తెలంగాణ సాధించిన కెసిఆర్ : మధుకర్‌రెడ్డి

ప్రజాపక్షం/శామీర్‌పేట : తెలంగాణ రాష్ట్రం సాధించడానికి చావునోట్లో తలపెట్టిన కెసిఆర్‌ను తెలంగాణ ప్రజలు తెలంగాణ గాంధీ అని కొనియాడుతున్నారని డిసిఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం శామీర్‌పేట మండల కేంద్రంలో విజయ్‌దివస్ కార్యక్రమంలో భాగంగా కెసిఆర్ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం సాధించడానికి ప్రాణత్యాగానికి సిద్దపడ్డ కెసిఆర్ నిజమైన ఉద్యమ పోరాట యోధుడు అని అన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి పదేళ్ల పాలనలో తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచిన ఘనుడు మాజీ సిఎం కెసిఆర్ అని గుర్తు చేశారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ అన్ని స్థానాలను గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందన్నారు. ప్రజలంతా కెసిఆర్ వైపే ఉన్నారని ఆయనను దేవుడిలా కొలుస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ శామీర్‌పేట అధ్యక్షుడు మోహన్ రెడ్డి, మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు బాబు, భూమిరెడ్డి, చాంద్ పాష, బిక్షపతి, సతీష్‌రెడ్డి, అనిల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికలు ప్రశాంతంగా జరుపుకోవాలి

మున్నూరుకాపు రాష్ట్ర అధ్యక్షుడు పుటం పురుషోత్తంరావు పటేల్

ప్రజాపక్షం/శామీర్‌పేట : మేడ్చల్ జిల్లాకు సంబంధించిన మున్నూరుకాపు సంఘం ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో సామరస్యంగా నిర్వహించుకోవాలని మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సర్దార్ పుటం పురుషోత్తంరావు పటేల్ పిలుపునిచ్చారు. మంగళవారం శామీర్‌పేట మండలంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మేడ్చల్ జిల్లా మున్నూరుకాపు సంఘం గౌరవ అధ్యక్షు డు మామిండ్ల శ్రీనివాస్‌పటేల్ ఆధ్వర్యంలో ఈ నెల డిసెంబర్ 12న అలియాబాద్ ప్రధాన చౌరస్తాలోని శుభం గార్డెన్‌లో జిల్లా ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తామని చెప్పారు. మధ్యాహ్నం భోజన విరామం అనంతరం విజయోత్సవ సభ ఉంటుందన్నారు. ఎన్నికల నిర్వహణ బాధ్యతలను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జిల్లా ఎన్నికల బాధ్యులు ఇందూరి తిరుపతి పటేల్ నిర్వహిస్తారని చెప్పారు. ఈ విజయోత్సవ సభకు జిల్లా ముఖ్య నాయకులు, మండల, గ్రామ శాఖ అధ్యక్షులు విచ్చేసి జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు మామిండ్ల శ్రీనివాస్‌పటేల్, రాష్ట్ర కార్యదర్శి, ఎన్నికల నిర్వహకులు ఇందూరి తిరుపతి పటేల్, రాష్ట్ర కార్యదర్శి కర్ర వెంకన్నపటేల్, కార్య నిర్వహణ కార్యదర్శులు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, శామీర్‌పేట మండలాధ్యక్షుడు, రాష్ట్ర నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## కెసిఆర్‌తో దక్కిన స్వరాష్ట్ర వాంఛ

ఎమ్మెల్యే బండారి

ప్రజాపక్షం/కాప్రా : తెలంగాణా తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా వీరోచిత పోరాటం, మార్గదర్శకంతో కొనసాగిన ఉద్యమ ఫలితం కారణంగా చిరకాల స్వరాష్ట్ర వాంఛ నెరవేరిందని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మల్లాపూర్‌లోని ఎలిఫెంట్ చౌరాస్తాలో స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణా తల్లి విగ్రహానికి, అమర వీరుల స్థూపానికి పూలమాలలు వేసి ఘనంగా దీక్షా విజయ్ దివస్ వేడుకలను మంగళవారం నిర్వహించారు. కెసిఆర్ ఉద్యమ పాత్రను స్మరిస్తూ బిఆర్ఎస్ శ్రేణులు నినదించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వరాష్ట్రాన్ని పదేళ్లపాటు పాలించిన కెసిఆర్ చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులతో దేశంలోనే నంబర్ వన్‌గా నిలిపారన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ బోర్డు, నాచారం కార్పొరేటర్లు ప్రభుదాస్, సాయిజెన్ శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

జిహెచ్ఎంసి వార్డుల పునర్విభజనకు సంబంధించి

# ముసాయిదా నోటిఫికేషన్ జారీ

300 వార్డులుగా ఏర్పాటు చేసిన అధికారులు

నేటి నుంచి ఏడు రోజుల పాటు సూచనలు – అభ్యంతరాల స్వీకరణ

ప్రజాపక్షం/హైదరాబాద్: వార్డుల పునర్విభజన (డిలిమిటేషన్) ముసాయిదా నోటిఫికేషన్‌ను హైదరాబాద్ మహానగర పాలక సంస్థ (జిహెచ్ఎంసి)మంగళవారం జారీ చేసింది. హైదరాబాద్ మహానగర పాలక సంస్థ పరిధిలోని నివాసితులు ఏమైనా సూచనలు లేదా అభ్యంతరాలు ఉంటే ఈ నోటిఫికేషన్ ప్రచురించిన తేదీ నుండి 7 రోజుల్లోపు జిహెచ్ఎంసి సర్కిల్, జోనల్, ప్రధాన కార్యాలయాలలో దాఖలు చేయాలని జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ నోటిఫికేషన్‌లో సూచించారు. ఏడు రోజులపాటు సూచనలు లేదా అభ్యంతరాలు స్వీకరించిన అనంతరం వార్డుల పునర్విభజనకు సంబంధించి తుది నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. వార్డుల పునర్విభజన ప్రక్రియకు ప్రభుత్వం ఆమోదం తెలుపుతూ జి.ఒ 570, 06.11.1996, తెలంగాణ మున్సిపల్ కార్పొరేషన్‌ల (వార్డుల పునర్విభజన) నిబంధనలు, 1996 లోని నిబంధన 8 ప్రకారం, జి.ఒ నెంబర్ 266, 08.12.2025 మెట్రోపాలిటన్ ఏరియా, అర్బన్ డెవలప్‌మెంట్ (జిహెచ్ఎంసి.1) విభాగం, ప్రకారం జిహెచ్ఎంసి పరిధిలో 300 ఎన్నికల వార్డులుగా విభజించినట్లు నగర ప్రజలకు తెలిపింది. వార్డుల పునర్విభజనకు సంబంధించిన సరిహద్దు వివరణల వివరాలను అన్ని సర్కిల్, జోనల్, ప్రధాన కార్యాలయాల నోటీసు బోర్డులలో బుధవారం నుండి ప్రదర్శించనున్నారు.

అలాగే జిహెచ్ఎంసి వెబ్‌సైట్: www.ghmc.gov.inలో కూడా వార్డుల పునర్విభజన వివరాలు అప్‌లోడ్ చేస్తామని జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ వెల్లడించారు. దీనికి అనుగుణంగా జిహెచ్ఎంసి బుధవారం నుంచి అభ్యంతరాల స్వీకరణను ప్రారంభించనుంది.

- హైదరాబాద్ మహానగర పాలక సంస్థ ప్రాంతాన్ని 300 ఎన్నికల వార్డులుగా విభజించారు.
- నివాసితులు ఎవరైనా ఈ నోటిఫికేషన్‌పై సూచనలు లేదా అభ్యంతరాలు ఉంటే బుధవారం నుండి జిహెచ్ఎంసి సర్కిల్ కార్యాలయాలలో లిఖిత పూర్వకంగా దాఖలు చేయవచ్చు.
- గతంలో జి.T 266 ద్వారా బృహత్ హైదరాబాద్ డివిజన్‌ల పునర్విభజనకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే.
- గ్రేటర్ హైదరాబాద్ విస్తీర్ణం 650 చ.కి.మీ.ల నుండి 2 చ.కి.మీలకు పైగా పెరిగింది.
- విలీనం తర్వాత జిహెచ్ఎంసిలో జనాభా దాదాపు 1.3 కోట్లుగా ఉంటుందని అధికారులు అంచనగా ఉంది.
- ఒక్కో డివిజన్‌లో సుమారు 40 వేల నుంచి 50 వేల మధ్య జనాభా ఉండే అవకాశం ఉంది.

**తుది ప్రక్రియ..**

ప్రజల నుంచి అభ్యంతరాల స్వీకరణ పూర్తయిన తర్వాత, కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసి సభ్యుల అభిప్రాయాన్ని సేకరిస్తారు. వచ్చిన ఫిర్యాదులు, అభ్యంతరాలన్నింటినీ పరిష్కరించిన అనంతరం తుది నోటిఫికేషన్ జారీ చేస్తారు. తుది నిర్ణయం రాష్ట్ర ప్రభుత్వానిదే ఉంటుందని అధికారులు తెలిపారు.



షాహి సంస్థ కార్మికుల సమస్యల పరిష్కారానికి

## ఆందోళనలు ఉధృతం చేస్తాం

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.ఎస్ బోస్

ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి: కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న షాహి ఎక్స్‌పోర్టు సంస్థపై చర్యలు తీసుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఎస్ బోస్ డిమాండ్ చేసారు. కనీస వేతనాలు ఇవ్వటంతో పాటు వేతనాల్లో కోతలు విధించరాదన్న డిమాండ్‌తో సోమవా రం నుండి సంస్థ మహిళా కార్మికులు చేస్తున్న ధర్నా కు సంఘీభావాన్ని ప్రకటిస్తూ ఆయన మంగళవారం రెండవ రోజు ధర్నా లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాచారం పారిశ్రామిక సంస్థలో పెద్దసంఖ్యలో మహిళా కార్మికులు పనిచేస్తుండ గా కార్మిక నిబంధనల మేరకు వేతనాలు ఇవ్వకపోగా కంట్రాక్టరు ద్వారా వేతనాలు చెల్లిస్తూ మోసపూరితంగా వేతనాల్లో కోత విధిస్తోందన్నారు. ప్రతి నెలా రూ.26వేలు వేతనం ఇస్తున్నట్లు చూపిస్తూ కంట్రాక్టర్ ద్వారా తొమ్మిది వేల రూపాయలు తగ్గించి ఇవ్వటం సిగ్గు చేటన్నారు. మహిళా కార్మికుల పట్ల అగౌరవంగా మాట్లాడుతూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్నారు.

కార్మికులకు సరైన వేతనాలిచ్చే వరకు సిపిఐ సంపూర్ణ మద్దతిస్తూ యాజమాన్యం దిగివచ్చి పూర్తి స్థాయిలో పరిష్కారమయ్యే వరకు ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. ఈ ధర్నాలో సిపిఐ ఉప్పల్ మండ ల కార్యదర్శి టి. సత్యప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులు కె.ధర్మేంద్ర, సిపిఐ, ఎఐటియుసి నేతలు గిరిబాబు, రాజేష్‌బాబు, ప్రణయ్, విజయ్, రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతి–సాయినగర్ షిర్డీ ఎక్స్‌ప్రెస్ రైలు షురూ

కేంద్ర సహాయమంత్రి వి.సోమన్న వర్చువల్‌గా జెండా ఊపి ప్రారంభం




ప్రజాపక్షం/హైదరాబాద్:తిరుపతి–సాయినగర్ షిర్డీ మధ్య నూతన ఎక్స్‌ప్రెస్ రైలును కేంద్ర రైల్వే సహాయ మంత్రి వి.సోమన్న మంగళవారం వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా జెండా ఊపి ప్రారంభించారు. తిరుపతి రైల్వే స్టేషన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఎపి పెట్టుబడుల శాఖ మంత్రి బి.సి. జనార్ధన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు ఎం. రఘునాథ్ రెడ్డి, తిరుపతి ఎంపి డాక్టర్ మద్దిల గురుమూర్తి, ఎంఎల్‌సి బల్లి కళ్యాణచక్రవర్తి, తిరుపతి ఎంఎల్ఎ అరాని శ్రీనివాసులు, ఇతర ప్రజా ప్రతినిధులు, దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవతో పాటు పలువురు సీనియర్ అధికారులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా మంత్రి సోమన్న మాట్లాడుతూ, తిరుపతి – సాయినగర్ షిర్డీ ఎక్స్‌ప్రెస్ ప్రారంభం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర ప్రజలకు ఎంతో ప్రయోజనకరమని అన్నారు. ఈ రైలు తిరుపతి, నెల్లూరు, గుంటూరు, సికింద్రాబాద్, బీదర్, మన్మాడ్‌తో పాటు మొత్తం 31 స్టేషన్లను అనుసంధానిస్తుందని చెప్పారు. ఈ నూతన రైలు తీర్థయాత్రలు, పర్యాటక అభివృద్ధి, ప్రాంతీయ ఆర్థిక పురోగతికి దోహదం చేస్తుందని ఆయన వెల్లడించారు. మహారాష్ట్రలోని ప్రసిద్ధ పర్లి వైజ్‌నాథ్ శివాలయానికి కూడా ఈ రైలు ప్రత్యక్ష అనుసంధానాన్ని ఇస్తుందని తెలిపారు.

## ఈశ్వరాచారిది ప్రభుత్వ హత్య

కోటి రూపాయలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి

ప్రజాపక్షం/వికారాబాద్ :సాయి ఈశ్వరాచారిది ప్రభుత్వ హత్య, ఆయన కుటుంబాన్ని ఆదుకోవాలని కృష్ణ ముదిరాజ్ రాష్ట బిసి సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి అన్నారు. రాష్ట ప్రభుత్వం బిసిలకు 42శాతం అమలు చేస్తామని చివరికి సర్పంచ్ ఎన్నికల్లో దానిని 17 శాతానికి తీసుకొచ్చినందుకు బిసిలకు 42శాతం రిజర్వేషన్లను విద్య, ఉద్యోగాలకు, సర్పంచ్ రాజకీయాలకు 17శాతం కేటాయించారని, బిసిలు తరతరాలుగా తీవ్రంగా నష్టపోతున్నారని భవిష్యత్ తరానికి చీకటి రోజు తీసుకొచ్చారని, దానికి నిరసనగా మానసికంగా ఆవేశంతో ఈశ్వరాచారి చనిపోయి తొలి అమరుడైనాడు అని అన్నారు. రాష్ట ప్రభుత్వం 42శాతం కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. బిసిల బాధను రాష్ట ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, సర్పంచు ఎన్నికల్లో బిసిలను,ఎస్‌సిలను, ఎస్‌టిలను గెలిపించుకోవాలని సూచించారు. ప్రజలకు ఇచ్చిన 421వాగ్దానాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

## పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్

కలెక్టర్ ప్రతీక్‌జైన్

ప్రజాపక్షం/వికారాబాద్:జిల్లా కలెక్టర్, అబ్జర్వర్ ఆధ్వర్యంలో పోలింగ్ సిబ్బందికి ర్యాండమైజేషన్ మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ హాలు నందు జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా మొదటి ఎన్నికలకు సంబంధించిన మూడవ ర్యాండమైజేషన్ ద్వారా పోలింగ్ సిబ్బందికి జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ ప్రతీక్‌జైన్, జనరల్ అబ్జర్వర్ షేక్ యాస్మిన్ బాష సమక్షంలో నిర్వహించారు. మొదటి విడుత 8మండలాలకు సంబంధించిన 262 గ్రామ పంచాయతీలకు, 37గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం కాగా మిగతా 225 గ్రామ పంచాతీయలకు, 1912 వార్డులకు ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ప్రిసైడింగ్ అధికారులు 2351, ఒపిఒలు 2743, టుమెంబర్ టీం1607, త్రి మెంబర్ టీం 288, పోర్ మెంబర్ టీం17, మొత్తం 1912 సిబ్బందిని ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుధీర్, డిఆర్‌డిఓ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

**కలెక్టర్ కార్యాలయంలో తెలంగాణ తల్లి విగ్రహం ఆవిష్కరణ** : మంగళవారం వికారాబాద్ కలెక్టర్ కార్యాలయంలో ఆవరణలో జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్‌పి స్నేహ మెహ్రా, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, తదితరులు పాల్గొన్నారు.




## ఆధునిక పద్ధతుల్లో డంపింగ్ యార్డు వ్యర్థాల తొలగింపు

మున్సిపల్ కమిషనర్ యాదగిరి వెల్లడి

ప్రజాపక్షం/తాండూరు: డంపింగ్ యార్డులో సంవత్సరాల తరబడి పేర్కపోయిన వ్యర్థాలను ఆధునిక యాంత్రం ద్వారా తొలగిస్తున్నట్లు తాండూరు మున్సిపల్ కమీషనర్ యాదగిరి వెల్లడించారు. మంగళవారం ఆయన డిఈ మణిపాల్, ఎఈ ఖాజాహుస్సేన్, ఉదయ్‌కుమార్, ఎన్విరాల్ మెంట్ ఇంజనీర్ ప్రవీణ్‌గౌడ్, ఇంచార్జీ సానిటరీ ఇన్స్పెక్టర్ ఎం వెంకటయలతో కలసి డంపింగ్ యార్డు ఏర్పాటు చేసిన బయో మైనింగ్ ఆధునిక యంత్రాన్ని పరిశీలించారు. బయో మైనింగ్ అనేది చెత్త నిలువలను శాస్త్రీయ పద్ధతిలో శుభ్రపర్చడమే ఆధునిక విధానమని కమీషనర్ వివరించారు. ప్రస్తుతం డంపింగ్ యార్డులో పేరుకపోయిన వ్యర్థాలను ఆధునిక యంత్రాల సహాయంతో వడకట్టి తరిగి ఆ వ్యర్థాలను ఉపయోగించగల పదార్థాలను వేరు చేసే ప్రక్రియ ఈ యంత్రంలో ఉందని చెప్పారు. ఈ ప్రక్రియలో మట్టి, ప్లాస్టిక్, ఇనుము, గాజు పరిశ్రమల్లో ఉపయోగపడే ఆర్డిఎఫ్ వంటి విలువైన పదార్థాలు తిరిగి పొందపడతాయని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రక్రియ ద్వారా బయో మైనింగ్‌తో డంపింగ్ యార్డు పరిమాణం తగ్గి పర్యావరణ కాలుష్యం కూడా తగ్గుతుందని ఆయన వివరించారు. భూ, వాయు కాలుష్యం కూడా తగ్గుతుందన్నారు. భూ, వాయు కాలుష్యాలు తగ్గడంతో పాటు చెత్త దుర్వాసన, దోమల సమస్యలు తగ్గి ప్రజారోగ్యం మెరుగుపడుతుందన్నారు. ఇది స్వచ్ఛమైన సుస్థిరమైన పట్టణాల నిర్మాణానికి దోహదపడుతుందన్నారు.



## సోనియా గాంధీకి ప్రజలు రుణపడి ఉండాలి

జన్మదిన వేడుకల్లో మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహ యాదవ్

ప్రజాపక్షం/శామీర్‌పేట : తెలంగాణ రాష్ట్రం ప్రకటించిన సోనియాగాంధీకి ప్రజలందరు రుణపడి ఉండాలని మేడ్చల్ మార్కెట్ కమిటి చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహయాదవ్ అన్నారు. మంగళవారం అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుంకి రమేష్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా అలియాబాద్ మున్సిపల్ మజీద్‌పూర్‌లో కేక్‌కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి డైరక్టర్ బిక్షపతి, ఎ బ్లాక్ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.





**మూడుచింతలపల్లిలో..**

మూడుచింతలపల్లిలో మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు దోసకాయల వెంకటేష్ ఆధ్వర్యంలో సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా మార్కెట్ కమిటి చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహయాదవ్ కేక్ కట్ చేసి కాంగ్రెస్ నాయకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పట్టా బాల్‌నర్సింహ, మాజీ వైస్ ఎంపిపి మంద శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

**ఘట్‌కేసర్‌లో:** మున్సిపల్ అధ్యక్షులు మామిండ్ల ముత్యాలు యాదవ్ ఆధ్వర్యంలో మేడ్చల్ నియోజకవర్గం బిబ్లాక్ అధ్యక్షుడె వేముల మహేష్ గౌడ్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావనిజంగయ్య యాదవ్, మార్కెట్ కమిటీ సభ్యులు మచ్చేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరి యాదవ్‌లు కలిసి ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అంబేద్కర్ చౌరస్తాలో సోనియా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ రైతు సమన్వయ అధ్యక్షులు కొంతం అంజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి బర్ల రాధాకృష్ణ ముదిరాజ్, మాజీ కౌన్సిలర్ కడుపోల్ల మల్లేష్, కొమరవెల్లి డైరెక్టర్ మెరుగు నరేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.





**మల్కాజిగిరిలో:** మల్కాజిగిరి చౌరాస్తాలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఘనంగా సోనియాగాంధీ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ వై.ప్రేమ్‌కుమార్, బిబ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, చంద్రశేఖర్, బికె శ్రీనివాస్, గుండా నిరంజన్ పిట్టల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నేరేడ్‌మెట్ చౌరాస్తాలో జరిగిన మరో కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు ఎస్సార్ ప్రసాద్, ఇందిరా చంద్రశేఖర్,శంకర్రావు, మల్లిక, విజయలక్ష్మి , తదితరులు పాల్గొన్నారు.

**నిజాంపేట్‌లో:** నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొలను రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో బాచుపల్లిలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఎఐసిసి అగ్రనేత సోనియా గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జ్ కొలను హన్మంత రెడ్డి కేక్‌ని కట్‌చేసి కార్యకర్తలకు తినిపించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొలను వీరేందర్ రెడ్డి, ఎన్ఎంసి కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కొలను జీవన్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## టాస్క్ ఫోర్స్, ఎక్సైజ్ పోలీసుల దాడులు
## 1.5కిలోల ఎండు గంజాయి స్వాధీనం

ప్రజాపక్షం/తాండూరు:తాండూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని బార్వాద్‌లో జిల్లా టాస్క్ ఫోర్స్, ఎక్సైజ్ శాఖ సిబ్బంది మెరుపు దాడులు నిర్వహించారు. విశ్వసనీయ సమాచారం మేరకు సోమారం జిల్లా ఎక్సైజ్ అబ్కారి అధికారి కె.విజయభాస్కర్ రెడ్డి ఆదేశాల మేరకు కోట్‌పల్లి మండల పరిధి బార్వాద్ గ్రామంలో దాడులు చేశారు. బార్వాద్ గ్రామానికి చెందిన ఎర్రోళ్ళ పెంటయ్య తన పొలంలో గంజాయి సాగు చేస్తున్నట్లు తెలుసుకున్న జిల్లా టాస్క్ ఫోర్స్ అధికారులు, తాండూరు ఎక్సైజ్ సిబ్బంది దాడులు చేశారు. పొలంలో సాగు చేస్తున్న 108 గంజాయి మొక్కలు, 1.5కిలోల ఎండుగంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తాండూరు ఎక్సైజ్ సిఐ రాణి వెల్లడించారు. బార్వాద్ గ్రామానికి చెందిన ఎర్రోళ్ల పెంటయ్య, కొడుకు ఎర్రోళ్ల ప్రభాకర్ కలసి ఈ పంటను సాగుచేస్తున్నారని వివరించారు. వీరిలో ఎర్రో్ళ ప్రభాకర్‌పై కేసు నమోదు చేసిన అరెస్టు చేయడంతో పాటు రిమాండ్ కు తరలించినట్లు వవరించారు.మరో వ్యక్తి ఎర్రోళ పెంటయ్య పరారిలో ఉన్నట్లు తెలిపారు. ఈ దాడులలో ఎఈఎస్ శ్రీనివాస్‌రెడ్డి, డిటిఎఫ్ సిఐ శ్రీనివాస్, ఎస్‌హెచ్ఓ రాణి, డిటిఎఫ్ ఎస్సై రవికుమార్, తాండూరు ఎస్సైలు నిజామొద్దీన్, రవికుమార్, సిబ్బంది ఉన్నారు.



# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## ఎన్నికల కమిషన్ ఆదేశాలు తప్పనిసరి



**ప్రజాపక్షం/షాబాద్:** ఎన్నికల కమిషన్ ఆదేశాలను తప్పని సరిగా అమలు చేయాలని మండల ప్రత్యేక అధికారి డాక్టర్ మధుసుదన్ అన్నారు. మంగళవారం మండలంలోని జడ్‌పి బాలికల పాఠశాల ప్రాగ ణంలో ఎన్నికల అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల అధికారులు ఇచ్చిన గైడ్‌లైన్స్ ప్రకారం అధికారులు ఎన్నికలు నిర్వహించాలన్నారు. నిర్లక్ష్యం చేసే వారి కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ అపర్ణ, మండల విద్య అధికారి లక్ష్మణ్ నాయక్, ఎంపిఒ నరసయ్య, జిల్లా ఎన్నికల శిక్షణ అధికారులు పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్లను దగా చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

ఆందోళనలను తీవ్రతరం చేస్తాం
నిరవధిక ఆటో బంద్ నిర్వహిస్తాం
రాష్ట్ర ఆటో డ్రైవర్స్ యూనియన్స్ జెఎసి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎన్నికల సమయంలో ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలు అమలుచేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం దగా చేస్తుందని తెలంగాణ రాష్ట్ర ఆటో డ్రైవర్స్ యూనియన్స్ జెఎసి నేతలు ఆరోపించారు. ఆటో డ్రైవర్లను మోసం చేస్తే ఉరుకునేదిలేదు తాటతీస్తామని, నిరవధిక ఆటో బంద్ నిర్వహించడంతో పాటు భవిష్యత్తులో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర ఆటో డ్రైవర్స్ యూనియన్స్ జెఎసి ఆధ్వర్యంలో హైదరాబాద్ ఖైరతాబాద్‌లోని ఆర్‌టిఎ కమిషనర్ కార్యాలయం ఎదుట మంగళవారం భారీ ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో తెలంగాణ రాష్ట్ర ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్స్ జెఎసి కన్వీనర్ బి. వెంకటేశం(ఎఐటియుసి), జెఎసి నేతలు ఎల్.రూప్ సింగ్, ఎంఎ.సలీం (తెలంగాణ జాగృతి), ఈ.ప్రవీణ్ (టియుసిఐ), వేముల మారయ్య (బిఆర్‌టియు), ఎ.సత్తి రెడ్డి (టిఎడిఎస్), ఫి.యాదగిరి (టిఎన్‌టియుసి), జి.శ్రీనివాస్ (జిహెచ్‌ఎటిఎస్) తో




పాటు వందలాదిమంది ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బి.వెంకటేశం మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తమ ఎన్నికల మానిఫెస్టోలో ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి రూ.12వేల ఆర్థిక సహాయం, రవాణా రంగకార్మికులకు సంక్షేమబోర్డు వంటి ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. గత 13 సంవత్సరాల నుండి ఇప్పటివరకు ఆటో మీటర్ చార్జీలు పెంచలేదని, పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర వస్తువులు 100 శాతం పెరిగాయని, దీంతో ఆటో డ్రైవర్లు దిక్కుతోచని స్థితిలో తమ జీవితాలు గడుపుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే స్పందించి ప్రతి ఆటోడ్రైవర్‌కు రూ.12 వేల ఆర్థిక సహాయం అందించడంతో పాటు రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, అలాగే ఆటోమీటర్ చార్జీలు కిలోమీటర్‌కు రూ.20, మినిమం ఛార్జి రూ.50కు పెంచాలని డిమాండ్ చేశారు. ఎల్.రూప్‌సింగ్ మాట్లాడుతూ మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వల్ల నష్టపోతున్న ఆటోడ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఎంఎ.సలీం మాట్లాడుతూ ఓలా, ఉబెర్, రాపిడో ద్వారా అక్రమంగా నడుస్తున్న టూ వీలర్ లను నిషేదించాలని కోరారు. వేముల మారయ్య మాట్లాడుతూ ఒఆర్ ఆర్ పరిధిలో జివో నెం.263 ప్రకారం రిజిస్ట్రేషన్ అయిన 20వేల ఆటోలకు పర్మిట్‌లు ఇవ్వాలన్నారు. ఈ.ప్రవీణ్ మాట్లాడుతూ ఓలా, ఉబెర్, రాపిడో యాప్‌లను నిషేధించి రాష్ట్ర ప్రభుత్వమే కొత్త యాప్‌ను తీసుకరావాలన్నారు. జి.శ్రీనివాస్ మాట్లాడుతూ ఆటోడ్రైవర్లకు ప్రమాద భీమా రూ. 10 లక్షలకు పెంచి, సహజ మరణాలకు కూడా వర్తింపజేయాలని కోరారు. ఎ.సత్తిరెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలో ఆటోస్క్రాప్ పాలసీ ను పాత పద్దతిలోనే కొనసాగించాలన్నారు. ఫి.యాదగిరి మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలో అక్రమంగా తిరుగుతున్న ఇతర జిల్లాల ఆటో లను, ఓన్ ప్లేట్ క్యాబ్ లను నిషేదించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో ఎస్. అశోక్, సిహెచ్. జంగయ్య, ఎండి. ఒమర్ ఖాన్, ఎం. కృష్ణ, ఎం. నరసింహ (ఎఐటియుసి), రామ్ కిషన్ (బిఆర్‌టియు), లింగంగౌడ్ (టియుసిఐ), మొబిన్ (తెలంగాణక్ జాగృతి) తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన ప్రచార పర్వం

47 గ్రామపంచాయతీల్లో 410పోలింగ్ కేంద్రాల ఏర్పాటు
15పోలింగ్ కేంద్రాల్లో 500మంది పోలీస్ బందోబస్తు
వివరాలు వెల్లడించిన ఫరూఖ్‌నగర్ ఎంపిడిఒ బన్సీలాల్

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అభ్యర్థుల ప్రచార పర్వంకు తెర పడింది. మంగళవారం షాద్‌నగర్ డివిజన్‌లోని కొత్తూరు, నందిగామ, ఫరూక్‌నగర్, కేశంపేట, కొందుర్గ, జిల్లేడు చౌదరి గూడ మండల కేంద్రాలతోపాటు గ్రామ పంచాయతీల్లో మొదటి విడత ప్రచార పర్వం ముగిసింది. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని 47గ్రామ పంచాయతీలకు గాను 410పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, సమస్యాత్మకంగా ఉన్న 15పోలింగ్ కేంద్రాల్లో సుమారుగా 500పోలిస్ సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు వివరించారు. మండలంలోని 410పోలింగ్ కేంద్రాలను గాను 553మంది పిఓలు, అదే విధంగా 553మంది ఏపిఓలు పని చేస్తున్నారని వివరించారు. రూట్ ఆఫీసర్లుగా 12మంది విధులు నిర్వహిస్తున్నారని, నలుగురు జోన్ అఫీసర్లుగా పని చేస్తున్నారని, ప్రతి గ్రామ పంచాయతీకి ఒక జోన్ అఫీసర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 410పోలింగ్ కేంద్రాలను గాను అయ్యవారిపల్లితోపాటు ఐదు పోలింగ్ కేంద్రాలను రద్దు చేశామని, 12రూట్లలో 35 ఆర్‌టిసి బస్సులు విధులు నిర్వహించే అధికారుల కోసం పని చేస్తాయని తెలిపారు. బుధవారం పోలింగ్ సిబ్బందిని విధులు కేటాయించడంతోపాటు సంబంధిత పత్రాలను అంధించనున్నట్లు ఎంపిడివో బన్సీలాల్ తెలిపారు. పోలీసుల సహకారంతో పోలింగ్‌ను ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని విధాల చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఏ పోలింగ్ కేంద్రంలో సమస్యలు ఉన్నా తక్షణమే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు సిద్దంగా ఉన్నట్లు పేర్కొన్నారు.

## కెసిఆర్ దీక్ష ఫలితమే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం



**ప్రజాపక్షం/హయత్ నగర్ :** కెసిఆర్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షకు తలొగ్గి, కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించిన రోజే డిసెంబర్ 9 అని చంపాపేట డివిజన్ బిఆర్‌ఎస్ యువ నాయకులు గండికోట శ్రీనాద్ అన్నారు ఈ సందర్భంగా మాట్లాడుతూ "విజయ్ దివాస్" సందర్భంగా దివ్యాంగుల కేంద్రంలో దివ్యాంగులకు పండ్లు మరియు దుప్పట్లు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో మనీష్, యశ్వంత్, కోమల్, భాను, సాయి,శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## కంపెనీ మేనేజర్ అరెస్టు

రూ.ఏడున్నర లక్షలు స్వాధీనం : ఎసిపి




**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** పరిశ్రమలో విధులు నిర్వహిస్తున్న మేనేజర్‌ను నమ్మి ఆఫీస్ డ్రాలో డబ్బులు పెట్టి వెళ్ళిపోయారు..తిరిగి ఉదయం వచ్చే సూచే సరికి డబ్బులు లేకపోవడంతో యాజమాని పోలీసులకు ఫిర్యాదు చేశారు. షాద్‌నగర్ ఏసిపి లక్ష్మీ నారాయణ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఫరూఖ్‌నగర్ మండలం ఎలికట్ట గ్రామ శివారులో దుర్గాస్టీల్ కంపెనీకి సంబంధించిన యాజమాని రాజ్‌కుమార్ ఏడున్నర లక్షలు ఈనెల 3న పరిశ్రమలోని విధులు నిర్వహిస్తున్న మేనేజర్ కమల్ కిషోర్‌కు ఇచ్చారు. అదే రోజు పరిశ్రమలోని సెంట్రల్ డెస్క్‌లో పెట్టి తాళం వేసి వెళ్ళారు. మరుసటి రోజు మేనేజర్ కమల్ కిషోర్ ఫోన్ చేసి నగదు కనిపించడం లేదని, డబ్బులతో పాటు కంపెనీలో డివిఆర్ తీసుకువెళ్ళారని తెలిపారు. పరిశ్రమ యజమాని రాజ్‌కుమార్ షాద్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేయగా అసలు విషయాలు వెలుగులోకి వచ్చాయని వివరించారు. పరిశ్రమలో విధులు నిర్వహిస్తున్న మేనేజర్ కమల్ కిషోర్ వర్మను అరెస్టు చేసి విచారించగా అసలు విషయాలు వెలుగులోకి వచ్చాయని తెలిపారు. పరిశ్రమలో విధులు నిర్వహిస్తున్న మరో కార్మికుడు బబ్లు ద్వారా తాళం చెవి తీసుకొని ఏడున్నర లక్షల రూపాయా లు చాకచక్యంగా తీసుకువెళ్ళినట్లు వివరించారు. కేసు నమోదు చేసిన పోలీసులు అత్యంత చాకచక్యంగా పట్టుకొని విచారణ చేయగా అసలు విషయా లు వెలుగులోకి వచ్చాయని పేర్కొన్నారు. నిందితుడిని నుండి ఏడున్నర లక్షల నగదు స్వాధీనం చేయడంతోపాటు ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎసిపి లక్ష్మీనారాయణ వివరించారు. సమావేశంలో పట్టణ సిఐ విజయ్‌కుమార్, డిఐ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## నాంపల్లిలో గంజాయి పట్టివేత



**ప్రజాపక్షం/హైదరాబాద్:** నాంపల్లి రైల్వే స్టేషన్ సమీపంలోని మల్లేపల్లి ఆఫీస్ నగర్ ప్రాంతాల్లో ఎక్సైజ్ ఎస్‌టిఎఫ్ ఏ టీం లీడర్ అంజిరెడ్డి తమ బృందంతో కలిసి నిర్వహించిన దాడిలో 1.2 కేజీల గంజాయి పట్టుకున్నారు. ఈ కేసులో హార్టికల్ సుమిత్ అనే వ్యక్తిని అరెస్ట్ చేశారు.ఈ కేసులో ఉపాధ్యాయ బిజు, చందా, అజయ్, నిరంజన్,సోహల్ అనే వ్యక్తులు కూడా ఉన్నట్లు ఎస్టిఎఫ్ టీం లీడర్ అంజిరెడ్డి తెలిపారు. నిందితున్ని గంజాయిని నాంపల్లి ఎక్సైజ్ స్టేషన్లో అప్పగించినట్లు ఆయన తెలిపారు.

## కిక్ బాక్సింగ్‌లో రెండు గోల్డ్ మెడల్స్ సాధించిన పంతంగి వేద




**ప్రజాపక్షం/రంగారెడ్డి:** సంగారెడ్డి జిల్లాలోని బదర్ ఫంక్షన్ హాల్‌లో ఇటీవల రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్ పోటీలు జరిగాయి. ఇందులో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి 720 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన వారిని మధ్యప్రదేశ్ లో జరిగే తదుపరి పోటీలకు ఎంపిక చేశారు. అందులో భాగంగా మేడ్చల్ జిల్లా ఓల్డ్ బోయిన్ పల్లి నుండి కిక్ బాక్సింగ్ పోటీలలో పంతంగి లక్ష్మీపతి గౌడ్–గీత దంపతుల పెద్ద కూతురు పంతంగి వేద క్రీడల్లో పాల్గొని రెండు గోల్డ్ మెడల్స్ సాధించింది. ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను మధ్యప్రదేశ్‌లో జరిగే తదుపరి పోటీలకు ఎంపిక చేశారు. వేదను స్థానిక "ఓల్డ్ బోయిన్పల్లి డివిజన్"కార్పొరేటర్ ముద్దం నర్సింహా యాదవ్ ఓల్డ్ బోయిన్‌పల్లి మల్లికార్జున్ నగర్ కాలనిలోని (ముద్దం ఎంక్లేవ్) నివాసం ఉంటున్న పంతంగి గీత లక్ష్మీపతి పెద్ద కుమార్తె "వేద"ఇంటికి వెళ్లి శాలువా కప్పి, పుష్ప గుచ్చం ఇచ్చి అభినందించారు. మున్ముందు రాష్ట్ర దేశ స్థాయిలో క్రీడల్లో రాణించి పేరు ప్రఖ్యాతలు సాధించాలని ప్రోత్సహించారు. అందుకు తన సహకారం ఎల్ల వేళలా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు కొండల్ ముదిరాజ్, రమేష్ చౌదరి,తదితరులు ఉన్నారు.

## ఒయులో పోలీసులు జోక్యాన్ని అరికట్టాలి

సిఎం రాకను స్వాగతిస్తున్నాం
ఎఐఎస్‌ఎఫ్ ఒయు కౌన్సిల్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఉస్మానియా యూనివర్సిటీలో మితిమీరిన పోలీసులు జోక్యాన్ని అరికట్టి, స్వయం ప్రతిపత్తిని కాపాడుతూ స్వేచ్ఛగా సమావేశాలు నిర్వహించుకునే ప్రజాస్వామ్య వాతావరణాన్ని పునరుద్ధరించాలని ఎఐఎస్‌ఎఫ్ ఒయు కౌన్సిల్ డిమాండ్ చేసింది. అభివృద్ధి పనులలో భాగంగా నేడు ఒయుకి విచ్చేయుచున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాకను స్వాగతిస్తున్నామని, ఎఐఎస్‌ఎఫ్ ఒయు కౌన్సిల్ ఆధ్వర్యంలో మంగళవారం మీడియా సమావేశం ద్వారా వెల్లడించింది. ఈ సందర్భంగా ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సహాయకార్యదర్శి గ్యార నరేష్ మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ సాధించుకున్న తర్వాత రాష్ట్రాన్ని పరిపాలించిన గత బిఆర్ ఎస్ ప్రభుత్వం ఏనాడు యూనివర్సిటీని పట్టించుకున్న దాఖలాలు లేక నిరాదరణ గురై గత పదేండ్ల కాలంలో యూనివర్సిటీ విధ్వంసానికి గురైందని అన్నారు. సిఎం రేవంత్ రెడ్డి గతంలో యూనివర్సిటీకి విచ్చేసి, యూనివర్సిటీ అభివృద్ధికి రూ. వెయ్యి కోట్లు కేటాయిస్తానని ప్రకటించడం పట్ల దశాబ్ద కాలంగా ఉస్మానియా యూనివర్సిటీ సమగ్ర అభివృద్ధికి రూ. వెయ్యి కోట్ల నిధులు కేటాయించాలని



పోరాటాలు నిర్వహిస్తున్న విద్యార్థి సంఘాలుగా హర్షిస్తున్నామన్నారు. ఈసందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి పలు డిమాండ్లతో కూడిన ప్రతిని విడుదల చేశారు. ఎఐఎస్‌ఎఫ్ ఒయు అధ్యక్ష, కార్యదర్శులు ఉప్పల ఉదయ్, లెనిన్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చే రూ. వెయ్యికోట్లను కేవలం భవన నిర్మాణాలకు మాత్రమే కాకుండా విద్యార్థుల కేంద్రంగా సమగ్ర అభివృద్ధి కోసం కేటాయించాలని యునివర్సిటీ అధికారులను డిమాండ్ చేస్తున్నామన్నారు. ముఖ్యంగా యూనివర్సిటీలో చదివే పీజీ విద్యార్థులకు రూ.10వేలు, పిహెచ్‌డి స్కాలర్లకి రూ.25 వేలు ఫెలోషిప్ ఇవ్వాలన్నారు. లైబ్రరీకి నూతన పుస్తకాలు కొనుగోలు చేసేందుకుగాను 'ప్రత్యేక ఫండ్' ను ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థులకు హెల్త్ కార్డులు ఇన్సూరెన్స్ కార్డులు సదుపాయం కల్పించడంతో పాటు విద్యార్థుల రవాణా సౌకర్యార్థం యూనివర్సిటీలో ఎలక్ట్రిక్ బస్సులను నడపాలని కోరారు. చేయడంతో పాటు యూనివర్సిటీ అభివృద్ధికై నిర్వహించే డిపిఆర్ రూపకల్పనలో విద్యార్థి సంఘాలను, విద్యార్థులను భాగస్వామ్యం చేయకుండా విసి ఇష్టారీతిన వ్యవహరించడాన్ని ఖండిస్తూ రేవంత్‌రెడ్డితో చర్చించే విధంగా విద్యార్థి సంఘాలకు అవకాశం కల్పించాలని అన్నారు. సమావేశంలో ఉపాధ్యక్షులు దొండి రామ్, శ్రీశైలం, సుమన్, మధు, మాణిక్, వినయ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## స్వరాష్ట్రంలో ప్రజల ఆకాంక్షలు నెరవేరాలి

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** స్వరాష్ట్రంలో జిల్లా ప్రజల ఆకాంక్షలు నెరవేరాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో తెలంగాణ తల్లి విగ్రహం ఆవిష్కరణ కార్యక్రమం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో నూతనంగా నెలకొల్పిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని కలెక్టర్ నారాయణరెడ్డి ఆవిష్కరించారు. వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొని జయజయహే తెలంగాణ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మలి విడత తెలంగాణ ఉద్యమంలో వివిధ వర్గాల ప్రజలతో పాటు ప్రభుత్వ ఉద్యోగులు మమేకమయ్యారని గుర్తుచేశారు. ప్రభుత్వానికి ప్రజలకు



వారిదిగా ఉంటూ అధికారులు సంక్షేమఫలాలను ప్రజలకు అందేలా చూడాలన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎన్నికల నియమావళికి లోబడి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం అమరవీరుల కుటుంబాలు నీల దినేష్ చంద్ర, తండ్రి నీల రమేశ్, ఏన్నెల్ల శేఖర్ రెడ్డి,కాకి కుమార్ తండ్రి నరసింహను సన్మానించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, జడ్‌పి సిఇఒ సిహెచ్.కృష్ణారెడ్డి, డిపిఒ వి.సురేష్‌మోహన్‌తో పాటు కలెక్టరేట్ ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉద్యమ ఫలితమే రాష్ట్ర ఏర్పాటు

**ప్రజాపక్షం/శంకర్‌పల్లి :** తుది దశ తెలంగాణ ఉద్యమ ఫలితంగా ఏర్పాటుకు తొలి అడుగు పడ్డ రోజు డిసెంబర్ 9 అని శంకర్‌పల్లి మండల బిఆర్ ఎస్ నాయకులు అన్నారు. మంగళవారం విజయ్ దివస్ సందర్భంగా శంకర్ పల్లి పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి తెలంగాణ తల్లి చిత్రపటానికి పాలాభిషేకం చేసి, పూలమాలలు వేసి విజయ్ దివస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. వారు మాట్లాడుతూ సబ్బండ వర్గాల పోరాటం, అమరుల త్యాగం, కెసిఆర్ ఆమరణ నిరాహార దీక్షతో ఢిల్లీ పీఠం కదిలి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ప్రక్రియ ప్రారంభిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించి నేటికీ 16 సంవత్సరాలు అయిందని చెప్పారు.నవంబర్ 29( దీక్షా దివస్)లేకుంటే డిసెంబర్ 9(దీక్షదివస్)లేదన్నారు. కెసిఆర్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షకు తలొగ్గి, కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించిన రోజే విజయ్ దివస్ అన్నారు. కార్యక్రమంలో మండల బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు గండి చెర్ల గోవర్ధన్ రెడ్డి,శంకర్ పల్లి పిఎసిఎస్ చైర్మన్ బద్దం శశిధర్ రెడ్డి,మాజీ ఎంపీపీలు మాల చిన్న నరసింహులు, ధర్మన్న గారి గోవర్ధన్ రెడ్డి, శంకర్ పల్లి మాజీ సర్పంచ్ బి. శ్రీధర్ నాయకులు శేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

## ప్రత్యేక రాష్ట్రం ఇచ్చిన ఘనత సోనియాగాంధీదే

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన ఘనత సోనియాగాంధీదేనని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మంగళవారం సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి కాంగ్రెస్ అభిమానులకు తినిపించారు. షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడు తూ పదవులను త్యాగం చేయడంతోపాటు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ప్రకటించిన మహిళ సోనియాగాంధీ అనే విషయాన్ని గుర్తుపెట్టుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చెన్నయ్య, కొందుర్గ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ఫరూక్‌నగర్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్, నేతలు చెంది తిరుపతిరెడ్డి, రఘు నాయక్, బసవేశ్వర్, దంగు శ్రీనివాస్ యాదవ్,




మురళీ మనోహార్, కృష్ణారెడ్డి, లింగారెడ్డిగూడ అశోక్, తుపాకుల శేఖర్, ప్రవీణ్‌లు పాల్గొన్నారు.

### సోనియాగాంధీతోనే తెలంగాణ రాష్ట్రం

**హయత్ నగర్ :** సోనియాగాంధీ పుట్టిన రోజు సందర్భంగా ఢిల్లీలోని వారి నివాసంలో కలిసి మాజీఎంపి మధుయాష్కిగౌడ్ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోనియాగాంధీతోనే ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిందని, తెలంగాణ ప్రజల ఆశీస్సులతో ఆమె ఆయురారోగ్యాలతో ఉండాలని భగవంతుడిని కోరుకున్నట్లు తెలిపారు.

## అట్టహాసంగా ఓమిషా, దీక్ష కూచిపూడి అరంగేట్రం



**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** భరతనాట్యం, కూచిపూడి డ్యాన్స్ అకాడమీ గురు రమాదేవి నల్ల శిష్యురాళ్లు ఓమిషా ఐశని, దీక్ష రెడ్డి కూచిపూడి రంగం ప్రవేశం అట్టహాసంగా జరిగింది. గురువు ఆశీస్సులు, తల్లిదండ్రుల దీవెనలతో ఈ ఇద్దరు చిన్నారుల కూచిపూడి రంగప్రవేశం మంగళవారం హైదరాబాద్ రవీంద్రభారతి వేదికగా కనులపండువగా సాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కార్పొరేటర్ దీపిక నగేశ్, బంధుమిత్రులు హాజరై, చిన్నారుల ప్రదర్శన చూసి అభినందించారు. ఓమిషా తొమ్మిదేళ్ల వయసు నుంచి, దీక్ష రెడ్డి ఐదేళ్ల వయసు నుంచి కూచిపూడి నృత్యంలో శిక్షణ పొంది, పలు వేదికలపై ప్రదర్శనలిచ్చి, వీక్షకులను ఆకట్టుకొన్నారు. కార్యక్రమంలో నట్టు వాంగం చంద్ర కాంత్, కొరియోగ్రఫీ పద్మభూషణ్ డా.వెంపటిచిన్న సత్యం, ఓకల్ చంద్ర రావు, మృదంగం శ్రీధర్ ఆచార్య, ఫ్లూట్ ఉమా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## ఆత్మహత్యలు వద్దు.. పోరాడుదాం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిసి యువత, నాయకులెవరూ ఆత్మహత్యలు చేసుకోవద్దని ఐక్యంగా పోరాడి హక్కులు సాధించుకొందామని బిసి ఇంటెలెక్చువల్స్ ఫోరం రాష్ట్ర కోఆర్డినేటర్ డా.అవ్వారు వేణుకుమార్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్ బషీర్‌బాగ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ రేవంత్ సర్కార్ స్థానిక సంస్థల ఎన్నికల్లో 23శాతం ఉన్న రిజర్వేషన్లను 17.7శాతానికి తగ్గించి, బిసిలను నయవంచనకు పాల్పడిందన్నారు. రాష్ట్రంలోని బిజెపికి చెందిన 8మంది ఎంపిలు, 8మంది ఎంఎల్‌ఏలు ఉన్న నేపథ్యంలో బిసి బిల్లుపై ప్రత్యేక చొరవ తీసుకొని ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల దృష్ట్యా ప్రధాని మోదీ దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. లోక్‌సభలో చర్చపెట్టి పార్లమెంట్‌లో ఆమోదం పొందేలా కేంద్రంపై ఒత్తిడి పెంచాలని విజ్ఞప్తి చేశారు. బిసి బిల్లును రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చేవరకు పోరాటం కొనసాగంచాలని ఆయన పిలుపునిచ్చారు.

## హిందీ భాష ప్రచారానికి కృషి



**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** తనను కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ హిందీ సలహాదారుడిగా నియమించిన కేంద్ర హోంశాఖ, సహకార శాఖ మంత్రి అమిత్ షాకు హిందీ సేవా సదన్ వ్యవస్థాపక ప్రధానకార్యదర్శి , హిందీ ప్రచార సభ హైదరాబాద్ జనరల్ సెక్రటరీ ఎస్.గైబువల్లి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా హైదరాబాద్ బషీర్‌బాగ్‌లో ఎస్.గైబువల్లి మాట్లాడుతూ 18 ఏళ్ల వయస్సు నుంచే హిందీ భాష ప్రచారానికి కృషిచేస్తున్నానన్నారు. తెలుగు రాష్ట్రాల్లో హిందీ భాషాభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలు, హిందీ భాష సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి అనేకసార్లు తీసుకెళ్లానని తెలిపారు. తనకు హిందీ భాషపై ఉన్న నిబద్ధతను గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించడం సంతోషంగా ఉన్నదని గైబువల్లి పేర్కొన్నారు.

# రీల్



## ఈ సంక్రాంతికి భర్త మహాశయులకు విజ్ఞప్తి

మాస్ మహా రాజా రవితేజ, కిషోర్ తిరుమల దర్శకత్వం వహిస్తున్న అవుట్ అండ్ అవుట్ ఎంటర్టైనర్ 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'తో అలరించబోతున్నారు. ఎస్‌ఎల్‌వి సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. జీ స్టూడియోస్ ఈ చిత్రాన్ని సమర్పిస్తోంది. ఇందులో రవితేజ సరసన ఆషికా రంగనాథ్, డింపుల్ హయతి కథానాయికలుగా నటిస్తున్నారు. బ్లాక్ బస్టర్ ఫస్ట్ సింగిల్ బెల్లాబెల్లాతో మ్యూజిక్ ప్రమోషన్లను స్టార్ చేసిన నిర్మాతలు ఇప్పుడు సెకండ్ సింగిల్ విడుదల చేయడానికి సిద్ధమవుతున్నారు. సెకండ్ సింగిల్ అద్దం ముందు డిసెంబర్ 10న రిలీజ్ కానుంది. రవితేజ, డింపుల్ హయతిపై చిత్రీకరించిన ఈ సాంగ్ అదిరిపోయే మెలోడీ డ్యూయెట్. మేకర్స్ రిలీజ్ చేసిన ప్రోమోలో రవితేజ, డింపుల్ హయతి కెమిస్ట్రీ చూడముచ్చటగా వుంది. ఫుల్ సాంగ్‌పై అంచనాలు పెంచింది. భీమ్స్ సిసిరో లియో మ్యూజిక్ అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ ప్రసాద్ మురెళ్ల, జాతీయ అవార్డు గ్రహీత శ్రీకర్ ప్రసాద్ ఎడిటర్, ప్రొడక్షన్ డిజైనర్ ఏఎస్ ప్రకాష్. భర్త మహాశయులకు విజ్ఞప్తి 2026 సంక్రాంతికి విడుదల కానుంది.

## 'చాయ్ షాట్స్' ఓటిటి షురూ



చాయ్ బిస్కెట్ సంస్థ ఇప్పుడు చాయ్ షాట్స్ ఓటిటి ప్రారంభించింది. నటుడు దగ్గుబాటి రానా ఈ ఓటిటిని ప్రారంభించారు. ముందుగా తెలుగులో ఈ చాయ్ షాట్స్‌ను ప్రారంభించి తరువాత ఇతర భాషల్లో కూడా ప్రవేశిస్తారని ఈ సందర్భంగా రానా చెప్పారు. కొత్తగా వచ్చే నటీ నటులకు, కొత్తగా ఏదైనా క్రియేట్ చెయ్యాలనే తపన ఉన్న రచయితలకు ఈ చాయ్ షాట్స్ చాలా ఉపయోగకరంగా ఉంటుందని ఆయన తెలిపారు. రెండు, మూడు నిమిషాల్లో స్టోరీ చెప్పే పద్ధతి ఇప్పుడు మొబైల్‌లో వచ్చేసిందని అన్నారు. ఇదే పద్ధతిని చాలా మంది జనం కూడా ఆదరిస్తున్నారని చెప్పారు. అందుకే చాయ్ షాట్స్ వాళ్ళు కూడా ఈ మార్కెట్‌లో ప్రవేశించారని, ఎంటర్ టైన్మెంట్‌కు తెలుగులో విశేష ఆదరణ ఉందని రానా పేర్కొన్నారు. వినోదాత్మక మార్కెట్‌లో ఇలాంటి కొత్తవి ఏమొచ్చిన తాను సహకారం అందిస్తానని చెప్పారు. చాయ్ షాట్స్ ఎలా పని చేస్తుంది. ఎవరి కోసం పని చేస్తుంది. ఎలాంటి కంటెంట్ ఉంటుంది వంటి అంశాలను చాయ్ బిస్కెట్ శరత్, చాయ్ బిస్కెట్ అనురాగ్, సీటీవో కృష్ణ వివరించారు.

## శశిరేఖ @ 20+మిలియన్ వ్యూస్



మెగాస్టార్ చిరంజీవి హీరోగా నయనతార హీరోయిన్‌గా నటిస్తున్న సినిమా 'మన శంకర వరప్రసాద్ గారు'. అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా నుంచి ఇటీవల శశిరేఖ అనే పాటను విడుదల చేశారు. ఈ పాట విడుదల అయిన కొద్ది గంటల్లోనే 20 మిలియన్స్ కంటే ఎక్కువగా వ్యూస్ సంపాదించుకుంది చిత్ర నిర్మాతలు తెలిపారు. ఈ పాటను చిరంజీవి, నాయనతారలపై చిత్రీకరించారు. భీమ్స్ సంగీతం అందించిన ఈ పాటను గాయని మధు ప్రియతో పాటు భీమ్స్ కలిసి ఆలపించారు. ఈ పాటకు గేయ రచయిత అనంత శ్రీరామ్ సాహిత్యం అందించారు. చిరంజీవి, వెంకటేష్‌పై కూడా ఒక పాటను చిత్రీకరించారు. ఇద్దరు స్టార్ హీరోలపై చిత్రీకరించిన పాటను కూడా త్వరలోనే విడుదల చెయ్యడానికి సన్నాహాలు చేస్తున్నారు. పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అన్ని పనులు పూర్తి చేసి వచ్చే సంక్రాంతికి ఈ సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. చిరంజీవి కుమార్తె సుస్మిత, సాహు గారపాటి కలిసి ఈ సినిమాను నిర్మిస్తున్నారు.

## 'ఓం శాంతి శాంతి శాంతిః' టీజర్ ఆవిష్కరణ



ట్యాలెంటెడ్ ఫిల్మ్ మేకర్స్ తరుణ్ భాస్కర్ తన అద్భుతమైన నటనతో కూడా తెరపై అలరిస్తున్నారు. 'ఓం శాంతి శాంతి శాంతిః అనే కొత్త చిత్రంలో మరోసారి కీలకమైన పాత్రలో కనిపిస్తున్నారు. ఈషా రెబ్బా హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఏ ఆర్ సజీవ్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. సృజన్ యరబోలు, ఆదిత్య పిట్టీ, వివేక్ కృష్ణని, అనుప్ చంద్రశేఖరన్, సాధిక్ షేక్ ,నవీన్ సనివరపు ఈ వెంచర్ను నిర్మిస్తున్నారు, కిషోర్ జాలాది, బాల సౌమిత్రి సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. మొత్తం షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం పోస్ట్‌ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుపుకుంటోంది. ఈ నేపదాయంలో సినిమా టీజర్ను దర్శకుడు, నటుడు తరుణ్ భాస్కర్ ఆవిష్కరించారు.

## 'టాక్సిక్' పోస్టర్ రిలీజ్



'కేజీఎఫ్' సినిమాతో 'రాకింగ్ స్టార్'గా ఎదిగిన కన్నడ హీరో యష్ తన తదుపరి చిత్రం 'టాక్సిక్: ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్న విషయం తెలిసిందే. నేషనల్ అవార్డ్ విన్నర్ గీతూ మోహన్ దాస్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. కేవీఎన్ ప్రొడక్షన్స్, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ బ్యానర్లపై యష్, వెంకట్ కె.నారాయణ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. పాన్ ఇండియా సినిమాగా రాబోతున్న ఈ చిత్రం మార్చి 19న ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఈ సినిమా విడుదలకు ఇంకా 100 రోజులే ఉండడంతో ఈ విషయాన్ని తెలుపుతూ కౌంట్‌డౌన్ పోస్టర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. ఈ సినిమాకు రవి బస్రూర్ సంగీతం అందిస్తుండగా.. సినిమాటోగ్రఫీ: రాజీవ్ రవి, ఎడిటింగ్: ఉజ్వల్ కులకర్ణి, ప్రొడక్షన్ డిజైన్: టీపీ అబిద్, యాక్షన్ డైరెక్టర్లు: జేజే పెర్రీ, అన్బరివ్.

## 'పైసా డుమ్ డుమ్' సాంగ్ లాంచ్

నరేష్ అగస్త్య, ఫరియా అబ్దుల్లా జంటగా నటిస్తున్న సినిమా 'గుర్రం పాపిరెడ్డి'. ఈ చిత్రాన్ని డా. సంధ్య గోలీ సమర్పణలో ప్రొడ్యూసర్స్ వేణు సద్ది, అమర్ బురా, జయకాంత్ (బాబీ) నిర్మిస్తున్నారు. డార్క్ కామెడీ కథతో ఇప్పటి వరకు మనం తెరపై చూడని కాన్సెప్ట్‌తో దర్శకుడు మురళీ మనోహర్ రూపొందిస్తున్నారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న 'గుర్రం పాపిరెడ్డి' సినిమా ఈ నెల 19న థియేట్రికల్ రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా 'గుర్రం పాపిరెడ్డి' సినిమా నుంచి 'పైసా డుమ్ డుమ్' సాంగ్ ను రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా హీరోయిన్ ఫరియా అబ్దుల్లా మాట్లాడుతూ.. 'గుర్రం పాపిరెడ్డి' టీమ్ అంతా ఒక కొత్త తరహా మూవీ చేసేందుకు ప్రయత్నించాం. బాగా టిపికల్ మూవీగా కాకుండా సినిమా అంతా మంచి ఫన్ ఉండేలా చూసుకున్నాం. నెక్స్ట్ రాబోయో ప్రమోషనల్ కంటెంట్‌తో మిమ్మల్ని ఆకట్టుకుంటామని నమ్ముతున్నాం. ఈ కథ వినగానే నటించాలని అనిపించింది. కామెడీలోనే కొత్తగా కంటెంట్ క్రియేట్ చేయొచ్చు అని ఈ సినిమాలో నటించిన తర్వాత అనిపించింది.



## ఈ సిరీస్‌లో గ్లామర్ డోస్ పెంచలేదు.. - ఈషా రెబ్బ

ఈషా రెబ్బా, సత్య, హర్ష చెముడు, ప్రిన్స్ సిసిల్, హేమ, సత్యం రాజేశ్, కుషిత కల్లపు ప్రధాన పాత్రల్లో నటించిన వెబ్ సిరీస్ 'త్రీ రోజెస్'. ఆహా ఓటీటీలో సూపర్ హిట్టయిన ఈ సిరీస్ సీజన్ 2 ఈ నెల 12వ తేదీ నుంచి స్ట్రీమింగ్ కు రెడీ అవుతోంది. రాశీ సింగ్ మరో కీ రోల్ చేసింది. ఈ సిరీస్‌ను మాస్ మూవీ మేకర్స్ బ్యానర్‌పై ఎస్‌కేఎన్ నిర్మిస్తున్నారు. కిరణ్ కె కరవల్ల దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా హీరోయిన్ ఈషా రెబ్బా, యాక్టర్ హర్ష చెముడు మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు.

'త్రీ రోజెస్' సీజన్ 2లో నేను కంటిన్యూ కావడం హ్యాపీగా ఉంది. సీజన్ 1లో ఫీమేల్ క్యారెక్టర్స్‌కు వేర్వేరు సీన్స్ ఉంటాయి. ఈ సీజన్ 2లో ఆ క్యారెక్టర్స్ అన్నింటికి కలిపి కాంబినేషన్ సీన్స్ ఉంటాయి. వెకేషన్ కు వెళ్లే సన్నివేశాలు సీన్స్ చేశాం. నేను రాశీ కుషిత మూడు కీ రోల్స్ చేశాం. రాశీ ఫైర్ బ్రాండ్ లా ఉంటుంది. కుషిత చిన్న పిల్లలా అల్లరి చేసేది. వీళ్లిద్దరితో కలిసి నటించడం ఎంజాయ్ చేశాను. ఈ సిరీస్‌లో గ్లామర్ డోస్ పెంచలేదు. యూత్ ఫ్యామిలీ అంతా కలిసి సిరీస్ చూడొచ్చు. 'త్రీ రోజెస్' సీజన్ 2లో మొత్తం 6 ఎపిసోడ్స్ ఉంటాయి. ఒక్కో ఎపిసోడ్ 30 నిమిషాల నిడివితో సాగుతుంది. 'త్రీ రోజెస్' సీజన్ 3కి లీడ్ ఇస్తూ సీజన్ 2 కంప్లీట్ అవుతుంది. సీజన్ 1లో మా పెయిర్‌కు వచ్చిన రెస్పాన్స్‌తో సీజన్ 2లో ఇంకా బాగా కాన్ఫిడెంట్‌గా చేశాం. 'త్రీ రోజెస్' వెబ్ సిరీస్ అనేది మా కెరీర్‌లో ఒక స్పెషల్ ప్రాజెక్ట్‌గా మిగిలిపోతుంది. ఫీమేల్ ఓరియెంటెడ్ ప్రాజెకట్స్ వస్తే నన్ను నేను అందులో రిలేట్ చేసుకోగలిగితే నటించేందుకు ఒప్పుకుంటా. నేను లాక్ డౌన్‌లో మార్షల్ ఆర్ట్స్ నేర్చుకున్నా. యాక్షన్ మూవీస్ లో అవకాశం వస్తే నటిస్తా. మా అమ్మ వాళ్లది రాజమండ్రి, మా నాన్నది వరంగల్ కాబట్టి సంక్రాంతికి ఏపీకి వెళ్తా, అలాగే ఇక్కడ పండుగలకు వరంగల్ వెళ్తుంటా. అని ఈషా రెబ్బ చెప్పింది.

### ఇండస్ట్రీలో ఉండాలనేది నా కోరిక - హర్ష

కమెడియన్ హర్ష చెముడు మాట్లాడుతూ ఇందులో కొన్ని అతిథి పాత్రలు కూడా వస్తుంటాయి. 'త్రీ రోజెస్' సీజన్ 1లోని రివేంజ్‌ను ఈ సీజన్ 2లో తీర్చుకునేందుకు నేను ప్రయత్నిస్తుంటాను. ఈషా, నా క్యారెక్టర్స్ డిఫరెంట్ ప్లేసెస్ నుంచి వస్తాయి. మన తెలుగు వెబ్ సిరీస్ లకు చూసుకుంటే ఇది పక్కా సీక్వెల్. ఈ సంక్రాంతికి వస్తున్న అన్ని సినిమాల్లో నటించా. రోజూ వర్క్ చేస్తూ ఇండస్ట్రీలో ఉండాలనేది నా కోరిక. నన్ను కామెడీతో పాటు మిగతా ఎమోషన్స్ చేయగలను అని నమ్మే ఈ సిరీస్‌లో అవకాశం కల్పించారు. బకాసుర అనే మూవీ చేశా. అందులోనూ ఒక డిఫరెంట్ క్యారెక్టర్‌లో నటించా. మోగ్లీలో కొత్త పాత్రలో కనిపిస్తా. ఒక్కో టైమ్‌లో ఇండస్ట్రీలో ఒక్కో ట్రెండ్ నడుస్తుంటుంది. ఇప్పుడు మన దగ్గర ఫన్ ట్రెండ్ నడుస్తోంది. ఎంటర్ టైనింగ్ మూవీస్ బాగా చూస్తున్నారు. కొన్నాళ్లకు మరో ట్రెండ్ వస్తుంది. ఫలానా హీరోతో పనిచేయాలి అనే లిస్టు చాలా పెద్దది. అందరితో వర్క్ చేయాలని ఉంది. క్యారెక్టర్ బాగుంటే లీడ్ క్యారెక్టర్, చిన్న క్యారెక్టర్ అనే తేడాలు చూడను. సాయి రాజేశ్ ప్రొడక్షన్‌లో ఒక మూవీలో ఇంపార్టెంట్ రోల్ చేస్తున్నా. ప్రభాస్ రాజా సాబ్ లోనూ ఒక రోల్ చేశా. కీలకమైన సన్నివేశంలో నా పాత్ర ఉంటుంది.



# తీసుకున్నాం...

(మొదటి పేజీ తరువాయి)



ఆకాంక్షలను గుర్తించి, యుపిఎ ప్రభుత్వం డిసెంబర్ 9న తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను ప్రకటించిందని గుర్తు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టరేట్లలో (తెలంగాణ తల్లి విగ్రహాల నిర్మాణం పూర్తి కాని జిల్లాలు ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ములుగు, నల్లగొండ, నారాయణపేట్ మినహా) తెలంగాణ తల్లి విగ్రహాలను సిఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లోని భారత్ ఫ్యూచర్ సిటీ వేదికగా మంగళవారం వర్చువల్‌గా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, వాకిటి శ్రీహరి, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అజారుద్దీన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ యుపిఎ ఛైర్‌పర్సన్ సోనియాగాంధీ నేతృత్వంలోని ప్రధాని మన్మోహన్ సింగ్, హోం శాఖ మంత్రి చిదంబరం తెలంగాణ రాష్ట్ర ప్రక్రియను ప్రారంభించినట్టు ప్రకటించిన రోజు అని, నాలుగు కోట్ల ప్రజల ఆకాంక్షను ప్రతిబింబిస్తూ యుపిఎ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం తెలంగాణ ప్రజలకు సంతోషాన్ని, ఆత్మ గౌరవాన్ని అందించిందని సిఎం అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రకటన చేసిన 'డిసంబర్ 9వ' తేదీకి ఉన్న ప్రధాన్యతను ప్రజా పాలన ఇందిరమ్మ ప్రభుత్వం గుర్తించిందని, అందుకే ఈ పర్వదినం రోజున తెలంగాణ తల్లి అవతరణ దినోత్సవంగా జరుపుకోవాలని ప్రభుత్వం అధికారికంగా నిర్ణయించిందన్నారు. ఇందులో భాగంగానే రాష్ట్ర పరిపాలనకు కేంద్రమైన సచివాలయంలో గత ఏడాది తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించి, పరిపాలనలో స్ఫూర్తిని తీసుకొచ్చామని గుర్తు చేశారు. రాష్ట్ర పరిపాలనలో, సంక్షేమ, అభివృద్ధి, కార్యక్రమాల్లో సోనియాగాంధీ, మన్మోహన్‌సింగ్ విజన్ అమలవుతుందన్నారు. ఆరు దశాబ్దాల ప్రజల ఆకాంక్షలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చిందని గుర్తు చేశారు. సోనియా గాంధీ ఎన్నో అడ్డంకులను అధిగమించి తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేశారన్నారు. తెలంగాణ రాష్ట్రం ఉన్నంత కాలం తెలంగాణ తల్లి అవతరణ దినోత్సవం, తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చిన సోనియా గాంధీ జన్మదిన ఉత్సవాలను జరుపుకుంటామన్నారు. రాష్ట్రంలోని 27 జిల్లా కలెక్టరేట్లలో తెలంగాణ తల్లి విగ్రహాలను ఆవిష్కరించడం పట్ల సిఎం హర్షం వ్యక్తం చేశారు.

# ఫిబ్రవరిలో దేశవ్యాప్త సమ్మె

### కార్మిక కోడ్‌ల రద్దు వరకు దశలవారీగా పోరు ఉధృతం
### కేంద్ర కార్మిక సంఘాల ప్రకటన

**న్యూఢిల్లీ:** కార్మిక వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్న కేంద్ర ప్రభుత్వం నాలుగు కోడ్‌లను రద్దు చేసేంత వరకు విశ్రమించేది లేదని, ఉద్యమాన్ని దశాలవారీగా ఉధృతం చేస్తామని కేంద్ర కార్మిక సంఘాల ఐక్య వేదిక ప్రకటించింది. ఉద్యమం తొలి దశలో భాగంగా వచ్చే ఏడాది ఫిబ్రవరిలో దేశవ్యాప్త సమ్మె చేపట్టబోతున్నట్లు తెలిపింది. ఇందుకు తేదీని ఈనెల 22న జరగబోయే సమావేశంలో నిర్ణయించి, ప్రకటిస్తామని పేర్కొంది. ఇదే క్రమంలో ఈనెల 26న జరగబోయే నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కార్మిక లోకానికి మంగళవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చింది. కార్పొరేట్లకు, యాజమాన్యాలకు లబ్ధి కలిగించే పద్ధతులు అనుసరిస్తూ సర్కారు చేసే తప్పుడు ప్రచారాన్ని బహిర్గతం చేస్తామని కార్మిక సంఘాలు హెచ్చరించాయి. ఎంఎస్‌పీ, పంట రుణ మాఫీ తదితర కనీస డిమాండ్ల కోసం పోరాడుతున్న సంయుక్త కిసాన్ మోర్చాతో సమన్వయం చేసుకొని తమ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని పేర్కొన్నాయి. తమ పోరాటానికి ప్రతిపక్ష పార్టీలతో పాటు అన్ని వర్గాల ప్రజల మద్దతును కోరాయి. కార్మిక సంఘాల ఐక్య వేదిక సోమవారం భేటీ అయి ప్రస్తుత పరిస్థితులను సమీక్షించింది. కార్మిక కోడ్‌లను అన్ని ప్రతిపక్ష పార్టీలు వ్యతిరేకించడాన్ని స్వాగతించింది. ఇండిగో సంక్షోభం, ప్రయాణికుల ఇక్కట్లు, వర్కర్లకు భద్రత లేకపోవడం, కార్పొరేట్ల దురహంకారం వంటి అంశాలను ప్రస్తావించింది. ప్రైవేటీకరణ, గుత్తాధిపత్యం వల్ల కలిగే నష్టం గురించి ముందే హెచ్చరించినట్లు తెలిపింది. ఇండిగో సంక్షోభంపై ఆందోళన వ్యక్తంచేస్తూ జ్యుడిషియల్ విచారణకు, బాధ్యులపై చర్యలకు, బాధితులకు పరిహారం కోసం డిమాండ్ చేసింది. ఇలాంటి అనుభవాల నుంచి ప్రభుత్వం పాఠాలు నేర్చుకోవాలని హితవు పలికింది. విద్యుత్, పెట్రోలియం, రైల్వే, రక్షణ, టెలికం, బ్యాంకింగ్ వంటి వ్యూహాత్మక రంగాల ప్రైవేటీకరణకు హడావిడి చర్యలు మానుకోవాలని సూచించింది. కార్మిక కోడ్‌లను రద్దు చేసేంత వరకు దశాల వారీగా పోరాటాన్ని ఉధృతం చేస్తామని కార్మిక సంఘాల ప్రకటన పేర్కొంది. జాతాలు, ర్యాలీలు, ఇంటింటి ప్రచారం వంటి వివిధ రూపాల్లో పోరాటాన్ని సాగించేందుకు కార్యాచరణ వారంలోగా సిద్ధం చేసుకోవాలని సమావేశం నిర్ణయించింది.

# అజయ్‌భవన్ సీనియర్ రెడ్‌గార్డ్ కామ్రేడ్ అమ్రీక్ సింగ్ ఆకస్మిక మృతి



**న్యూఢిల్లీ :** ఢిల్లీలోని సిపిఐ కేంద్ర కార్యాలయం అజయ్ భవన్‌లో సీనియర్ రెడ్ గార్డ్ కామ్రేడ్ అమ్రీక్ సింగ్ (76) ఆకస్మిక మరణం పట్ల సిపిఐ సంతాపం వ్యక్తం చేసింది. ఆదివారం రాత్రి ఛాతిలో ఇబ్బందిగా ఉండడంతో కుటుంబసభ్యులు ఆయనను ఆసుపత్రిలో చేర్చగా సోమవారం సాయంత్రం ఆయన మరణించారు. పంజాబ్‌లోని అమృత్‌సర్ జిల్లాకు చెందిన అమ్రీక్ సింగ్ నాలుగున్నర దశాబ్దాలకు పైగా పార్టీకి అంకితభావంతో సేవలు అందించారు. సిపిఐ కేంద్ర కార్యాలయంతో ఆయనకు ఉన్న సుదీర్ఘ అనుబంధం కారణంగా జాతీయ స్థాయిలో పార్టీ నాయకులతో పాటు దేశవ్యాప్తంగా ఉన్న కార్యకర్తలతో సన్నిహిత సంబంధాలు ఏర్పడ్డాయి. అంతే కాకుండా అనేక ముఖ్య రాజకీయ ఘటనలకు ఆయన సాక్షిగా నిలిచారు. కమ్యూనిస్టు దిగ్గజం చంద్ర రాజేశ్వరరావు ప్రధాన కార్యదర్శిగా ఉన్న సమయం నుంచే ఆయన అజయ్ భవన్‌లో పని చేయడం ప్రారంభించారు. అంతకు ముందు ఆయన ట్రేడ్ యూనియన్‌లో చురుకైన కార్యకర్తగా పని చేశారు. అమ్రీక్ సింగ్ క్రమశిక్షణ, పార్టీ అపారమైన ప్రేమ కలిగి ఉండేవారు. ఢిల్లీకి ఎవరు వెళ్ళినా ఆత్మీయంగా పలకరించి స్వాగతం పలికేవారు. హృదయపూర్వక, ఉల్లాసభరితమైన స్వభావం, స్వాగతించే ఉనికికి ప్రసిద్ధి చెందారు. సిపిఐ ఆయన కుటుంబ సభ్యులకు, స్నేహితులకు సహచరులకు ఒక ప్రకటనలో హృదయపూర్వక సంతాపాన్ని తెలియజేసింది. అజయ్‌భవన్‌లో నిర్వహించిన సంతాప సభలో సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, కార్యదర్శివర్గ సభ్యులు అమర్‌జీత్ కౌర్, రామకృష్ణ పాండా, డాక్టర్ కాంగో ఆయనకు నివాళి అర్పించారు.

# కొనసాగాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

కూడిన ధర్మాసనం పోల్ ప్యానల్‌కు సూచించింది. 'ఎస్‌ఐఆర్‌కు సహకరించకపోవడం, బిఎల్‌ఒల పనికి ఆటంకాలు కలిగించడం, బెదిరించడం వంటి ఘటనలను మా దృష్టికి తీసుకురండి. మేము వారికి తగిన ఉత్తర్వులు జారీ చేస్తాం' అని ఇసి తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది రాకేశ్ ద్వివేదీకి ధర్మాసనం చెప్పింది. రాకేశ్ ద్వివేదీ తన వాదనలు వినిపిస్తూ, 'పరిస్థితి మరింత తీవ్రమైతే, ఆయా రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోని పోలీసులను తమ డిప్యుటేషన్ కిందకు తీసుకురావడం తప్ప ఇసికి మరో మార్గం లేదని' అన్నారు. అయితే ఎన్నికల ప్రక్రియ ప్రారంభమయ్యే వరకు పోలీసులను ఇసి తన అధికార పరిధిలోకి తీసుకోలేదని జస్టిస్ బాగ్చి స్పష్టం చేశారు. దీనితో ఎస్‌ఐఆర్ విధులు నిర్వహిస్తున్న బిఎల్‌ఒలు, ఇతర అధికారులను బెదిరింపులకు గురిచేసినప్పుడు, అలాంటి సమస్యలను పరిష్కరించడానికి ఎలక్షన్ కమిషన్‌కు అన్ని రాజ్యాంగ అధికారాలు ఉన్నాయని రాకేశ్ ద్వివేది అన్నారు. ఎలాగైనా పరిస్థితులను చక్కదిద్దండి లేకపోతే అది అరాచకానికి దారితీస్తుంది. ఇది తీవ్రమైన సమస్య అని సిజెఐ జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. ఇక బెంగాల్‌లో తీవ్ర ఒత్తిడికి గురికావడం వల్లే బిఎల్‌ఒలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారనే వాదనను రాకేశ్ ద్వివేదీ తోసిపుచ్చారు. బిఎల్‌ఒలు ఒత్తిడికి గురవుతున్నారనే ప్రశ్నే లేదని పేర్కొన్నారు. ఎందుకంటే బిఎల్‌ఒలు రోజుకు 6 లేదా 7 ఇళ్లను, 30 నుంచి 35 మంది ఓటర్ల వివరాలను మాత్రమే తీసుకుంటారని చెప్పారు. దీనితో 'బిఎల్‌ఒలు చేసేది డెస్క్ పని కాదు. వాళ్లు ఇంటింటికీ వెళ్లి, ఎన్యూమరేషన్ ఫారమ్‌లను నింపాల్సి ఉంటుంది. ఆపై దానిని అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఇది పైకి కనిపించేంత సులభమైన పనికాదు' అని జస్టిస్ బాగ్చి అన్నారు. ఇక పిటిషనర్ సనాతని సంసద్, ఇతరుల తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది వి.గిరి తన వాదనలు వినిపిస్తూ, ఎస్‌ఐఆర్ పని చేస్తున్న బిఎల్‌ఒలను, ఇతర అధికారులను హింసిస్తున్నారని, బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అంతేకాదు వారిని రక్షించాలని ఎన్నికల కమిషన్‌కు ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

# ఉద్యోగాలొస్తాయ్

(మొదటి పేజీ తరువాయి)

డేటా సెంటర్స్, అంతర్జాతీయ స్థాయి ఉన్నత విద్యా సంస్థల జిల్లాలుగా మొత్తం ఆరింటిని నెలకొల్పనున్నట్టు శ్రీధర్ బాబు చెప్పారు. ఇక్కడ ఏర్పాటయ్యే వివిధ పరిశోధన సంస్థలు, గ్రీన్ ఫార్మా, మ్యాన్యుఫాక్చరింగ్, ఎంటర్ టెయిన్ మెంట్ జోన్ల ద్వారా మొత్తం 13 లక్షల మందికి ఉద్యోగాలు దొరుకుతాయి. 9 లక్షల జనాభా కోసం నివాస గృహాల సముదాయాలు ఏర్పాటు చేస్తాం. నిర్మాణ రంగంలో ఉన్నవారు వీటిని అభివృద్ధి చేస్తారు. మరో నెల రోజుల్లో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. డేటా సెంటర్ల కోసం 400 ఎకరాలు కేటాయిస్తున్నాం. వచ్చే ఫిబ్రవరి చివరలో ఇక్కడ నిర్మాణాలు మొదలవుతాయి. ఎంటర్ టెయిన్ మెంట్ జోన్ (డిస్ట్రిక్ట్ )లో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన కన్ వెన్షన్ సెంటర్లు ఏర్పాటు చేస్తాం. అడ్వెంచర్ కేంద్రాలు, స్టార్ హోటళ్లు నిర్మిస్తాం. ఫ్యూచర్ సిటీ అంతా ఒక ఆర్కిటెక్చరల్ అద్భుతంగా నిలుస్తుంది. భవిష్యత్తు అవసరాలకు సరిపోయే అత్యాధునిక రవాణా వ్యవస్థను ఏర్పాటు చేస్తాం. అర్బన్ ఫారెస్టులతో అంతా పచ్చదనం పర్చుకుని కనిపిస్తుంది. వంతారా వన్య ప్రాణుల సంరక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి రిలయన్స్ ఫౌండేషన్ ఒప్పందం కుదుర్చుకుంది.సిఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షలకు అనుగుణంగా ఈ జీరో కార్బన్ సిటీ ప్రపంచంలోనే ప్రఖ్యాత నగరంగా భాసిల్లుతుంది. ఇక్కడ కురిసే ప్రతి వర్షం చుక్క ఇక్కడే ఇంకిపోయేలా రెయిన్ హార్వెస్టింగ్ జరుగుతుంది. భూగర్భ జలాలకు కొదవ లేకుండా చేస్తాం.లైఫ్ సైన్సెస్, ఎలక్ట్రిక్ వాహనాల రంగాల్లో నూతన పరిశోధనలు, మ్యాన్యుఫ్యాక్చరింగ్ కేంద్రాలు ఉంటాయి.

# రాష్ట్రానికి రండి..

(మొదటి పేజీ తరువాయి)

ఒక నిజం స్పష్టంగా నిలుస్తుందని చెప్పారు. యుఎస్‌డి 200 బిలియన్, జిఎస్‌డిపి, 37 శాతం ఇన్వెస్ట్‌మెంట్ రేటుతో సంవత్సరానికి యుఎస్‌టి70–75 బిలియన్ తెచ్చినా, ఇప్పటీ కూడ యుఎస్‌డి 30 బిలియన్ పెట్టుబడి లోటు ఉంది, ఈ వ్యత్యాసం వేగంగా పెరుగుతోందన్నారు. ఈ లోటును పూడ్చేందుకు కోర్ అర్బన్ (క్యూర్) ఫెరీ అర్బన్ (ప్యూర్), రూరల్ అగ్రి(రేర్) జోన్‌ల అభివృద్ధికి పిపిపిలు ఇంధనంగా పనిచేస్తాయని డిప్యూటీ సిఎం వివరించారు. మెట్రోలు, సోలార్ పార్కులు, స్కిల్ హబ్‌లు వంటి రంగాల్లో ప్రైవేట్ పెట్టుబడులకు మార్గం వేస్తూ, మానవాభివృద్ధి మరియు నెట్ జీరో లక్ష్యాలకు ప్రభుత్వ నిధులను కేటాయించే అవకాశం పిపిపి లు ఇస్తాయని తెలిపారు. పెట్టుబడులకు హైదరాబాద్ స్వర్గధామమని, రాష్ట్రంలో పెట్టుబడులకు అనువైన వాతావరణం,తక్కువ ధరకు నైపుణ్యంతో కూడిన స్కిల్ లేబర్, శాంతి భద్రతలు, ఇన్వెస్టర్ ఫ్రెండ్లీ గవర్నమెంట్ వంటి అనేక సానుకూల అంశాలు ఉన్నాయని వివరించారు. చర్చా గోష్టిలో ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తాన్య, ఏషియన్ డెవలప్మెంట్ బ్యాంక్ డైరెక్టర్ మోయ ఒకా, బ్లాక్ స్టోన్ కంపెనీ ఎండి మోహిత్ అరో, క్యాపిటల్ ల్యాండ్ ట్రస్ట్ సిఈఒ గౌరీ శంకర్ నాగభూషణం, పిపిపి అడ్వైజరీ ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్ హర్ష చాందిని తదితరులు పాల్గొన్నారు.

# టెన్త్ పరీక్షలు

(మొదటి పేజీ తరువాయి)

కొనసాగుతాయి.

**పదవ తరగతి పరీక్షలకు నెల రోజులా? : ఎస్‌టియు టియస్**

ఎస్‌ఎస్‌సి పరీక్షలు నెల రోజులకు పైగా నిర్వహించడం సరికాదని ఎస్‌టియు టియస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.సదానందం గౌడ్, జుట్టు గజేందర్ ఒక ప్రకటనలో ఆక్షేపణ తెలిపారు. వచ్చే ఏడాది మార్చి 14 నుంచి ఏప్రిల్ 16వ తేదీ వరకు 33 రోజుల పాటు ఈ పరీక్షలు నిర్వహించటం ప్రయోగం చేస్తున్నట్లుగా ఉందన్నారు. అలాగే పరీక్షలను సిబిఎస్‌ఇ తరహాలో నిర్వహించాలనే ఉద్దేశ్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు కనబడుతున్నదని అన్నారు. సుదీర్ఘ కాలం పరీక్షలు నిర్వహించటం పట్ల విద్యార్థులు ఆందోళన చెందుతారని, పరీక్షల టైమ్ సవరించి, పది రోజుల్లో పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రశ్నా పత్రాలు భద్ర పరచడం, మూల్యాంకన ప్రక్రియలపై ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. ఏప్రిల్‌లో ఎండలు తీవ్రంగా ఉండడంతో విద్యార్థులు పరీక్షలు రాయడంలో ఇబ్బంది పడతారన్నారు. ఇది సరైన విధానం కాదన్నారు.

### టెన్త్ పరీక్షలు షెడ్యూల్ :

| తేదీ | సబ్జెక్టు | సమయం |
|---|---|---|
| 14.03.26 | ప్రథమ భాష (గ్రూప్) 1 | 9.30 నుంచి 12.30 గంటలు |
| | ప్రథమ భాష పార్ట్1 | 9.30 నుంచి 12.50 గంటలు |
| 18.03.26 | ద్వితీయ భాష | 9.30 నుంచి 112.30 గంటలు |
| 23.03.26 | తృతీయ భాష (ఇంగ్లీష్) | 9.30 నుంచి 12.30 గంటలు |
| 28.03.26 | గణితం | 9.30 నుంచి 12.30 గంటలు |
| 02.04.26 | సైన్స్ పార్ట్1 (ఫిజికల్ సైన్స్) | 9.30 నుంచి 11.00 గంటలు |
| 07.04.26 | సైన్స్ పార్ట్2 (బైయాజికల్ సైన్స్) | 9.30 నుంచి11.00 గంటల |
| 13.04.26 | సాంఘీక శాస్త్రం | 9.30 నుంచి 12.30గంటలు |
| 15.04.26 | ఓఎస్‌ఎస్‌సి పేపర్1 | 9.30 నుంచి 12.30 గంటలు |
| | ఎస్‌ఎస్‌సి ఓకేషనల్ (త్రీరీ) | 9.30నుంచి 11.30 గంటలు |
| 16.04.26 | ఓఎస్‌ఎస్‌సి పేపర్2 | 9.30 నుంచి12.30గంటలు |

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com